అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 6-7-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 186 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

మణిపూర్‌కు వామపక్షపార్టీల ఎంపీల బృందం

నేటి నుంచి మూడు రోజులపాటు పర్యటన

- హింసపై అధ్యయనం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో మే 3న చెలరేగిన హింసాకాండ నేటికీ కొనసాగుతున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులను అధ్యయం చేసేందుకు సీపీఐ(ఎం), సీపీఐ ఎంపీల బృందం పర్యటించ నుంది. మణిపూర్ ప్రజలకు సంఘీ భావం తెలిపేందుకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసేం దుకు, శాంతి భద్రతల పునరుద్ధరణ కోసం అధికారులతో మాట్లాడేందుకు (జులై 6 నుంచి 8 వరకు) మూడు ...11లో

కొనలేం-తినలేం

సెంచరీ దాటేసిన టమాటా







భారతీయ వంటకాలలో టమాటాకు ఉన్న ప్రాధాన్యత చెప్పనవసరం లేదు. అది కూర, చట్నీ, రసం, పప్పు కావచ్చు. టమాటా లేని వంటను ఊహించడం కష్టమే. అలాంటి టమాటాలపై ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో బోలెడన్ని ట్రోలింగ్‌లు. దానికి కారణం టమాటా ధరలు పెట్రోలు, డీజిల్ ధరలతో పోటీపడి పైపైకి ఎగబాకడమే. చాలా ప్రాంతాలలో ధర ఎప్పుడో సెంచరీని దాటేసింది.

న్యూఢిల్లీ : సామాన్యమధ్యతరగతి జనంపై భారం మరింతగా పెరుగుతోంది. పొద్దున లేచినప్పటినుంచి పూట గడవటమెలాగా అని బెంగపట్టుకుంటోంది. పెరుగుతున్న నిత్యావసరాలకు తోడుగా కూరగాయల ధరలు..జనం జేబులకు చిల్లులు పెడుతున్నాయి. కొద్దిరోజుల వరకు టమాటా కేజీ రూ. పది కూడా దాటనిది.ఇపుడు ఏకంగా వందకు పైనే పలుకుతుండటంతో..ఆచితూచి కొనాల్సివస్తుందని వినియోగదారులు అంటున్నారు. ఇక పలు ప్రాంతాలలో రుతుపవనాల కారణంగా జోరుగా వానలు పడుతుండడంతో టమాటాల రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీంతో డిమాండ్, సరఫరాల మధ్య వ్యత్యాసం పెరిగి ధరలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. జిహ్వాచాపల్యాన్ని చంపుకోలేక కొన్నామా... జేబులు ఖాళీ అవడం ఖాయం. ఒకప్పుడు రూ.10-20కి దొరికిన కిలో టమాటాలు ఇప్పుడు కనీసం వంద రూపాయలు పెడితే కానీ రావడం లేదు. కొన్ని ప్రాంతాలలో అది కూడా కష్టమే. ఒక్క మాటలో చెప్పాలంటే పెట్రోల్, డీజిల్ ధరలతో పోలిస్తే టమాటా ధరే ఎక్కువగా ఉంది.

ప్రధాన నగరాలలో కిలో టమాటాను రూ.58 నుండి రూ.148 రూపాయల వరకూ విక్రయిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లోనూ, దేశ ఆర్థిక రాజధాని ముంబయిలోనూ కిలో టమాటాలు రూ.80కి దొరుకుతుంటే కొల్‌కతాలో మాత్రం రూ.148 పలుకుతోంది. రాజధాని ఢిల్లీలో ధర రూ.110-117 మధ్య ఉంది. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అందించిన సమాచారం ప్రకారం దేశంలో కిలో టమాటాల సగటు ధర రూ.83.29గా ఉంది. మొత్తంమీద టమాటా సగటు ధర కిలోకు రూ.25-41 పెరిగింది. బెంగళూరులోని కేఆర్ మార్కెట్‌లో ఒకప్పుడు రూ.20-30కి దొరికిన టమాటాలు ఇప్పుడు రూ.100 పలుకుతున్నాయి. మిగిలిన కూరగాయల ధరలు కూడా పెరుగుతూనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలలో కూడా టమాటాలు సామాన్యులకు ఏ మాత్రం అందుబాటులో లేవు. విశాఖపట్నం, విజయవాడ నగరాలలో ధర రూ.90-120 పలుకుతోంది. తెలంగాణలోనూ ఇదే పరిస్థితి. కేరళలోని కొచ్చిలోనూ, ఇతర ప్రాంతాలలోనూ ధర ఇప్పటికే సెంచరీ దాటింది.

పెట్రోల్, డీజిల్ ధరలతో పోటి

రాజధాని న్యూఢిల్లీ, కొల్‌కతా, ముంబయి, చెన్నయ్ నగరాలలో బుధవారం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉన్నాయి. ఈ నగరాలలో లీటరు పెట్రోల్ రూ.96.72 నుండి రూ.106.31కు, డీజిల్ రూ.89.62 నుండి రూ.94.27కు లభిస్తోంది. అంటే పెట్రోల్, డీజిల్ ధరలతో పోలిస్తే కిలో టమాటా ధరే అధికంగా ఉంది.

అతిశయోక్తి కాదు కానీ కర్నాటకలో ఓ వ్యాపారి తాను విక్రయిస్తున్న టమాటాలను దొంగలు అపహరించకుండా కాపాడుకునేందుకు కూరగాయల పెట్టెలోనే ఓ కెమేరాను అమర్చాడు. టమాటాలను బంగారం కంటే భద్రంగా చూసుకుంటున్నారనడానికి ఇది ఓ ఉదాహరణ.

ఎందుకు పెరుగుతోంది?

రుతుపవనాలు ఆలస్యం కావడం, అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ ఉత్పత్తి వంటి కారణాలు టమాటా ధరలపై ప్రభావం చూపుతున్నాయి. టమాటాలు పండించే ప్రాంతాలలో వీచిన వడగాలులు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పంటకాలంలో వచ్చిపడిన అకాల వర్షాలు, వరదల కారణంగా ధరలు పెరిగాయని వ్యాపారులు తెలిపారు. అదీకాక టమాటాలు అధికంగా ...11లో

పురపాలన దేశానికే ఆదర్శం

పట్టణాల నుంచే 70శాతం ఆదాయం

- అందుకే అప్పులు తెచ్చి మౌలిక వసతుల కల్పన
- పదేండ్లలో కేంద్రం ఇచ్చింది కేవలం రూ.9వేల కోట్లే... : పురపాలకశాఖ వార్షిక నివేదికల విడుదలలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని పురపాలక సంస్థల పనితీరు దేశానికే ఆదర్శంగా ఉందని ఆ శాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. తెలంగాణకు 70 శాతం ఆదాయం పట్టణాల నుంచే వస్తున్నదనీ, అందుకే అప్పులు తెచ్చి మరీ అక్కడ మౌలిక సౌకర్యాలపై పెట్టుబడులు పెడుతూ స్థిరాస్తుల్ని పెంచుతున్నామని వివరించారు. శుక్రవారంనాడి క్కడి మెట్రోరైల్ ప్రధాన కార్యాలయంలో 2014 నుంచి 2023 వరకు పురపాలకశాఖ వార్షిక నివేదికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేండ్ల అభివృద్ధి ప్రజల కండ్లముందే ఉన్నదనీ, దాన్ని గుర్తించి వచ్చే ఎన్నికల్లో స్థిరమైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2014 నుంచి ఇప్పటిదాకా పురపాలక శాఖ ఖర్చు చేసిన అన్ని అంశాలు ఈ నివేదికల్లో ఉన్నాయని తెలిపారు. నివేదికలు ఇవ్వాలనీ ఎవరూ అడగలేదనీ, అయినా ప్రభుత్వ చిత్తశుద్ధి, పారదర్శకత ప్రజలకు తెలియాలనే ఏటా నివేదికలు విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ సూచన మేరకే అహ్మదాబాద్ తరహాలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో మున్సిపల్ బాండ్ల రూపంలో నిధులు సేకరించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు బాగుందికాబట్టే, కేంద్ర ప్రభుత్వం దాన్ని గుర్తించి అవార్డులు ఇవ్వక తప్పని పరిస్థితులు కల్పించామని చెప్పారు. పట్టణాల్లో ప్రజా రవాణాను మెరుగుపర్చడం, మెట్రోరైల్ విస్తరణ, ఎలక్ట్రిక్ బస్సులు, పాతబస్తీకి మెట్రో కనెక్టివిటీ, భవిష్యత్తులో నిరంతర నీటి సరఫరా, నాలాల మరమత్తు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఐదుగురు కేంద్ర మంత్రులు మారినా నగరంలో ప్రజారవాణాకు అవసరమైన రక్షణశాఖ భూములు ఒక్క ఎకరం కూడా ఇవ్వలేదని ఆక్షేపించారు. శామీర్‌పేట, మేడ్చల్‌వైపు డబుల్ డెక్కర్ స్కైవేలు కడతామన్నారు. మెట్రో రద్దీ పెరుగుతున్న దృష్ట్యా బోగీల సంఖ్యను పెంచే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. జలమండలి ద్వారా సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మిస్తున్నామనీ, కొండపోచమ్మ నుంచి ...5లో

పదవుల కోసం పాకులాడొద్దు

మనకు రాజ్యాంగం ఆక్సిజన్..ప్రజాస్వామ్యం భవిష్యత్తు

- కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే



న్యూఢిల్లీ : పదవుల కోసం వెంపర్లాడొద్దని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటంలో తమ పార్టీ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. "రాజ్యాంగం మనకు ...11లో

పర్సనల్ డేటా రక్షణ బిల్లుకు కేంద్రమంత్రివర్గం ఆమోదం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిల్లు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) బిల్లు 2023 ముసాయిదాకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్రమంత్రి వర్గ సమావేశమై ఆమోదించిన ...11లో



గిరిజనుడిపై మూత్ర విసర్జన

బీజేపీ ఎమ్మెల్యే అనుచరుడి దురాగతం

- మధ్యప్రదేశ్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..నిందితుడి అరెస్ట్



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఎమ్మెల్యే సహాయకుడొకడు కండకావరంతో కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తించాడు. తనకు ఇవ్వాల్సిన వేతనం అడిగిన పాపానికి ఓ గిరిజన యువకుడిపై దౌర్జన్యం చేశాడు. అంతటితో ఆగక మద్యం మత్తులో అతనిపై అమానవీయంగా మూత్ర విసర్జన చేశాడు. ఈ దృశ్యం సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో పోలీసులు నిందితుడిని మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు.

నిందితుడు ప్రవేశ్ శుక్లా బీజేపీ ఎమ్మెల్యే కేదార్‌నాథ్ శుక్లా సహాయకుడు. సింధి జిల్లాలో కొన్ని నెలల క్రితమే ఈ ఘటన ...2లో

ఉద్యోగుల కృషి ఫలితమే విద్యుత్ సంస్థల అభివృద్ధి

టీఎస్‌పీఈ జేఏసీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

- రిటైర్మెంట్ ఇవ్వండి : టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్వరాష్ట్రంలో విద్యుత్ సంస్థల అభివృద్ధికి ఉద్యోగుల చేసిన కృషి ఎనలేనిదనీ, దాన్ని ప్రభుత్వం ఎప్పుడూ గుర్తిస్తూనే ఉంటుందని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈజేఏసీ) ఆధ్వర్యంలో బుధవారంనాడిక్కడి ఎర్రగడ్డ టీఎస్‌జెన్‌కో ఆడిటోరియంలో జరిగిన విద్యుత్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. తలసరి విద్యుత్ వినియోగంలో ...2లో

హామీలన్నీ నీటి మూటలే..

2014 నాటి వాగ్దానాలకే దిక్కులేదు

- ధరాఘాతంతో సామాన్యుల బెంబేలు
- జీవనోపాధి కరువై నిస్తేజమవుతున్న యువత
- పట్టణాలలో కానరాని మౌలిక వసతులు


అందరికీ సత్వర న్యాయం లభించేలా చూస్తానని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని, ధరలను అదుపు చేస్తామని, స్మార్ట్ సిటీలు అభివృద్ధి చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దేశ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. అయితే ఈ తొమ్మిదేండ్ల కాలంలో.. ఇవన్నీ నీటి మీద రాతలేనని తేలిపోయింది.

బెంగళూరు/రాయ్‌పూర్/న్యూఢిల్లీ :

వచ్చే సంవత్సరం లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గతంలో మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై సింహావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే దేశంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను దాచిపెట్టడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతచిచ్చుతో మళ్లీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది.

పెరిగిన ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసి, నిత్యావసరాల ధరలను నియంత్రిస్తామని 2014 ఎన్నికల ప్రణాళికలో బీజేపీ హామీ ఇచ్చింది. అయితే గత సంవత్సరం ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఎనిమిది సంవత్సరా లలో ఎన్నడూ లేనంతగా 7.8%నికి చేరింది. అలాగే హోల్‌సేల్ ద్రవ్యోల్బణం 15.08%నికి చేరుకుంది. ఈ సంవత్సరంలో కూడా రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశించుకున్న 6% కంటే కొంచెం అధికంగానే ఉంది. ద్రవ్యోల్బణ పెరుగుదల ప్రభావం ప్రజల పొదుపుపై పడింది. గత ఆర్థిక సంవత్సరం మొదటి అర్థభాగంలో ప్రజల పొదుపు 30 సంవత్సరాల కనిష్ట స్థాయికి పడిపోయింది. నిత్యావసరాల ధరలు పెరుగుతున్నప్పటికీ ప్రజలు తాము దాచుకున్న సొమ్ములో నుండి కొంత మొత్తాన్ని తీసి వాటిని కొనుగోలు చేస్తున్నారు. అదే సమయంలో విలాస వస్తువులకు డిమాండ్ పెరగడం గమనార్హం. మోడీ హయాంలో దేశంలో అసమానతలు, పేదరికం పెరిగాయని పలు నివేదికలు కుండబద్దలు కొట్టాయి.



ఉద్యోగ కల్పనలో వెనుకబాటు

యువతకు ఉద్యోగావకాశాలను పెంచేందుకు ఉపాధి కల్పనా కేంద్రాలను కెరీర్ సెంటర్లుగా మారుస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాలలో ఉద్యోగాలు సృష్టిస్తామని గొప్పలు చెప్పింది. అయితే ప్రభుత్వం కేవలం ఉత్పత్తితో ముడిపడిన ఉద్యోగాల కల్పనకే ప్రాధాన్యత ఇచ్చిందని జేఎన్‌యూ రిటైర్డ్ ప్రొఫెసర్ అరుణ్ కుమార్ ...11లో



మరో 8 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతి

- వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మరో ఎనిమిది మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం.రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఒక్కో కాలేజీలో 100 సీట్ల ప్రవేశ సామర్థ్యంతో యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, జోగులాంబ గద్వాల, నారాయణపేట్, మెదక్, ములుగు, వరంగల్ జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజాగా ...11లో

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్

కొలీజియం సిఫారసు



జస్టిస్ ఉజ్జల్ భూయాన్ | జస్టిస్ ఎస్వీ భట్టి

న్యూఢిల్లీ : తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌కు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఆయనతోపాటు కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టిని కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పిస్తూ సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసుతో సుప్రీంకోర్టు జడ్జిగా ...5లో

కార్మిక కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కనీస వేతనాలు సవరించాలి : జీపు జాతాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



నవతెలంగాణ-మహేశ్వరం

ప్రీమియర్ ఎనర్జీస్ పరిశ్రమలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో 15 ఏండ్లుగా పని చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదని, రాష్ట్రప్రభుత్వం యాజమాన్యాలకు లొంగి కనీస వేతన చట్టాన్ని సవరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతన చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న జీపు జాతా.. రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌లోని మంఖాల్ ఫ్యాబ్ సిటీ హార్డ్‌వేర్ పార్కులో బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న మంకాల, రావిరాల, మహేశ్వరం ప్రాంతాల్లో ఉన్న కార్మికులను యజమానులు నిలువు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాబ్ సిటీలో ఉన్న ప్రీమియర్ ఎనర్జీస్ ...11లో



(ఫైల్)

నవతెలంగాణ సీజీఎం సోదరుడు ప్రసాదరావు కన్నుమూత

- సీపీఐ(ఎం) తెలంగాణ, ఏపీ కార్యదర్శుల సంతాపం

ఒంగోలు : పీఎల్ఆర్ బ్రదర్స్ వ్యాపార సంస్థల అధినేత, నవతెలంగాణ సీజీఎం పి ప్రభాకర్ సోదరుడు పంగులూరి ప్రసాదరావు (63) అనారోగ్యంతో ఒంగోలులోని కేశవస్వామి నగర్‌లోగల తన స్వగృహంలో బుధవారం కన్నుమూశారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రసాదరావు భార్య సునీత రెండేండ్ల క్రితం మృతి చెందారు. చీమకుర్తి మండలం కెవి పాలేనికి ప్రసాదరావు గ్రానైట్, కంకర, క్వారీయింగు బిజినెస్‌లో గత మూడు దశాబ్దాలుగా మంచి ...11లో

చికెన్ ధరలు



హైదరాబాద్

వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 118
రిటైల్ (లైవ్)	రూ. 140
స్కిన్‌తో	రూ. 203
స్కిన్‌లెస్	రూ. 231

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు నేడే ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో బుధవారం 4,605 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. అయితే ధ్రువపత్రాల పరిశీలనకు గురువారమే ఆఖరు తేదీ కావడం గమనార్హం. ఈ మేరకు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. 76,643 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. బుధవారం నాటికి 44,112 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని వివరించారు. ఈనెల ఎనిమిదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువుందని పేర్కొన్నారు. అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు నమోదు చేయాలని సూచించారు. గురువారమే ధ్రువపత్రాల పరిశీలనకు ఆఖరు తేదీ కావడంతో ప్రాసెసింగ్ ఫీజు చెలించి స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులందరూ హాజరుకావాలని కోరారు. పూర్తిస్థాయి నోటిఫికేషన్, ఇతర వివరాల కోసం www. ://tseamcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

గిరిజనుడిపై మూత్రవిసర్జన

(మొదటిపేజీ తరువాయి)

జరిగినప్పటికీ దీనికి సంబంధించిన పది సెకన్ల వీడియోను మంగళవారం సామాజిక మాధ్యమాలలో ప్రదర్శించారు. పోలీసుల కథనం ప్రకారం...36 ఏండ్ల దశ్మత్ రావత్ కుబ్రి గ్రామంలోని మార్కెట్‌కు వెళుతుండగా ప్రవేశ్ ఎదురుపడ్డాడు. అప్పటికే అతను మద్యం మత్తులో ఉన్నాడు. రావత్ అతని వద్దకు వెళ్లి తనకు రావాల్సిన వేతనం గురించి అడిగాడు. దీంతో మండిపడిన ప్రవేశ్ అతనిపై దాడి చేసి, ఆ తర్వాత మూత్ర విసర్జన చేశాడు. బాధితుడైన రావత్ కోల్ గిరిజన తెగకు చెందిన వాడు. కాగా జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అతని కుటుంబసభ్యులు భయపడ్డారు. అయితే విషయం తెలియగానే తమంత తామే పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని బహ్రి పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ పవన్ సింగ్ చెప్పారు. నిందితుడిపై జాతీయ భద్రతా చట్టాన్ని (ఎన్ఎస్ఏ) ప్రయోగించాలని సిఫార్సు చేసినట్టు తెలిపారు.

కాంగ్రెస్ ఆగ్రహం

ఈ ఘటనపై సకాలంలో చర్యలు తీసుకోవడంలో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ విమర్శించింది. గిరిజనులను బీజేపీ అవమానిస్తోందని మండిపడింది. బీజేపీ మనస్తత్వానికి ఈ ఘటన అద్దం పడుతోందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రాంత్ భూరియా వ్యాఖ్యానించారు. రోజూ ఇలాంటి వందలాది సంఘటనలు జరుగుతున్నాయని, అయితే అవి వెలుగులోకి రావడం లేదని చెప్పారు.

ఎమ్మెల్యే బుకాయింపు

ప్రవేశ్ శుక్లాతో తనకు ఎలాంటి సంబంధం లేదని బీజేపీ ఎమ్మెల్యే కేదార్‌నాథ్ శుక్లా బుకాయించారు. ప్రవేశ్ తనకు సహాయకుడు కాదని చెప్పారు. 'ప్రవేశ్ నాకు తెలుసు. కానీ అతను బీజేపీ కార్యకర్త కాదు. నా ప్రతినిధి కాదు. విషయం తెలిసి ముఖ్యమంత్రితో మాట్లాడాను. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని అన్నారు. అయితే కేదార్‌నాథ్‌తో ప్రవేశ్ సంబంధాలను నిరూపించే కరపత్రాలు, బ్యానర్లు, పోస్టర్లు, ఇతర పత్రాలు సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రవేశ్ తండ్రి రామ్ శంకర్ శుక్లా విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు ఎమ్మెల్యేకు సహాయకుడేనని స్పష్టం చేశారు. గత నాలుగైదు సంవత్సరాలుగా అతను ఎమ్మెల్యే ప్రతినిధిగా పని చేస్తున్నాడని తెలిపారు.

కాగా నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీడీ శర్మ తెలిపారు. ఇది దురదృష్టకరమైన సంఘటన అని చెప్పారు. అయితే కేసును కప్పిపుచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బీజేపీకి ఎదురుదెబ్బే

ఈ సంవత్సరం చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించాలని తహతహలాడుతున్న బీజేపీలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. గత కొంతకాలంగా కోల్పోతున్న గిరిజనుల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు ఆ పార్టీ చేస్తున్న ప్రయత్నాలకు గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లయింది. 2018 ఎన్నికలలో రాష్ట్రంలోని 47 ఎస్టీ స్థానాలలో బీజేపీ 16 స్థానాలను మాత్రమే గెలుచుకుంది. 2013లో ఆ పార్టీకి 31 ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు లభించాయి. బీజేపీ ప్రయత్నాలపై ఈ ఘటన నీళ్లు చల్లిందని పేరు చెప్పడానికి ఇష్టపడని సీనియర్ పాత్రికేయుడు ఒకరు తెలిపారు. బీజేపీని ఈ సంఘటన చాలా కాలం వెంటాడుతుందని వ్యాఖ్యానించారు.

ఉద్యోగుల కృషి ఫలితమే విద్యుత్ సంస్థల అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రం నెంబర్‌వన్ స్థానంలో ఉన్నదనీ, ఫలితంగా రాష్ట్ర ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. గతాన్ని మర్చిపోకూడదనీ, పరాయి పాలనలో కరెంటు కోసం ఎన్ని గోసలు పడ్డామో ఇప్పటి పిల్లలకు తెలియదని వివరించారు. సాధించిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంతర విద్యుత్ వెలుగుల కోసం తాము పడిన కష్టం ఫలించిందనీ, దీన్ని ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు. సుదీర్ఘకాలం సంస్థ సీఎమ్‌డీగా పనిచేశాననీ, వయోభారం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కుంటున్నాననీ తెలిపారు. తాను రిటైర్ అవుతానని ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రులకు నేరుగా చెప్పలేకపోతున్నానని భావోద్వేగానికి గురయ్యారు. విద్యుత్ ఉద్యోగులు, ముఖ్యమంత్రి కేసీఆర్, తనతోటి సీఎమ్‌డీలతో తనకున్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో డిస్కంల సీఎమ్‌డీలు జీ రఘుమారెడ్డి, ఏ గోపాలరావు, టీఎస్‌పీఈజేఏసీ చైర్మెన్ సాయిబాబా, కన్వీనర్ పీ రత్నాకరరావు, కో-చైర్మెన్ శ్రీధర్, కో-కన్వీనర్ బీసి రెడ్డి, వైస్ చైర్మెన్ వజీర్, శ్యామ్ సుందర్, తులసీ నాగరాణి, ఫైనాన్స్ సెక్రెటరీ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, సీఎమ్‌డీలను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

ల్యాండ్ పూలింగ్‌లో దళారుల నొక్కుడు

పేద దళిత, గిరిజనుల భూములపై కన్ను

- రాయబారం పేరిట బలవంతపు ఒప్పందం
- అధికారులు, ప్రజాప్రతినిధులకూ ఇవ్వాలని దాదాగిరి
- 20 మంది రైతుల నుంచి రూ.8 కోట్ల విలువైన స్థలాలు అగ్రిమెంట్
- ఎదురు తిరిగిన యువ రైతు.. ఫిర్యాదుతో దోపిడీ బహిర్గతం



నవతెలంగాణ-బోడుప్పల్

దళిత గిరిజన రైతుల భూముల విలువ పెంచాలని సర్కారు మంచి లక్ష్యంతో ప్రారంభించిన ల్యాండ్ పూలింగ్‌లో దళారులు చొరబడ్డారు. రాయబారం పేరిట కోట్ల రూపాయల విలువైన భూములను అప్పనంగా కాజేసేందుకు యత్నించారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు కూడా మామూళ్లు ఇచ్చే పేరిట ఏకంగా బలవంతపు ఒప్పందాలకు పూనుకున్నారు. ఇప్పటికే పలువురు రైతుల నుంచి కొంత భూమిని లాక్కున్న దళారులు.. భూమి ఇవ్వకుంటే పూర్తిగా మీకు చెందకుండా చేస్తామని ఇతర రైతులను బెదిరింపులకు దిగుతున్నారు. కొందరి దగ్గర భూములకు బదులుగా లక్షల రూపాయల చేతివాటం ప్రదర్శించినట్టు తెలుస్తోంది. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల పరిధిలో సర్వే నెంబర్ 62లోని దళిత గిరిజనులకు చెందిన భూమిని సర్కార్ ల్యాండ్ పూలింగ్ కింద తీసుకుని హెచ్ఎండీఏ లే అవుట్ చేసింది. అందుకు బదులుగా ఒక్కో రైతు కుటుంబానికి ఎకరానికి 600 గజాల చొప్పున ఇచ్చేలా మాట ఇచ్చింది. దాని ప్రకారమే సుమారు 30 మంది రైతులు భూమిని సర్కారుకు అప్పగించారు. ఈ ప్రక్రియలో తాము పైరవీ చేశామని, తమతోపాటు కొంత మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారంటూ కొంతమంది దళారులు (ఐదుగురు) ఒక్కో రైతు కుటుంబం నుంచి వంద గజాల చొప్పున బలవంతంగా అగ్రిమెంట్లు చేసుకున్నారని తెలిసింది. ఒకవేళ తమకు వంద గజాల స్థలం అగ్రిమెంట్ ఇవ్వకపోతే మీ భూమి మీకు చెందకుండా చేస్తామని భయ భ్రాంతులకు గురిచేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 కుటుంబాలు ఇప్పటికే దళారులకు వంద గజాల చొప్పున అగ్రిమెంట్ చేసినట్టు సమాచారం. ఇంకొందరి దగ్గర భూమికి బదులుగా లక్షలాది రూపాయలు వసూళ్లు చేశారని బాధితులు వాపోతున్నారు.

యువ రైతు ఫిర్యాదుతో వెలుగులోకి..

రైతుల నుంచి బలవంతంగా వంద గజాల చొప్పున అగ్రిమెంట్ చేసుకుంటున్న విషయంలో.. మేడిపల్లికి చెందిన యువ రైతు కూతాడి శివకుమార్ దళారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వంద గజాలు ఇచ్చేది లేదంటూ ఎదురు తిరిగాడు. దళారులు మోసాలను బహిర్గతం చేసేందుకు.. వారు చేసుకున్న అగ్రిమెంట్లను సంపాదించి గత నెల 9న మేడిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో దళిత గిరిజన రైతుల నుంచి బలవంతంగా అగ్రిమెంట్లు చేసుకున్న పంగ ఉమా శంకర్, బి.నరసింహ (జామ కాయల) పంగ నరసింహ, పంగ లక్ష్మయ్య పంగ అర్జున్‌పై 384,504, రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్టు సీఐ గోవర్ధన గిరి తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : కూతాడి శివకుమార్

మా తాత ముత్తాతలకు నాటి ప్రభుత్వం భూములు ఇచ్చింది. ప్రస్తుతం ఆ భూములు సాగుకు అనుకూలంగా లేకపోవడంతో ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ కింద తీసుకుని హెచ్ఎండీఏ లేఅవుట్ చేసి ఒక్కో రైతు కుటుంబానికి ఎకరానికి 600 గజాల చొప్పున ఇచ్చేందుకు ముందుకొచ్చింది. కానీ కొందరు దళారులు తాము పైరవీలు చేశామంటూ.. రైతుల నుంచి 100 గజాల చొప్పున బలవంతంగా అగ్రిమెంట్ చేయించుకోవడం దారుణం. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు

టీఎన్జీవో సంపూర్ణ మద్దతు

ఆగస్టు 12న చలో హైదరాబాద్

- పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నిర్వహించబోయే పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు, ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమానికి టీఎన్జీవో కేంద్రసంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర, చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్‌ను టీఎన్జీవో అధ్యక్షులు ఎం రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఆవిష్కరించారు.

ఈనెల 16 నుంచి 33 జిల్లాల గుండా చేపట్టబోయే పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రతోపాటు వచ్చేనెల 12న జరగబోయే చలో హైదరాబాద్ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులే కాకుండా పాత పెన్షన్‌లో ఉన్న వారు కూడా పాల్గొనాలని రాజేందర్, జగదీశ్వర్ చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సీపీఎస్ యూనియన్ నాయకులను కలిపిస్తామన్నారు. సీఎంపై సంపూర్ణ నమ్మకముందనీ, పాత పెన్షన్ పునరుద్ధరింపజేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్, సీపీఎస్ యూనియన్ రాష్ట్ర నాయకులు దర్శన్‌గౌడ్, పోల శ్రీనివాస్, ఉపేందర్, రవిచంద్ర, శ్రావణ్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు, మహిళా కార్యవర్గ సభ్యులు రమ, సంధ్యారాణి, హావిల తదితరులు పాల్గొన్నారు.

పీజీ డిప్లొమా హోల్డర్ల హోదా కుదింపు

- అయోమయంలో 22 వేల మంది వైద్యులు
- ఎన్ఎంసీ నిర్వాకం

న్యూఢిల్లీ: కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ (సీపీఎస్) నుండి పీజీ డిప్లొమాలు పొందిన 22 వేల మంది వైద్యుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా తయారైంది. దీనికి కారణం జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఈ సంవత్సరం మేలో జారీ చేసిన నూతన నిబంధనలు. దేశంలోని వైద్యుల కోసం ఒకే రిజిస్టర్‌ను రూపొందించాలని ఎన్ఎంసీ నిర్ణయించింది. అయితే సీపీఎస్ జారీ చేసిన పీజీ డిప్లొమాలు గుర్తించేందుకు నిరాకరించింది. పీజీ డిప్లొమాలు పొందిన వారిలో మత్తుమందు నిపుణులు,ఛాతీ నిపుణులు, శస్త్రచికిత్స నిపుణులు, సైక్రియాట్రిస్టులు,రేడియాలజిస్టులున్నారు. వీరు అనేక సంవత్సరాల పాటు తమ తమ రంగాలలో అనుభవం గడించారు. కొత్త నిబంధనల కారణంగా తాము సాధారణ ఎంబీబీఎస్ వైద్యానికే పరిమితం అవుతామని వారు ఆందోళన చెందుతున్నారు. ఇది వైద్య వృత్తికి చెందిన కొందరు వైద్యులు, అధికారులు తీసుకున్న పక్షపాతపూరితమైన, అనాలోచిత నిర్ణయమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా..

- ఏడు సార్లు గెలిపించారు... : మంత్రి ఎర్రబెల్లి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఏడుసార్లు గెలిపించారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. అమెరికాలోని వర్జీనియాలో మంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మంత్రి కుటుంబంతో పాటు సినీ నిర్మాత దిల్‌రాజు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ శ్రేణులు, తానా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ తనను గెలిపించిన ఉమ్మడి వరంగల్ జిల్లా, వర్ధన్నపేట, పాలకుర్తి నియోజక వర్గాల ప్రజలకు ఎప్పుడూ రుణ పడి ఉంటానని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఎన్నారై కుటుంబాన్ని కాపాడుకుంటానని చెప్పారు. ప్రభుత్వం తరపున ఏ సహాయం కావాలన్న అందించే బాధ్యత తనదేనని భరోసానిచ్చారు. సీఎం దయతో మంత్రినయ్యానని తెలిపారు. తన జన్మదిన వేడుకలను నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వెనక్కి తగ్గిన యూజీసీ

- అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి పీహెచ్‌డీను తప్పనిసరి చేయాలనే నిర్ణయం రద్దు

న్యూఢిల్లీ: అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి పీహెచ్‌డీలను తప్పనిసరి చేయాలనే తన నిర్ణయంపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వెనక్కి తగ్గింది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నది. అయితే, నెట్, సెట్, ఎస్ఎల్ఈటీ వంటి పరీక్షలు పోస్టుకు ప్రత్యక్ష నియామకానికి కనీస ప్రమాణాలు అని అధికారులు తెలిపారు. "అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం కోసం పీహెచ్‌డీ అర్హత ఐచ్ఛికంగా కొనసాగుతున్నది. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్ఈటీ), స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎస్ఈటీ), స్టేట్ లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎస్ఎల్ఈటీ)లు అన్ని హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ కోసం ఈ పోస్టుకు నేరుగా రిక్రూట్‌మెంట్ చేయడానికి కనీస ప్రమాణాలు" అని యూజీసీ చైర్మెన్ ఎం. జగదీశ్ కుమార్ స్పష్టం చేశారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు వ్యాగన్ ఫ్యాక్టరీ..

8న ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన

- ప్రజలకు మరోసారి బీజేపీ ప్రభుత్వం మొండిచేయి
- రైల్వే కార్మిక సంఘాల్లో భిన్న వాదనలు
- వరంగల్ వాసుల్లో అసంతృప్తి



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పీరియాడిక్ ఓవరాయిలింగ్ (పీఓహెచ్) యూనిట్‌ను మంజూరు చేయడంతో తీవ్ర విమర్శలొస్తున్నాయి. ఈ క్రమంలో వ్యాగన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈనెల 8వ తేదీలోపు జీఓ కూడా వస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పిన విషయం విదితమే. కేంద్ర కేబినెట్ సమావేశం జరిగినా.. మంత్రి చెప్పినా... జీఓ మాత్రం రాలేదు. కాగా, ఈనెల 8వ తేదీన ప్రధాని మోడీ వరంగల్‌కు వచ్చి వ్యాగన్ తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేయనున్న తరుణంలో రైల్వే కార్మిక సంఘాల్లోని కొన్ని సంఘాలతో.. వ్యాగన్ ఫ్యాక్టరీకి అనుకూలంగా ప్రకటన ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైల్వే వ్యాగన్ పరిశ్రమకు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి తేడా తెలియదని పలు రైల్వే కార్మిక సంఘాలు చెప్పడం పట్ల విమర్శలకు తావిస్తోంది. 'జాక్' పేరిట పలు రైల్వే కార్మిక సంఘాలు ప్రజల చిరకాల వాంఛకు భిన్నమైన వాదనను తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ నాయకుల ప్రేరణ ఉన్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు.

రాష్ట్ర ఏర్పాటులో భాగంగా పార్లమెంటులో చేసిన విభజన చట్టంలో తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీతోపాటు, గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీని నిర్మిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అయితే దశాబ్దాలుగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలనే డిమాండ్ ఉంది. ఇందుకు రైల్వే కార్మిక సంఘాలే కాకుండా రాజకీయ పార్టీలు సైతం ఉద్యమించాయి. ఈ క్రమంలో 1985లో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని ప్రకటించినా వివిధ కారణాలతో ఆ పరిశ్రమను పంజాబ్‌లోని కపుర్తాలకు తరలిపోయింది. ఇది కాజీపేటకు తొలిసారి జరిగిన ఆశాభంగం. కపుర్తలాలో రూ.888 కోట్ల అంచనా వ్యయంతో కోచ్ ఫ్యాక్టరీని నిర్మించగా, ఏటా 1,500 కోచ్‌లను తయారు చేస్తున్నారు. 6,623 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

అనంతరం రాయ్‌బరేలిలో 2007లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని రూ.3,192 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించారు. ఇప్పుడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గుజరాత్‌కు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని తరలించి, కాజీపేటలో వ్యాగన్ పీరియాడిక్ ఓవరాయిలింగ్ యూనిట్‌ను మంజూరు చేసింది. దాంతో రాష్ట్ర ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో విమర్శలు పెరగడంతో కాజీపేటలో పీఓహెచ్ యూనిట్ స్థానంలో వ్యాగన్ తయారీ కేంద్రాన్ని రూ.521 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్టు కేంద్రం ప్రకటించింది. అంతేకాకుండా, 2019లో విశాఖపట్నంకు రూ.150 కోట్లతో పీఓహెచ్ యూనిట్‌ను మంజూరు చేసింది.

కోచ్‌కు, వ్యాగన్‌కు తేడా లేదా..?

రైల్వే కోచ్‌లకు, రైల్వే వ్యాగన్‌లకు తేడా తెలియనంత అమాయకులుగా ప్రజలను కేంద్ర ప్రభుత్వం భావించడం విస్మయాన్ని కలిగిస్తున్నది. ఈ విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మాటల యుద్ధం ప్రారంభమై రాజకీయ విమర్శలకు దిగడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రైల్వే కోచ్‌లు ప్రయాణీకులు ప్రయాణించేవి కాగా, వ్యాగన్‌లు వస్తువులను రవాణా చేసేవి. రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి నిధులు అధికంగా ఉండటమే కాకుండా చాలా యూనిట్లు ఇందులో భాగంగా పనిచేయాల్సి ఉంటుంది. కార్మికులకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వ్యాగన్ పరిశ్రమలో కంటే రైల్వే కోచ్‌లో పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయి. ఈ తేదాలు ప్రజలకు తెలియదని బీజేపీ నేతలు వ్యాగన్ పరిశ్రమ, కోచ్ ఫ్యాక్టరీ ఒక్కటేనన్న విధంగా ప్రచారం చేయడం గమనార్హం.



మీ సేవా ఉద్యోగులకు కనీస వేతనాలు పెంచాలి

- ఐటీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌కు ఉద్యోగుల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మీసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు పెంచాలని తెలంగాణ మీ సేవా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఐటీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌కు ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు జె. వెంకటేష్, అధ్యక్షులు ఆర్. సురేష్, ప్రధాన కార్యదర్శి జెనీమా, కోశాధికారి ఎవీబీ లక్ష్మి, సహాయ కార్యదర్శి కవిత, ఉపాధ్యక్షులు బాల్‌రాజు మెమోరాండం అందజేశారు. వేతనాల పెంపు కోసం ఏడాది కోరుతున్నామన్న విషయాన్ని జె.వెంకటేశ్ గుర్తుచేశారు. మీ-సేవా కేంద్రాలు అందించే సేవల ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగం జరుగుతున్నదని మంత్రి కేటీఆర్ పలు సందర్భాల్లో అన్న విషయాన్ని ప్రస్తావించారు. మీ-సేవా మేనేజర్‌కు రూ.17 వేలు, ఆపరేటర్‌కు రూ.13,922, హౌస్‌కీపింగ్ సిబ్బందికి రూ.5,305 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఛార్జీలతో సహా అన్నిరకాల నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిన క్రమంలో ఆ వేతనాలతో బతకడం ఎలా అని అడిగారు. రాష్ట్రంలో రెండో పీఆర్సీ అమలు కానున్న నేపథ్యంలో మీ-సేవా ఉద్యోగుల కనీస వేతనాలు పెంపుదలకు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

గొర్ల పంపిణీని వేగవంతం చేస్తాం

- జూన్‌లోపు పదివేల మందికి పంచుతాం
- 300 కి.మీ బయట అనుమతి
- నగదు బదిలీపై సర్కారే నిర్ణయం తీసుకోవాలి
- జీఎంపీఎస్ బృందానికి పశుసంవర్థక శాఖ డైరెక్టర్ హామీ
- 12న తలపెట్టిన ముట్టడి కార్యక్రమం తాత్కాలిక వాయిదా : ఉడుత రవీందర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గొర్ల పంపిణీ ఆలస్యమవుతుండటంతో గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) బాటపట్టింది. ఇప్పటికే ఆయా జిల్లాలు, మండల కేంద్రాల్లో వివిధ రూపాల్లో నిరసనలు తెలిపింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దిగి రాకపోవడంతో ఈనెల 12న పశుసంవర్థక శాఖ వద్ద ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ప్రకటించింది. దీనికి స్పందించిన పశ సంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్. రాంచందర్...బుధవారం జీఎంపీఎస్ రాష్ట్ర బృందాన్ని చర్చలకు ఆహ్వానించారు. ఇందులో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిల్లె గోపాల్, ఉడుత రవీందర్, రాష్ట్ర నాయకులు అవిశెట్టి శంకరయ్య, బొల్లం అశోక్, కాడబోయిన లింగయ్య, అమీర్‌పేట్ మల్లేష్, మద్దెపురం రాజు, పరికి మధుకర్, కాల్వ సురేష్, కడెం లింగయ్య, ఎక్కలదేవి కొమురయ్య తదితరులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గొర్ల కాపర్లకు సంబంధించిన పది డిమాండ్లను డైరెక్టర్ ముందుంచారు. గొర్ల పంపిణీలో దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ చేయాలనే డిమాండ్ మంచిదే అయినప్పటికీ అది తన పరిధిలో లేదని డైరెక్టర్ చెప్పారు. గొర్ల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. జులై నెలఖారులో పదివేల మందికి పంపిణీ చేస్తామని తెలిపారు. గొర్ల యూనిట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కొనుగోలు కేంద్రాలను రద్దు చేయాలని పట్టుబట్టారు. డీడీ చెల్లించిన లబ్దిదారులు 300 కిలో మీటర్ల బయట గొర్లను ఎంపిక చేసుకుని కొనుకునేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అందుకనుగుణంగా త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అప్పుడు పెంపకందార్లు తమకు నచ్చిన చోట గొర్లను కొనుక్కోవచ్చని సూచించారు. మొదటి విడతలో మిగిలిపోయిన లబ్దిదారులకు, రెండోవిడత లబ్దిదారులకు గొర్లను పంపిణీ చేస్తామని వివరించారు. గొర్ల పంపిణీకి కుల ధ్రువీకరణ సర్టిఫికేట్లు ఇవ్వాలంటూ అధికారులు మెలిక పెడుతున్నారనీ, దీంతో డబ్బు, సమయం వృథా అవుతుందనీ, సొసైటీలు ఎంపిక చేసిన లబ్దిదారులకు గొర్ల యూనిట్లు ఇవ్వాలని జీఎంపీఎస్ బృందం కోరింది. ఈ అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ-లాబ్ నమోదు కార్యక్రమంలో తప్పిపోయిన పేర్లను గుర్తించి సరిదిద్దుతామని తెలిపారు. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులను నియమిస్తామని హామీ ఇచ్చారు. వివిధ ప్రమాదాల్లో మరణించిన గొర్లకు బీమాను చెల్లించని కంపెనీలపై చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నట్టల మందులను సరఫరా చేస్తున్నామనీ, ఎక్కడైనా అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఉడుత రవీందర్ మాట్లాడుతూ ఈనెల 12న తలపెట్టిన ముట్టడి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు తెలిపారు.

కిర్బీ పరిశ్రమలో సీఐటీయూ హ్యాట్రిక్

46 ఓట్లతో బీఆర్ఎస్‌కేవీపై సీఐటీయూ విజయం

- మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు గెలుపు
- ఇది కార్మికుల విజయం
- ప్రతి కార్మికుడికి అండగా ఉంటాం
- కార్మికుల భారీ విజయోత్సవ ర్యాలీ





నవతెలంగాణ - పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని కిర్బీ పరిశ్రమలో జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ముచ్చటగా మూడోసారి విజయకేతనం ఎగురవేసింది. పటాన్‌చెరు మండలం పాశ మైలారం పారిశ్రామికవాడలోని కిర్బీ పరిశ్రమలో బుధవారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్ఎస్వీపీ, బీఎంఎస్, టీఎన్‌టీయూసీ మహాకూటమిగా ఏర్పడినప్పటికీ కార్మికులు సీఐటీయూకే పట్టంగట్టారు. పరిశ్రమలో మొత్తం 604 ఓట్లకుగాను 600 ఓట్లు పోలయ్యాయి. నలుగురు గైర్హాజరయ్యారు. సీఐటీయూకు 323 ఓట్లు రాగా మహాకూటమికి 277 ఓట్లు వచ్చాయి. 46 ఓట్ల మెజారిటీతో సీఐటీయూ విజయభేరి మోగించింది. కార్మికులు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పరిశ్రమ నుంచి పటాన్ చెరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్మికుల ఆనందోత్సవాల మధ్య చుక్క రాములు మాట్లాడుతూ.. ఇది కార్మిక విజయమని అన్నారు. మాజీ కార్మిక శాఖ మంత్రి పెద్దిరెడ్డిని కార్మికులు విశ్వసించలేదని తెలిపారు. ప్రతిపక్ష యూనియన్లు ఎన్ని అవాంతరాలు సృష్టించినా కార్మికులను అనేక విధాలుగా ప్రలోభాలకు గురిచేసినప్పటికీ నమ్మకంతో సీఐటీయూను గెలిపించారని, ఈ నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్మికుల పక్షాన ముందుండి పోరాడుతామని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షులు కే రాజయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాండురంగారెడ్డి, నరసింహారెడ్డి, నాగేశ్వరరావు, కిర్బి పరిశ్రమ నాయకులు వీఎస్ రాజు, మల్లేష్ వివిధ పరిశ్రమల నాయకులు శ్రీనివాస్, తలారి శ్రీను, వీరప్ప, సుధాకర్, విట్టల్, ప్రభు, శంకర్, వివిధ పరిశ్రమల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాగర్ సిమెంట్ పరిశ్రమలో ఎలక్ట్రానిక్ లోడర్

- 100% విద్యుత్, జీరో శాతం కాలుష్య ప్రమాణమే లక్ష్యం
- సాగర్ సిమెంట్ ఎండి సమ్మిడి ఆనందరెడ్డి



నవతెలంగాణ-మఠంపల్లి

పరిశ్రమలో 100శాతం విద్యుత్, జీరో శాతం కాలుష్య ప్రమాణమే లక్ష్యంగా.. ఎలక్ట్రానిక్ లోడర్‌ను ఏర్పాటు చేశామని సాగర్ సిమెంట్ ఎండి సమ్మిడి ఆనందరెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని సాగర్ సిమెంట్ పరిశ్రమలో వోల్వా కంపెనీకి చెందిన ఎలక్ట్రానిక్ లోడర్‌ను వోల్వా కంపెనీ ఎండి డెమిట్రావ్ కృష్ణన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2030 నాటికి 50శాతం విద్యుత్ వాడకం, 2050 నాటికల్లా వందశాతం విద్యుత్ వాడకంతో కాలుష్యాన్ని నియంత్రించడమే తమ ధ్యేయమన్నారు. దక్షిణ భారతదేశంలోనే పరిశ్రమలలో ఎలక్ట్రానిక్ యంత్రం మొట్ట మొదటిసారిగా సాగర్ సిమెంట్ పరిశ్రమలో ప్రారంభించామని తెలిపారు.

దేశవ్యాప్తంగా(ఎస్‌టీపీ) సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లుగా మార్చేందుకు ఇప్పటికి పది పరిశ్రమలు ఎస్టీపీలో చేరాయని చెప్పారు. రానున్న 30 ఏండ్ల కాలంలో వాయుకాలుష్యం లేకుండా, డీజిల్, బొగ్గు, లైమ్ స్టోన్, నీరు, ఆయిల్ వాడకం తగ్గిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం బ్యాటరీ ద్వారా నడిచే యంత్రాలు వచ్చాయని, రానున్న రోజుల్లో హైడ్రోజన్, పవర్ కనెక్టివిటీతో నడిచే యంత్రాలు తీసుకొస్తామన్నారు.

వోల్వో ఎండి మాట్లాడుతూ.. వాతావరణం ఇదేవిధంగా ఉంటే నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుతుందని తెలిపారు. ఈయంత్రాల వాడకం ద్వారా ఒకటిన్నర డిగ్రీల టెంపరేచర్‌కు తగ్గించేందుకు దోహదపడతాయన్నారు. ఇప్పటికి తాము 1000 వాహనాలు తయారు చేశామన్నారు. ఎలక్ట్రికల్ యంత్రం గంటపాటు చార్జింగ్ పెడితే ఏడు, ఎనిమిది గంటలు పనిచేస్తుందని తెలిపారు. డీజిల్ కంటే తక్కువ ఖర్చు వస్తుందన్నారు. తమ సిమెంట్ పరిశ్రమ పర్యావరణం, ఆరోగ్య భద్రత, ఉద్యోగి సంక్షేమం, సామాజిక అభివృద్ధి వంటి అనేక అంశాల్లో సమాజ అభివృద్ధి కోసం పాటుపడుతుందని చెప్పారు. భారతదేశంలోనే అత్యంత గౌరవప్రదమైన ఆకర్షణీయమైన కంపెనీగా ఉండటం, తమ భాగస్వాములందరికీ సంపద కల్పించడం అంతిమ లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ప్రెసిడెంట్ పి.గణేష్ సమ్మిడి సిద్దార్థరెడ్డి, సమ్మిడి అనిశ్‌రెడ్డి, గ్రూప్ వైస్‌ప్రెసిడెంట్ అంజిరెడ్డి, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కూతురు ప్రేమ పెండ్లి చేసుకుందని..

వరుడు, మరో ముగ్గురి ఇండ్లు దహనం చేసిన తండ్రి

- పోలీసుల మోహరింపు.. అదుపులో 8మంది






నవతెలంగాణ -నర్సంపేట

కూతురు ప్రేమ పెండ్లి చేసుకోవడం ఇష్టం లేని ఓ తండ్రి.. వరుడు, అతనికి సహకరించిన ముగ్గురి ఇండ్లకు నిప్పంటించి దగ్ధం చేసిన అమానుష సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాలపెల్లి గ్రామంలో బుధవారం సంచలనం రేకెత్తించింది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. ఇటుకాలపెల్లి గ్రామ సర్పంచ్ మండల రవీందర్ కూతురు కావ్యశ్రీ.. హసన్‌పర్తి మండలం ఎస్ఆర్ యూనివర్సిటీ సమీపంలో ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కాగా, అదే గ్రామానికి చెందిన యువకుడు జాలిగం రంజిత్, కావ్యశ్రీ కొంతకాలంగా ప్రేమించుకున్నారు. జూన్ 30న కావ్య శ్రీ కళాశాల నుంచి రంజిత్‌తో బయటకొచ్చింది. ఈ నెల 1న కొందరి యువకుల సహకారంతో ఓ గుడిలో పెండ్లి చేసుకున్నారు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న కావ్యశ్రీ తండ్రి రవీందర్ హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 4న పోలీసులు కావ్యశ్రీ, రంజిత్‌ను అదుపులోకి తీసుకుని తల్లిదండ్రుల ఎదుట కౌన్సెలింగ్ చేశారు. రంజిత్‌తోనే తాను జీవనం సాగిస్తానని కావ్యశ్రీ స్పష్టం చేసింది. దాంతో మనస్తాపం చెందిన రవీందర్, అతని కుటుంబ సభ్యులు ఆగ్రహించి బుధవారం రంజిత్ ఇంటిని, అతనికి సహకరించిన సామల రాకేష్, సమీప శివారు గ్రామంలోని బూస ప్రవీణ్ ఇండ్లకు వెళ్లి.. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులను లేపి బయటకు వెళ్లగొట్టారు. అనంతరం ఇంటికి నిప్పంటించి దగ్ధం చేశారు. ఈ సంఘటనలో ఇండ్లలోని విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. నిల్వ ఉంచిన పత్తి దిగుబడులు దహనమయ్యాయి. ఒక్కో ఇంటిలో రూ.లక్ష విలువైన వస్తువులు కాలి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ చెప్పారు. సంఘటనా స్థలానికి ఏసీపీ సంపత్‌రావు, సీఐ పులి రమేష్, ఎస్ఐలు రవీందర్, సురేష్ చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

వచ్చే రెండ్రోజులు భారీ వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే రెండు రోజులు పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. ఆ జాబితాలో ఖమ్మం నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, సంగారెడ్డి, ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలున్నాయి. బుధవారం రాత్రి 8 గంటల వరకు రాష్ట్రంలో 120కిపైగా ప్రాంతాల్లో వర్షం కురిసింది. మహబూబాబాద్ జిల్లా గంగారంలో 5.75 సెంటీమీటర్ల వర్షం పడింది.

తెలంగాణ మట్టికి ఘన చరిత్ర

- తెలంగాణ సాహిత్య అకాడెమీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్



నవతెలంగాణ-ధూల్ పేట్

తెలంగాణలో ఏ ప్రాంత మట్టిని ముట్టుకున్నా, ఏ ఊరును కదిపినా చరిత్ర ఊటలాగా పుట్టుకొస్తుందని తెలంగాణ సాహిత్య అకాడెమీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ అన్నారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ సిటీ కళాశాలలో బుధవారం జరిగిన 'మన ఊరు మన చరిత్ర' ప్రాజెక్టుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చరిత్రను రాయడానికి సిద్ధపడిన వారు చరిత్రను నిర్మిస్తారని సిటీ కళాశాల విద్యార్థులు నిరూపించారన్నారు. కాకతీయుల కాలం నుంచి నేటి వరకు తెలంగాణ గ్రామీణ చరిత్రను వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో సిటీ కళాశాల విద్యార్థులు తిరిగి రాయాలని సూచించారు. వీర తెలంగాణ పోరాటంలో గ్రామీణ యువకులు చేతికర్రను తుపాకీగా మార్చి ఆధిపత్యవాదులపై అలుపెరగని పోరాటం చేసిన విధానాన్ని చరిత్రగా రాయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాల్లో సబ్బండ వర్ణాలు, కులాలు, వారితో ముడివేసుకున్న సాంస్కృతిక, సామాజిక, సాంఘిక పరిస్థితులను పరిశోధించి ప్రత్యేకమైన ప్రాజెక్టుగా రూపొందించాలన్నారు. డిగ్రీ పట్టా విలువ కంటే తమ స్వగ్రామాల గురించి రాసే చరిత్ర ఎంతో విలువైనదని, చెప్పారు. విద్యార్థులు రూపొందించిన ఈ చరిత్ర రేపటి కలక్టరేట్ల గెజిట్లుగా ఉపయోగపడతాయని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడెమీ ఇచ్చిన పిలుపును అందుకుని రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు చేపట్టిన రెండు వేల 'మన ఊరు మన చరిత్ర' ప్రాజెక్టులు సమకాలీన తెలంగాణ చరిత్రకు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. సిలబస్‌లో లేని గొప్ప పాఠం, పాఠంలో లేని గొప్ప సంస్కారం, విజ్ఞానం మన గ్రామాల్లో దాగి ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయాన్ని, తరగతి గదిని తగిన రీతిలో ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సిటీ కళాశాల విద్యార్థులు 33 బృందాలుగా ఏర్పడి 33 గ్రామాల చరిత్రలను ప్రాజెక్టులుగా రూపొందించి తెలంగాణ సాహిత్య అకాడెమీకి సమర్పించటం అభినందనీయమైన్నారు. చేర్యాల, కొడకంచి, నడిగూడెం, చందాపూర్ తదితర గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాలకు సంబంధించిన ఎన్నో విలువైన విషయాలను అధ్యయనం చేసి ప్రామాణికమైన ప్రాజెక్టులుగా మలచటంతో మిగతావారికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను గౌరీశంకర్ ఆవిష్కరించారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను పాఠ్యప్రణాళికలో భాగం చేయటమే కాకుండా వాటికి మార్కులు కేటాయించినందుకు ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్‌ను అభినందించారు.

డెక్కన్ హెరిటేజ్ అకాడెమీ ట్రస్ట్ అధ్యక్షులు మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ.. డెక్కన్ ప్రాంతంలో ప్రతి గ్రామానికీ ప్రత్యేక చరిత్ర ఉందని, చారిత్రకంగా గ్రామాలు స్వయం సమృద్ధిగా రూపొందిన ప్రగతి పరిణామాన్ని విద్యార్థులు పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పుట్టిన ఊరును కూడా ఒక విలువైన గ్రంథంగా విస్తృతమైన పరిశోధన ప్రయోగశాలగా చేసుకుని కొత్త వైజ్ఞానిక సామాజిక విషయాలను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మన ఊరు -మన చరిత్ర జిల్లా కన్వీనర్ డాక్టర్.కోయి కోటేశ్వరరావు, కళాశాల కన్వీనర్ డాక్టర్.డి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయిజాజ్ సుల్తానా, డాక్టర్ విప్లవ్ దత్‌శుక్లా, డాక్టర్ నీరజ, డాక్టర్ భాస్కర్, డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ అధికారుల కిడ్నాప్ కలకలం

- నిందితులను పట్టుకున్న పోలీసులు
- క్షేమంగా బైటపడిన అధికారులు
- హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఘటన



నవతెలంగాణ-చైతన్యపురి

సీజ్ చేసిన స్క్రాప్ దుకాణానికి పంచనామ చేసేందుకు వచ్చిన జీఎస్టీ అధికారులను వ్యాపారులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటన హైదరాబాద్ సరూర్‌నగర్‌లో సంచలనం సృష్టించింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని అధికారులను విడిపించారు. ఇందుకు సంబంధించి ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపిన వివరాల ప్రకారం..సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీ సాయి కృష్ణనగర్ కాలనీలో గ్రేడ్ వన్ స్క్రాప్ దుకాణం ఉంది. దుకాణాదారు పన్ను చెల్లించకపోవడంతో మంగళవారం జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. జీఎస్టీ చెల్లించడం లేదని నిర్ధారణకు వచ్చిన అధికారులు దుకాణాన్ని సీజ్ చేశారు. బుధవారం జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ మనీష్, సూపరింటెండెంట్ ఆనంద్ పంచనామా చేస్తున్నారు. ఈ క్రమంలో దుకాణ యజమాని ఖయ్యాం మాట్లాడేది ఉందంటూ అధికారులిద్దరినీ పక్కకు తీసుకెళ్లాడు. వారిని మాటల్లో పెట్టి మరో ఇద్దరు వ్యాపారులతో కలిసి అధికారులను బలవంతంగా కారులో ఎక్కించారు. క్షణాల్లో కారులో అక్కడి నుంచి పరారయ్యారు. ఐడీ కార్డులు లాక్కున్నారు. వారిపై దాడి చేయడంతోపాటు డబ్బులు డిమాండ్ చేశారు. ఇదంతా గమనించిన జీఎస్టీ అధికారుల కారు డ్రైవర్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన ఉన్నతాధికారులు సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి అధికారుల సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా మలక్‌పేట్‌లో కారును గుర్తించారు. రాజీవ్ చౌక్ వద్ద కిడ్నాపర్ల కారును పట్టుకొని అధికారులను క్షేమంగా విడిపించారు. నలుగురు నిందితులు సయ్యద్ ఫిరోజ్, ముజీబ్, ఇంతియాజ్, ముశీర్‌ను సరూర్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరో ప్రధాన నిందితుడు ఖయ్యూమ్ పరారీలో ఉన్నట్టు డీసీపీ తెలిపారు.

భూమి కౌలుకు ఇవ్వలేదని యువకుని హత్య

- కత్తితో పొడిచిన గ్రామస్తుడు



నవతెలంగాణ-తాంసి

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో దారుణ ఘటన జరిగింది. వ్యవసాయ భూమి తనకు కౌలుకు ఇవ్వలేదని యువకుడిని హత్య చేశారు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్లి(టి) గ్రామంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్న ఆత్రం అంకుష్(24)కు వ్యవసాయ భూమి ఉంది. దాన్ని ఓ వ్యక్తికి కౌలుకు ఇచ్చాడు. అయితే, తనకు కౌలుకు ఇవ్వలేదన్న కోపంతో అదే గ్రామానికి చెందిన కుమ్ర భీంరావ్ మంగళవారం రాత్రి అంకుష్‌తో గొడవ పడ్డాడు. తనకు కాకుండా మరొకరికి ఎలా ఇస్తావంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. మాటా మాటా పెరగడంతో భీంరావ్ అంకుష్‌ను కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని రిమ్స్‌కు తరలించగా.. బుధవారం మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఎస్ఐ రాధిక సంఘటన స్థలానికి చేరుకుని శవ పంచనామ నిర్వహించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు నిందుతునిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా రాజగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ అపాయింట్‌మెంట్ లెటర్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, ఇన్‌చార్జీలు తరుణ్‌చుగ్‌లకు పంపారు. ఆయన నియామకం తక్షణం అమల్లోకి వస్తుందని అందులో పేర్కొన్నారు. ఆయన కాంగ్రెస్ గూటికి చేరకుండా ఆపడంలో భాగంగానే జాతీయ నాయకత్వం ఈ పదవిని ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. అయినా, కోమటిరెడ్డి ఆ పార్టీని వీడబోతున్నారని తెలుస్తున్నది. త్వరలో రాష్ట్రంలో రాహుల్ గాంధీతోగానీ, ప్రియాంకగాంధీతోగానీ భారీ బహిరంగ సభ పెట్టించి ఆ వేదిక మీదుగా రాజగోపాల్‌రెడ్డి హస్తం పార్టీలో చేరబోతున్నారని మునుగోడు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం జరుగుతున్నది.

పనిచేసే ప్రతిసారీ సత్ఫలితాలు రావు కానీ చేయకపోతే
ఏ ఫలితమూ ఉండదు - బెంజమన్ డిజ్రేలి

సంపాదకీయం

ఇది... ముమ్మాటికీ వివక్షే...

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల్లో ఒకటి దళిత బంధు. దాంతోపాటు ఇటీవల ప్రవేశపెట్టిన 'బీసీలకు ఆర్థిక సాయం' కూడా అంతే ప్రతిష్టాత్మకమైందంటూ ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఇవి రెండూ ఎస్సీలు, బీసీల ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడతాయంటూ బీఆర్ఎస్ సర్కార్ చెబుతూ వస్తున్నది. తద్వారా సామాజికంగానూ వారిని సమున్నత స్థాయిలో నిలబెడతామంటూ అది ప్రకటించింది. ఇక్కడ సామాజిక ఎదుగుదల అంటే ఏమిటనే ప్రశ్న ఉత్పన్నంగాక మానదు. ఇతర కులాలు, వర్గాలతో వారిని సమానంగా చూడటం, మెరుగైన జీవన ప్రమాణాలతో వారిని, వారి పిల్లలను విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో పైకి తీసుకు రావటమే సామాజిక ఎదుగుదల.

> అసలే వర్షాకాలం. ఇప్పటికే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వర పీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో 'ఆరోగ్య రంగంలో తెలంగాణ నెంబర్ వన్, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశాం.. సీజనల్ వ్యాధులు తగ్గాయి...' అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాధీశులు... పంచాయతీ కార్మికులు ఒక్కసారి సమ్మెలోకి వెళితే ఏమవుతుందో ఆలోచించుకోవాలి. సమ్మెను నివారించలేకపోతే పంచాయతీల్లోని వీధులు, గల్లీలూ, రోడ్లు ఊర్చేవారు లేక.. చెత్త ఎత్తేసేవాడు లేక.. మురికి కాల్వలు, నాలాలు శుభ్రం చేసే నాథుడే లేక కంపు కొట్టటం ఖాయం. అప్పుడు సీజనల్ వ్యాధులు మరింత ప్రబలటం తథ్యం.

నిశితంగా పరిశీలిస్తే అలాంటి ఎదుగుదలకు అవసరమైన చర్యలను చేపట్టే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని నిర్మొహమాటంగా చెప్పొచ్చు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ కార్మికుల జీవన స్థితిగతులే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. వారి సమస్యల పట్ల సర్కారుకు చీమకుట్టినట్టయినా లేదు. వీటిపై అనేకసార్లు విజ్ఞాపన పత్రాలు సమర్పించినా, పాదయాత్రలు చేసినా... ఆఖరుకు సమ్మె నోటీసును అందజేసినా... 'ఏం చేసుకుంటారో చేసుకోపోండి...' అన్నట్టుగానే ప్రభుత్వం వ్యవహరించింది తప్ప వారి గోడును పట్టించుకున్న పాపాన పోలేదు. ఇది ఉద్దేశపూర్వక నిర్లక్ష్యమే కాదు... ముమ్మాటికీ వివక్ష అని కూడా చెప్పక తప్పదు. ఎందుకంటే పంచాయతీ కార్మికుల్లో అత్యధిక మంది దళితులే. కొన్నిచోట్ల బీసీలు, ఇతర కులాల వారు కూడా ఉండొచ్చు. ఈ క్రమంలో తెలంగాణలో అత్యధికంగా ఉన్న వీరి పట్ల పాలకవర్గాల స్వభావానికి ఈ వివక్షే దృష్టాంతమని చెప్పక తప్పదు.



అయినా పంచాయతీ కార్మికులు అడుగుతున్నది సాధారణ అంశాలే తప్ప గొంతెమ్మ కోర్కెలు కానే కాదు. మల్టీ పర్పస్ విధానాన్ని తీసుకురావటం ద్వారా తమ ఉద్యోగ భద్రతకు సంబంధించి ఒక ప్రమాదకరమైన అంశాన్ని జీఓ నెం.51 రూపంలో తీసుకురావటాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. పంచాయతీ పరిధిలో గతంలో తమకు కేటాయించిన ఒక పనికాకుండా నాలుగైదు రకాల పనులు చేయాల్సి రావటం వారికి కత్తి మీద సాముగా మారింది. దాంతో మోరీలు తీసేవాడు.. కరెంటు పోలెక్కి ప్రాణాలు కోల్పోతున్న దుస్థితి అనేక ఊర్లలో కనబడుతున్నది. మరోవైపు వారి వేతనాల విషయంలో దుర్మార్గమైన చర్యకు సర్కారు పాల్పడటం అత్యంత శోచనీయం. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతీ ఐదొందల మందికి ఒక కార్మికుణ్ణి నియమించిన సర్కారు 14 ఏండ్ల తర్వాత ఇప్పుడు పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆ కార్మికుల సంఖ్యను పెంచింది. అదే సమయంలో పెరిగిన కార్మికుల సంఖ్యకు అనుగుణంగా వేతనాలు ఇవ్వకుండా చోద్యం చూస్తోంది. 'చాటలో తవుడు పోశాం.. తన్నుకు చావండి...' అన్నట్టు ఒక్కరికి చెల్లించే వేతనాన్నే ఇద్దరు, ముగ్గురు పంచుకోవాలంటూ వెకిలి వేషాలేస్తోంది. ఇది అత్యంత బాధ్యతారాహిత్యం. వీటితోపాటు సర్కారు వారు తలచుకుంటే ఇట్టే పరిష్కరించగలిగే పలు చిన్న చిన్న సమస్యలపైన పంచాయతీ కార్మికులు సర్కారు ముందు 'పంచాయితీ' పెట్టారు. అయినా ఏలినవారు కనికరించలేదు.. సమస్యలను పరిష్కరించలేదు. అందుకే విసిగిపోయిన వారు గురువారం నుంచి సమ్మె శంఖారావాన్ని పూరించనున్నారు.

ఇప్పుడు అసలే వర్షాకాలం. ఇప్పటికే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వర పీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో 'ఆరోగ్య రంగంలో తెలంగాణ నెంబర్ వన్, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశాం.. సీజనల్ వ్యాధులు తగ్గాయి...' అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాధీశులు... పంచాయతీ కార్మికులు ఒక్కసారి సమ్మెలోకి వెళితే ఏమవుతుందో ఆలోచించుకోవాలి. సమ్మెను నివారించలేకపోతే పంచాయతీల్లోని వీధులు, గల్లీలూ, రోడ్లు ఊర్చేవారు లేక.. చెత్త ఎత్తేసేవాడు లేక.. మురికి కాల్వలు, నాలాలు శుభ్రం చేసే నాథుడే లేక కంపు కొట్టటం ఖాయం. అప్పుడు సీజనల్ వ్యాధులు మరింత ప్రబలటం తథ్యం. ఆ పరిస్థితి తలెత్తితే దానికి ఎవరు బాధ్యులు..? అప్పుడు 'నిమ్స్‌లో కొత్త బిల్డింగ్, ఎంజీఎంలో 28 అంతస్తుల భవనం, జిల్లాలో మెడికల్ కాలేజీ...'లు కూడా ప్రాణాంతక వ్యాధులను నివారించలేవు. అందుకే పంచాయతీ కార్మికుల సమస్యలను గుర్తించి, పరిష్కరించటమనేది సర్కారు తక్షణ కర్తవ్యంగా ఉండాలి. అందుకోసం వారి పట్ల ఉన్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని, వివక్షాపూరిత చర్యలను విడనాడి కార్యాచరణ ప్రకటించాలి.

నీడ కోసం పోరుబాటై...

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పేదలు పెద్ద సంఖ్యలో కదులుతున్నారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. నిర్బంధాన్ని తట్టుకుని, పాములు, తేళ్ళ మధ్య బతుకుతున్నారు. పాలకులు పట్టించుకోరు. ప్రభుత్వాలే భూములు అమ్మకానికి పెడుతున్నాయి. బడాబాబులు కబ్జాలు చేస్తున్నారు. ఇంకేమాత్రం ఆలస్యం చేసినా, పేదలకు జానెడు జాగా కూడా మిగలదన్న ఆందోళన పేదల్లో పెరిగిన ఫలితమే ఈ ఉద్యమం. వీరికి భరోసా ఇచ్చేందుకు తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నాయకత్వ బృందం బస్సుయాత్ర చేసింది. 19జిల్లాలలోని 64పోరాట కేంద్రాల్లో పర్యటించింది. గుడిసెవాసు లతోపాటు తింటూ, వారితోపాటే గుడిసెల కేంద్రాల్లో బస చేసింది. రాష్ట్ర నాయకులు హెూటల్ గదుల్లో, గెస్ట్‌హౌజుల్లో ఉంటారని మాత్రమే వారికి తెలుసు. తమతోపాటు గుడిసెల్లో బస చేస్తారని వారు ఊహించ లేదు. అందుకే వారికి కొండంత విశ్వాసం కలిగింది.



ఎస్. వీరయ్య

ఓట్లకోసం పాకులాడటమే తప్ప పాలకులకు వీరి పాట్లు పట్టవు. కేంద్రంలో మోడీ సర్కారు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద, 2022 డిసెంబర్ 31 నాటికే ఇండ్లులేని పేదలకు ఇండ్లు కట్టిస్తామని ప్రకటించింది. ఆ గడువు దాటింది. మోడీ మళ్ళీ ఆ ఊసెత్తడంలేదు. ప్రధాని నివాసం మాత్రం, ప్రభుత్వ డబ్బుతో, 36228 చదరపు అడుగుల స్థలంలో 2,26,203 చదరపు అడుగుల భవనం నిర్మించుకుంటున్నారు. తడిక చాటు లేని మహిళల బతుకులు ఎంత దుర్భరమో కదా! ఆడబిడ్డల అవసరాలు పట్టవు. అందలం ఎక్కినవారికి మాత్రం అన్నీ కావాలి. రాష్ట్ర పాలకులు కూడా ముఖ్యమంత్రి నివాసం, సచివాలయం నిర్మాణానికి ఇచ్చిన ప్రాధాన్యత పేదల ఇండ్ల నిర్మాణానికి ఇవ్వలేదు. దశాబ్దాల కాంగ్రెసు పాలనలో నిర్లక్ష్యానికి గురైన పేదలు నేటికీ గూడు కోసం గోడు వినిపించవల్సిన పరిస్థితే!

ఇంటి సౌకర్యం పేదల హక్కు. రాజ్యాంగంలోని 21వ అధికరణం ఈ దేశంలోని పౌరులందరికీ జీవించే హక్కు ఉన్నదని చెప్పింది. ఇంటి సౌకర్యం జీవించే హక్కులో భాగమేనని గత సంవత్సరం ఢిల్లీ హైకోర్టు చెప్పింది. ఇంటి కోసం ప్రైవేటు భూముల్లోకి పోజాలరు కదా! పేదలు మరొకరి సొమ్ము ఆశించరు. కష్టార్జితంతో బతుకుతారు. కానప్పుడు పాలకులు ఆదుకోవాలంటారు. కనీస వేతనాలు కూడా లేవు. కేంద్రంలో బీజేపీ సర్కారు, కనీస వేతనం రోజుకు రు.178గా నిర్ణయించింది. అంటే నెలకు రు.4628. ఈ వేతనంతో కుటుంబం బతకాలట! ఇక్కడ కూడా ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు రాష్ట్ర పాలకులు కోటి మంది కార్మికులకు వర్తించే కనీస వేతనాలు సవరించలేదు. కుటుంబపోషణకే చాలని వేతనాలతో, పేదలు జీవితకాలమంతా పనిచేసినా, ఇంటిస్థలం కూడా కొనలేరు. ఇక ఇల్లు కట్టేదెప్పుడు? అందుకే ఇది ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వ స్థలాలంటే ప్రజల ఆస్తి. అందుకే ప్రజలు గుడిసెలు వేస్తున్నారు.

> ఇల్లు వాకిలి లేక పేదలు ఇబ్బందులు పడుతుంటే కొందరు ప్రజాప్రతినిధులు వింతవాదనలు చేస్తున్నారు. మహబూబాబాద్ ప్రజాప్రతినిధి పేదలను 'ఎక్కడ పుట్టి ఇక్కడ గుడిసెలు వేస్తున్నార'ని దూషించారు. పేదలు కూడా ఆయన్ను 'ఎక్కడ పుట్టి ఇక్కడ శాసనసభ్యుడివయ్యావ'ని ప్రశ్నిస్తే ఏం జవాబు చెపుతారు. ఏ జిల్లాలో పుట్టి, పెరిగినా మహబూబాబాద్‌లో పోటీ చేసే హక్కు ఆయనకు రాజ్యాంగం ఇచ్చింది. పేదలు కూడా ఎక్కడ పుట్టినా మహబూబాబాద్‌లో పనిచేసుకుంటూ, అక్కడే స్థిరపడే హక్కు అదే రాజ్యాంగం ఇచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రజల దృష్టి మరల్చేందుకు గృహలక్ష్మి పథకం విధివిధానాలు ప్రకటించింది. ఇది సమస్య పరిష్కారానికి ఉపయోగపడదు. రిజిస్టరయిన ప్లాటు, రేషన్‌కార్డు ఉన్న పేదలకే వర్తిస్తుంది. అదికూడా ఆ ప్లాటు మహిళ పేరు మీద ఉంటేనే. దేశంలో సాధారణంగా ఆస్తి పురుషుల పేరు మీదనే ఉంటున్నది. ఇక ఈ పథకం వర్తించేది ఎవరికి? ఎక్కడో ఒకరున్నా, వారు డబుల్ బెడ్రూం ఇల్లు నక్ష దాఖలు చేస్తే వచ్చేది రూ.3లక్షలు. ప్రభుత్వం గుండుగుత్తగా నిర్మించే ఇండ్లకే రూ.8.5లక్షలవు తున్నపుడు, రూ.3లక్షలు ఏమూలకు? ఎవరికి వారు నిర్మించుకుంటే ఖర్చు రెట్టింపవుతుంది. ఇంత చేస్తే, ఈ పథకం వర్తించేది సొంత ప్లాటు ఉన్నవారికే. ఇంటి జాగ కూడా లేని లక్షలాది పేదల పరిస్థితి ఏమిటి? జీఓ నెం.58, 59 కూడా విడుదల చేసింది. ఆచరణలో ప్లాటు ఉన్న పేదలకు వర్తించే జీఓ నెం.58 ప్రచారం కోసమే. ప్రభుత్వ భూములు కారుచవకగా పెద్దలకే జీఓ నెం.59 పేరుతో కట్టబెడుతున్నారు.

పోలీసులు, రెవెన్యూ అధికారులు, మునిసిపల్ అధికారులు, రియలెస్టేట్ కబ్జాదారులతో కుమ్మక్కవు తున్నారు. అనేకచోట్ల పేదల మీద దాడులు చేస్తున్నారు. బడాబాబుల కబ్జాలను మాత్రం పట్టించుకోరు. రంగారెడ్డి జిల్లాలో 17వేల ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 5వేల ఎకరాలు కోటీశ్వరుల కబ్జాలో ఉన్నాయి. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటి కబ్జాకోర్లతో కుమ్మక్కై దాడులకు తెగబడుతున్నారు. అనివార్యమైతే కబ్జాకోర్లమీద సివిల్ కేసులు పెడతారు. పేదలమీద మాత్రం దాడులు చేసి, క్రిమినల్ కేసులు పెడుతున్నారు. మహిళలు, గర్భిణులని కూడా చూడకుండా లాఠీచార్జి చేస్తున్నారు. 530మంది పేదలమీద కేసులు బనాయించారు. 35మంది మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు మోపారు. వీరంతా దళితులు, బడుగు బలహీన వర్గాలే. 212మంది గుడిసెవాసులను బైండోవర్ చేసారు. మహిళలతో సహా 54మంది పేదలను జైలుకు పంపారు. ఆదివాసీ యువకుడి మీద పీడీ చట్టం ప్రయోగించారు. పోలీసు దాడులలో 248మంది గాయపడ్డారు. దాడులకు గురైనవారిలో అత్యధికులు దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులవారే. మూకుమ్మడిగా గుడిసెలు తగులబెట్టారు. ఈ పరిస్థితుల్లోనే పేదలకు అండగా పోరాటవేదిక నాయకత్వ బృందం బస్సుయాత్ర చేసింది. మహబూబాబాద్‌లో యాత్ర ప్రారంభంలోనే అడ్డుకునేందుకు పోలీసులు విఫలయత్నం చేసారు. రియలెస్టేట్ గద్దలు ఇచ్చిన బుల్డోజర్లు, జేసీబీలతో పోలీసులు గుడిసెలమీద దాడి చేసిన స్థలంలో, పేదలను పరామర్శించేందుకు వెళ్ళకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. బృంద నాయకుల మీద, ఫొటోగ్రాఫర్, బస్సు డ్రైవర్లమీద దౌర్జన్యం చేసారు. బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేదలు ప్రతిఘటించిన తర్వాతనే వెనక్కి తగ్గారు.

కొన్నిచోట్ల గ్రామాభివృద్ధి కమిటీల పేర్లతో, అగ్రవర్ణ పెత్తందార్లు కూడా యాత్రకు ఆటంకాలు సృష్టించారు. కామారెడ్డి దగ్గర జంగంపల్లిలో యాత్ర బృందానికి గ్రామంలో ఎవరూ సహకరించవద్దని హుకుం జారీ చేసారు. గుడిసెవాసులతోనే బసచేసిన బృందాన్ని వీరి ఆంక్షలు ఏమీ చేయలేకపోయాయి. గుడిసెవాసులు ఇంటికి ఇద్దరి చొప్పున భోజనానికి ఆహ్వానించారు. అక్కడే భోంచేస్తారని పెత్తందార్లు ఊహించలేదు. జగిత్యాలలో సభ నిర్వహణకు ఫంక్షన్‌హాల్ ఇవ్వకుండా అడ్డుకున్నారు. వర్షంలోనే పేదలు సభలో పాల్గొన్నారు. గుడిసెవాసులే పన్నెండు కుటుంబాలు బృందానికి ఆతిథ్యం ఇచ్చారు. చెన్నూరు గుడిసెల్లోకి 7అడుగుల పాము వచ్చింది. ఇల్లందు గుడిసెవాసుల మధ్యకు కొండచిలువ వచ్చింది. అమరచింత గుడిసెల్లో ఒక తల్లి నిద్రలేచేసరికి పక్కనే పెద్ద తేలు ఉన్నది. సూర్యాపేట జిల్లా కాపుగల్లు గుడిసెల కేంద్రంలో సభలోకి పాము వచ్చింది. ఎండ, వాన, చలిని లెక్కచేయక, ఆ గుడిసెల్లోనే బతుకుతున్నారు పేదలు.

ఇల్లు వాకిలి లేక పేదలు ఇబ్బందులు పడుతుంటే కొందరు ప్రజాప్రతినిధులు వింతవాదనలు చేస్తున్నారు. మహబూబాబాద్ ప్రజాప్రతినిధి పేదలను 'ఎక్కడ పుట్టి ఇక్కడ గుడిసెలు వేస్తున్నార'ని దూషించారు. పేదలు కూడా ఆయన్ను 'ఎక్కడ పుట్టి ఇక్కడ శాసనసభ్యుడివయ్యావ'ని ప్రశ్నిస్తే ఏం జవాబు చెపుతారు. ఏ జిల్లాలో పుట్టి, పెరిగినా మహబూబాబాద్‌లో పోటీ చేసే హక్కు ఆయనకు రాజ్యాంగం ఇచ్చింది. పేదలు కూడా ఎక్కడ పుట్టినా మహబూబాబాద్‌లో పనిచేసుకుంటూ, అక్కడే స్థిరపడే హక్కు అదే రాజ్యాంగం ఇచ్చింది. బాధ్యతాయుత స్థానంలో ఉన్న ప్రజాప్రతినిధి రాజ్యాంగవిరుద్ధంగా మాట్లాడుతున్నారు. జగిత్యాలలో ఇద్దరు కౌన్సిలర్లు గుడిసెల కేంద్రం నాయకుల మీద దాడులకు తెగబడ్డారు.



మెదక్‌లో గత ప్రభుత్వాలు పేదలకు కేటాయించిన భూమిలోనే ఇప్పుడు గుడిసెలు వేసారు. ఆ పరిసరాలలోనే ఇప్పుడు కొత్తగా కలెక్టర్ కార్యాలయం వెలిసింది. భూముల ధరలు పెరిగాయి. పేదలకు ఇంత విలువైన భూమి ఎట్లా ఇస్తామని ప్రశ్నిస్తున్నారు. వీరి దృష్టిలో మనుషులకు విలువ పెరగదు. విలువైన భూములు 'పెద్దల' కబ్జాల కోసమేనన్నమాట!

> ఇంటి సౌకర్యం పేదల హక్కు. రాజ్యాంగంలోని 21వ అధికరణం ఈ దేశంలోని పౌరులందరికీ జీవించే హక్కు ఉన్నదని చెప్పింది. ఇంటి సౌకర్యం జీవించే హక్కులో భాగమేనని గత సంవత్సరం ఢిల్లీ హైకోర్టు చెప్పింది. ఇంటి కోసం ప్రైవేటు భూముల్లోకి పోజాలరు కదా! పేదలు మరొకరి సొమ్ము ఆశించరు. కష్టార్జితంతో బతుకుతారు. కానప్పుడు పాలకులు ఆదుకోవాలంటారు. కనీస వేతనాలు కూడా లేవు. కేంద్రంలో బీజేపీ సర్కారు, కనీస వేతనం రోజుకు రు.178గా నిర్ణయించింది. అంటే నెలకు రు.4628. ఈ వేతనంతో కుటుంబం బతకాలట!

నాగర్‌కర్నూల్ జిల్లా గగ్గలపల్లి గ్రామంలో కూడా గత ప్రభుత్వాలు పేదలకు పట్టాలిచ్చిన భూమిలోనే గుడిసెలు వేసారు. ఇప్పుడు దానిపక్కనే మునిసిపల్ అధికారులు చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేసారు. అయినా పేదలు అభ్యంతరం చెప్పలేదు. ఇప్పుడు ఆ చెత్త డంపింగ్ కోసం వీరి గుడిసెలు కూడా ఖాళీ చేయాలని వత్తిడి. చెత్తకున్న విలువ కూడా పేదల బతుకులకు లేదు. అమరచింత గ్రామపంచాయతీ ఎర్రజెండా చేతిలో ఉన్నప్పుడు పేదల ఇండ్ల కోసం స్థలం సేకరించారు. ఆ స్థలాన్ని అభివృద్ధి పేరుతో మండల కార్యాలయం, తదితర అవసరాలకు కేటాయిస్తామంటున్నారు ఇప్పటి అధికారులు. వాటికోసం స్థలం వదులుకోగా కూడా ఇంకా ఖాళీ జాగా ఉన్నది. అయినా పేదలు అర్హులు కాదట! నాగర్‌కర్నూలు జిల్లా డిండి చింతపల్లి గ్రామంలో కూడా ఇదే వ్యథ. జగిత్యాలలో 20ఏండ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న యాభై వడ్డెర, బుడిగెజంగాల కుటుంబాలకు రేషన్‌కార్డులు, ఓటుగుర్తింపు కార్డులు కూడా ఉన్నాయి. అయినా ఇప్పుడు ఖాళీ చేయాలని వత్తిడి చేస్తున్నారు.

ఎక్కడ చూసినా, ఈ పోరాటంలో మహిళలు వేలాదిగా తరలివస్తున్నారు. తెగించి పోరాడుతున్నారు. మరుగు కావల్సింది మహిళకే కదా! ఈమాత్రం సోయి లేని పాలకుల బాధ్యతారాహిత్యం వల్లనే మహిళలు పోరుబాట పట్టక తప్పలేదు. అందుకే పోలీసుల దాడులు కూడా ఖాతరు చేయటంలేదు. జక్కలొద్దిలో మహిళలను అవమానించిన ఒక పోలీసు అధికారి మీద అర్ధరాత్రి మహిళలు తిరగబడిన తీరు అభినందనీయం. డిగ్రీలు, పీజీలు చదివిన విద్యావంతులు గణనీయంగా ఉన్నారు. కొన్ని గుడిసెల కేంద్రాల నాయకులు మహిళలే కావటం ఆహ్వానించదగినది. గుడిసెల మధ్యలోనే గోదావరిఖని, భూపాలపల్లి కేంద్రాలలో వీరనారి మల్లు స్వరాజ్యం పేరుతో నిర్మించిన విజ్ఞాన కేంద్రాలను పోరాటవేదిక నాయకులు ప్రారంభించారు. హన్మకొండలో కూడా అంబేద్కర్ పేరుతో విజ్ఞానకేంద్రం నిర్మించుకున్నారు.

కోరుట్ల గుడిసెవాసులలో ముస్లిం మైనారిటీలు కూడా గణనీయంగా ఉన్నారు. ముస్లిం మహిళలు రేయింబవళ్ళు గుడిసె కేంద్రాలలో ఉండటం మత ధర్మానికి విరుద్ధమని కొందరు మొదట రెచ్చగొట్టే ప్రయత్నం చేసారు. 'ధర్మబద్ధంగా జీవించడానికి ఇండ్లు కట్టిస్తే, ఇంట్లోనే ఉంటాము కదా' అని ముస్లిం మహిళలు తిప్పికొట్టారు. హిందువులకు, ముస్లింలకు మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను కూడా ఐక్యంగా ఎదుర్కొన్నారు. గుడిసెవాసుల నాయకత్వ బృందంలో ముస్లిం మహిళ కూడా ఉన్నారు. యాత్ర బృందానికి హిందూ మహిళలు బతుకమ్మలు అందించగా, ముస్లిం మహిళలు టోపీలు బహూకరించి, ఎర్ర కండువాలు కప్పారు. మెడలో ఎర్రకండువా, నెత్తిమీద టోపీ, చేతిలో బతుకమ్మలతో మత సామరస్యం, సాంస్కృతిక సహజీవనం, పోరాట స్ఫూర్తి వెల్లివిరిసింది. ఐక్య పోరాటాలకు కులమతాలు అడ్డు కారాదని చాటిచెప్పింది. రాష్ట్ర వ్యాపితంగా గూడులేని పేదలు పోరుబాటలో ఉన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించే దాకా ఈ పోరాటం ఆగదు.

అమ్మా ద్రౌపదీ..!

అమ్మా ముర్మూ
చూస్తున్నావా!
ఈ దురహంకారాన్ని
తరతరాలుగా
కొవ్వెక్కిన దుర్మార్గాల్ని

వాడు
ఆదివాసీ జీవనంపైన
ఎంత అనాగరికదాడి
చేసాడో కన్నావా!
కను తల్లీ కను!
కంటేనే కడుపులో
మంట లెగుస్తాయి

అగ్ర కులజుడు చేసింది
నేరమనబడదు అనబడదు
హీనుడు దాన్ని తుడిచేసుకోవాలి
మనువు నుడివిన స్మృతి
ధర్మానుసరులం కదా!

మరిలానే జరుగుతుంది!
అనాదిగా అలానే జరుగుతోంది


నిన్ను అధిపతిని చేసి
వాడి పీఠాన్ని స్థిర
పరచుకుంటాడు
నీ కళ్ల ముందే నీ సమూహాన్ని
మూత్రంలా విసర్జిస్తుంటాడు
అమ్మా ద్రౌపదీ ఇకనైనా
వాడి రక్తంతోనే శిఖ
ముడుస్తానని
శపథం చేయవా!
లేదా...
వాడి అహంకార
మూత్రాంగాన్ని ఛేదించి
విసర్జనా వివక్షతను ఆపేయవా!

అమ్మా ముర్మూ
మౌనం వీడి రా!
మనువాదం పడగవిప్పుతోంది!
మదమక్కి రంకెవేస్తోంది.

- కె. ఆనందాచారి

దేశం పరువు తీసిన 'గాడ్సే' వారసులు

తమకర్త నాళాల్లో ఏపాటి ప్రజాస్వామ్యం ఉందో చూపెట్టుకోవడానికి గాడ్సేలకు ఎక్కువ సమయం పట్టలేదు. భారత ప్రధాని, ఆ పరివారం నేత నరేంద్రమోడీ వైట్‌హౌస్ పత్రికా గోష్టిలో మాట్లాడిన మరునాడే ఆయన మాటల్లోని బండారం ప్రపంచానికి తెలిసిపోయింది. అతికష్టం మీద మోడీని సంయుక్త ప్రెస్ కాన్ఫరెన్సుకు ఒప్పించిన వైట్‌హౌస్‌కు పరాభవమే మిగిలింది. ఆ పత్రికా గోష్టిలో భారతదేశంలో ముస్లింలపై జరుగుతోన్న దాడుల గురించి ప్రశ్నించిన సబ్రినా సిద్దిఖీ వాల్‌స్ట్రీట్ జర్నల్ విలేకరికి అమెరికాలోని గాడ్సే భక్త సమాజం నుండి వేధింపులు ఎదురయ్యాయి. వైట్‌హౌస్ ఆ వేధింపులపై వెంటనే స్పందించి తన పరువు నిల్పుకొంది. డోనాల్డ్ ట్రంపు ఇంకా అమెరికా అధ్యక్షుడిగా లేడన్న వాస్తవాన్ని వైట్‌హౌస్ గాడ్సే పరివారానికి స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో పాటు జరిగిన సంయుక్త ప్రెస్‌కాన్ఫరెన్సులో నరేంద్రమోడీని సిద్దిఖీ భారతదేశం లోని ముస్లింపై జరుగుతున్న దాడుల గురించి మానవ హక్కుల గురించి అడగగా మన ప్రధాని ప్రజాస్వామ్యం మా రక్తనాళాల్లో ఉందని ఆకుకు అందని పోకకు పొందని ఫిల్మీ డైలాగు వల్లెవేసి బయట పడ్డారు. అడిగిన ప్రశ్నకు సూటిగా ఆయన జవాబు చెప్పలేక పోయారు. ఇద్దరు దేశాధినేతల ఒప్పందం మేరకు విలేకరులు రెండేసి ప్రశ్నలే అడగాలి కనుక సిద్దిఖీ ప్రశ్నపై అనుబంధ ప్రశ్నకు అవకాశంలేదు. అయినప్పటికీ అంతర్జాతీయ స్థాయిలో మన "ప్రజాస్వామ్యం" పరువు మట్టికరిపించే పనికి గాడ్సే భక్తులు పూనుకొన్నారు. 19ఏళ్ల తర్వాత మోడీ పాల్గొన్న పత్రికా గోష్టి అలా ముగిసింది.



ఎస్. వినయకుమార్

సిద్దిఖీ ప్రశ్నతో దిమ్మదిరిగిన అమెరికాలోని గాడ్సేలు ఆమెపై వేధింపులు మొదలెట్టారు. మనదేశంలోని స్థానిక గాడ్సేలు డిజిటల్ జర్నలిస్టు తులసి చంద్‌ను వేధిస్తున్నట్లు వేధిస్తున్నట్లుగానే అమెరికన్ గాడ్సేలు కూడా ప్రవర్తించారు. ఉన్నత విద్యలు నేర్చి విదేశాల్లో స్థిరపడినా కుక్కతోకల్లా వారు వంకర బుద్ధులు వదల్లేదు. ట్రోలింగ్‌లపై కంగారు పడిన వైట్‌హౌస్ వెంటనే స్పందించింది. అమెరికా నేషనల్ సెక్యూరిటీస్ అధికారి జాన్ కిర్బే ఒక ప్రకటన చేస్తూ రిపోర్టర్లపై వేధింపులను వైట్‌హౌస్ (అమెరికా ప్రభుత్వం) ఆమోదించదని స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడి కార్యస్థానం అయిన వైట్‌హౌస్ నుండి అలాంటి ప్రకటన రావడం భారతీయులందరికీ అవమానమే. పత్రికా గోష్టి తర్వాత తనపై సాగిన వేధింపుల మీద సిద్దిఖీ జూన్ 24న ట్వీట్ చేశారు. "నా ప్రశ్నకు కొందరు వ్యక్తిగత ప్రయోజనాన్ని ఆపాదిస్తున్నారు. కనుక నేను నా విషయాలను వెల్లడించడం సరైందని అనుకొంటున్నాను. కొన్నిసార్లు అస్తిత్వమే చాలా సంక్లిష్టంగా మారుతుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ట్వీట్‌లో తాను ఇండియన్ క్రికెట్ టీమ్ జెర్సీని ధరించి ఉన్న ఫొటోను, తన తండ్రితో పాటు 2011 వర్ల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌ను ఇండియన్ టీమ్ జెర్సీలో ఉంటూ చూస్తున్న ఫొటోలను పెట్టారు. తన భారతదేశ జాతీయతను, దానిపట్ల ఉన్న ప్రేమను సిద్దిఖీ ఆ విధంగా తెలియ చేసుకోవాల్సి వచ్చింది. దాన్నిబట్టి ఆమెకు ఎలాంటి వేధింపులు ఎదురై ఉంటాయో మనం ఊహించవచ్చు. ముస్లిం అయితే నేరుగా అలాంటి వేధింపులకు పాల్పడటం ఒకవేళ హిందువులయితే నీవు ముస్లింకు పుట్టావా? అని ప్రశ్నించడం సంఘీయుల సంస్కృతి.

మన ప్రధానికి ఏదో ఉద్దేశాన్ని ఆపాదిస్తూ సిద్దిఖీ ప్రశ్నించలేదు. "భారతదేశంలో మైనారిటీల హక్కులపై జరుగుతున్న దాడుల నుండి మీరు రక్షణ కల్పిస్తారా? ముస్లింల హక్కులను, భావస్వేచ్ఛను రక్షిస్తారా" అని అడిగారు. ఆ వెంటనే ఆమెపై ట్రోలింగ్‌లు మొదలయ్యాయి. ప్రశ్న వేయడంలో ఆమె ఉద్దేశాన్ని, ఆమె వారసత్వాన్ని ప్రశ్నించి తమను విమర్శించే వారిని సూడో సెక్యులరిస్టులు అని నిందించే ట్రోలర్లు తాము ఎంతటి నిఖార్సైన లౌకికవాదులో చాటుకొన్నారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరి కరీన్ జీన్‌పీరే కూడ కిర్బే ప్రకటనను పునరుద్ఘాటిస్తూ "మేము పత్రికా స్వాతంత్ర్యానికి కట్టుబడి ఉన్నాంగనుకే గతవారం సంయుక్త పత్రికా గోష్టిని ఏర్పాటు చేశాం. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై బెదిరింపులను, వేధింపులను మేము ఖండిస్తున్నాం" అని పేర్కొన్నారు. మోడీ ఇచ్చిన సమాధానంతో బైడెన్ ఏకీభవిస్తున్నారా అని ఒక విలేకరి ఆ సందర్భంగా ప్రశ్నించగా అది ప్రధాని మోడీ సమాధానం చెప్పాల్సిన ప్రశ్న. ఆ విషయంపై నేనిక్కడ చర్చించను. బైడెన్ ప్రభుత్వం పత్రికాస్వేచ్ఛకు కట్టుబడి ఉంది. అందుకనే పత్రికల వారు బైడెన్‌తో పాటు మోడీ చెప్పేది కూడా వింటే బావుంటుందని అనుకొన్నాం అని ఆమె వివరించారు. కాగా ఆ సంయుక్త పత్రికా గోష్టికి మోడీని ఒప్పించడానికి వైట్‌హౌస్ అధికారులకు చాలా సహనం చూపాల్సి వచ్చిందట. సహనం అన్న మాటను వైట్‌హౌస్ అధికారులు ఉపయోగించాల్సి వచ్చిందంటే వారు నిజంగానే ఎన్ని పాట్లు పడ్డారో పాపం. ఆ ప్రయత్నంలోనే ప్రశ్నల సంఖ్యపై పరిమితి విధించారు కూడా. మోడీకి తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన "రెడ్ కార్పెట్" ఆహ్వానంపై 70మంది అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం చెప్పారు. ప్రధాని పర్యటన తర్వాత మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఒక ప్రకటన చేస్తూ మోడీ మార్కు ప్రజాస్వామ్యాన్ని ఎండగట్టారు. వెంటనే మన కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్ సింగ్ వగైరాలు ఒబామాపై విరుచుకు పడ్డారు. అఫ్ఘాన్, ఇరాఖ్‌లపై బాంబుల వర్షం కురిపించిన ఒబామా మమల్ని ప్రశ్నిస్తారా అని మండిపడ్డారు. అలా మండిపడిన వారు అఫ్ఘాన్, ఇరాఖ్‌లపై బాంబులు కురిపిస్తున్నప్పుడు ఏం చేశారు? ఒబామాను ఖండించారా? చంకలు గుద్దుకొన్నారా? ఒకసారి నిజం ఒప్పుకొని లెంపలేసుకొని ఉంటే బావుండేది.



ఈ వారంలో ముందుకు వచ్చిన మరో అంశాన్ని చూద్దాం... సుప్రీం కోర్టు రాజద్రోహ చట్టాన్ని అమలు చేయరాదని చెప్తూ ఆ చట్టాన్ని గత ఏడాది మే నెల నుండి పెండింగ్‌లో పెట్టింది. కాగా ఆ చట్టాన్ని రద్దు చేయరాదని 22వ లా కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ అవస్థి ఐపిసిలోని సెక్షన్ 124ఎ ను అట్టిపెట్టాలని సూచించారు. దేశంలోని పరిస్థితులకు, ఉపా చట్టం, ఎన్ఎస్ఏ చట్టం సరిపోవని, వలస పాలన కాలం నాటిదైనా సరే రాజద్రోహ చట్టాన్ని రద్దు చేయాల్సిన అవసరం లేదని అవస్థి చెప్పారు. కాగా "లా కమిషన్ నివేదికను తాము వివరంగా పరిశీలించి నిర్ణయం తీసుకొంటామని ప్రభుత్వం ప్రకటించింది." రాజద్రోహ చట్టం దుర్వినియోగం కాకుండా తాము కొన్ని చర్యలు సూచించినట్లు లా కమిషన్ చెబుతున్నా ఆ మార్పులు ప్రజలను మరింత ఇబ్బంది పెట్టేవేనని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు అంటున్నాయి. లా కమిషన్ చైర్మన్ తన ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచుతూ కశ్మీర్ నుండి కేరళ దాకా, పంజాబ్ నుండి ఈశాన్య రాష్ట్రాల దాకా ఉన్న దేశ భద్రతను, సమైక్యతను కాపాడాలంటే రాజద్రోహ చట్టం అవసరం అని చెప్పారు. అంటే రాజ్యాంగంలోని ఫెడరల్ విలువలను అమలు చేయడం కన్నా, రాజద్రోహ చట్టం అన్న కత్తిని మెడపై వేలాడదీసి కేంద్రం పరిపాలన చేయాలని లా కమిషన్ చెప్పినట్లయింది. సుప్రీం కోర్టును కూడా మోడీ ప్రత్యర్థిగా చూస్తున్నట్లు కన్పిస్తుంది. మేము రాజ్యాంగానికి బద్దులపై పరిపాలన చేస్తాం అని అమెరికన్ కాంగ్రెస్‌లో మోడీ ఎంత నాటకీయతతో చెప్పినప్పటికీ దేశంలోని దర్యాప్తు సంస్థలను ఉపయోగించి, కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను అడ్డగోలుగా వాడుకోవడమే మనకు కన్పిస్తుంది. ఆ ధోరణికి చట్టబద్ధత కల్పించడానికి లా కమిషన్ సిఫారసులు పనికొస్తాయి. వరవరరావు లాంటి వారు రాజద్రోహం నేరం కింద అరెస్టు అయ్యారు. సంఘ సేవకుడు స్టాన్‌స్వామి ఆ నేరం కింద అరెస్టయి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జైల్లోనే చనిపోయారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ముప్పు తిప్పలు పెడుతోంది. రాజ్యాంగం ప్రకారం అక్కడి లెఫ్టినెంట్ గవర్నరు రాష్ట్ర మంత్రి వర్గం మాట వినాలని సుప్రీం కోర్టు చెప్తే దాన్ని తలకిందులు చేస్తూ కేంద్రం ఒక ఆర్డినెన్సు తెచ్చింది. ఢిల్లీ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలన్నీ తనకు పాదాక్రాంతం కావాలన్నదే మోడీ తపనగా కన్పిస్తుంది. అదీ మోడీ మార్కు ఫెడరలిజం.

మోడీ మతసామరస్యం గురించి అమెరికా కాంగ్రెస్‌లో గొప్పలు చెప్పుకోగా, అదే సమయంలో ఇక్కడ ఉత్తరాఖండ్‌లో ఒక పట్టణం నుండి ముస్లింలను అసాంతంగా తరిమేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఉత్తరకాశీ జిల్లాని పురోలా పట్టణం నుండి ముస్లింలను తరిమేయడానికి "దేవభూమి రక్ష అభియాన్" అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఉత్తరకాశీ హిందువుల పవిత్ర స్థలం కనుక అక్కడ ఇతరులు ఉండరాదని ఆ సంస్థ వాదననేది స్పష్టంగానే అర్థమవుతోంది. ఆ నేపథ్యంలో 15ఏళ్ల హిందూ బాలికను ఎత్తుకెళ్లడానికి ఇద్దరు యువకులు ప్రయత్నించారని పోలీస్ స్టేషన్‌లో ఒక ఫిర్యాదు నమోదైంది. వెంటనే పట్టణంలో ఉద్రిక్తవాతావరణం ఏర్పడింది. ఫిర్యాదులో నిందితులుగా పేర్కొన్న ఉబైద్, జితేంద్ర సైనీలను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను అరెస్టు చేసిన తర్వాత కూడా దేవభూమి రక్షా అభియాన్ కార్యకర్తలు చాలా మంది ముస్లింలను పట్టణం నుండి బలవంతంగా పంపించేశారు. 82ఏళ్ల ధరం సింగ్ నేగి అనే లాయర్ తన షాపును కిరాయికి తీసుకొన్న ముస్లింలను ఖాళీ చేయించబోనని గట్టిగా నిలబడ్డారు. ధరంసింగ్ నేగి మొత్తబడితే ఆ పట్టణంలోని ముస్లింలందరూ వ్యాపారాలను ఎత్తేసుకొని వలసబాట పట్టాల్సిందే. భారతదేశ పౌరులై ఉండి కూడా బర్మాను వదలి వచ్చిన రోహింగ్యా ల్లాంటి బతుకును వారు గడపవలసి ఉంటుంది. ఇదేపాటి లౌకికవాదమో మన ప్రధానే చెప్పాలి. ఇదిలా ఉండగా నిందితులైన వారి కుటుంబ సభ్యులు కావాలనే తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని, ఫోన్ కాల్ రికార్డులను పరిశీలించిన పోలీసులకు ఫిర్యాదును ధృవ పరిచే సమా చారం దొరకలేదని చెపుతున్నారు. ఒకవేళ నిందితులపై ఫిర్యాదు నిజమేనని రుజువైనా ఎవరో ఒక ముస్లిం యువ కుడు తప్పు చేశాడని ఒక పట్టణం నుండి ముస్లింలందరూ వెళ్లిపోవాలని ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసం. ఆ పట్టణంలోని ముస్లింలపై ఒత్తిడి ఏ స్థాయిలో ఉందంటే ఉత్తరకాశీ ప్రాంతపు బీజేపీ మైనారిటీ మోర్చా అధ్యక్షుడు మహ్మద్ జాహిద్ కూడా డెహ్రాడూన్‌కు పారిపోడు. దేశంలో తన పార్టీకి చెందిన వారి వల్లే ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురువుతుండగా అమెరికా కాంగ్రెస్‌లో ప్రధాని తమ లౌకిక, ప్రజాస్వామ్య విలువలపై చేసిన ప్రసంగాన్ని ఏమనాలో ప్రజలే చెప్పాలి.

> మేము రాజ్యాంగానికి బద్దులపై పరిపాలన చేస్తాం అని అమెరికన్ కాంగ్రెస్‌లో మోడీ ఎంత నాటకీయతతో చెప్పినప్పటికీ దేశంలోని దర్యాప్తు సంస్థలను ఉపయోగించి, కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను అడ్డగోలుగా వాడుకోవడమే మనకు కన్పిస్తుంది. ఆ ధోరణికి చట్టబద్ధత కల్పించడానికి లా కమిషన్ సిఫారసులు పనికొస్తాయి. వరవరరావు లాంటి వారు రాజద్రోహం నేరం కింద అరెస్టు అయ్యారు. సంఘ సేవకుడు స్టాన్‌స్వామి ఆ నేరం కింద అరెస్టయి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జైల్లోనే చనిపోయారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ముప్పు తిప్పలు పెడుతోంది.

భారీగా రిజిస్ట్రేషన్ల ఆదాయం

గత ఏడాది రూ.10,669 కోట్లు

12 లక్షల దస్తావేజులు

- ప్రథమస్థానంలో రంగారెడ్డి జిల్లా
- ఆసిఫాబాద్‌లో అంతంతే
- అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు, ఓపెన్‌ప్లాట్లే సోర్స్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సర్కారుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి భారీగా ఆదాయం సమకూరుతున్నది. వ్యవసాయేతర భూములు, స్థలాలు, ఇతరాల నుంచే అత్యధికంగా వస్తున్నది. ధరణి ప్రారంభించిన తర్వాత వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను స్థానిక రెవెన్యూ తహిసిల్దార్లకు అప్పగించిన నేపథ్యంలో అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ప్లాట్లు, వ్యక్తిగత నివాస గృహాల రిజిస్ట్రేషన్లు పుంజుకున్నాయి. ప్రస్తుతం వ్యవసాయేతర స్థలాల దస్తావేజులను పరిశీలిస్తే రాష్ట్రం మొత్తంలో గత నాలుగేండ్లల్లో ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చింది. 2018-19 సంవత్సరంలో 15.08 లక్షల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్(దస్తావేజు) చేయగా, రూ.5837 కోట్ల మేరకు ఆదాయం వచ్చినట్టు స్టాంపులు,రిజిస్ట్రేషన్ల శాఖ లెక్కలు చెబుతున్నాయి. అలాగే 2022-23కు వచ్చేసరికి అటు ఆదాయం మరింత పెరిగింది. సుమారు 12 లక్షల డాక్యుమెంట్లకుగాను రూ.10,669 కోట్ల ఆదాయం సర్కారు ఖజానాలో జమ అయింది. కాగా 2021-22 సంవత్సరంలో కరోనా మూలంగా ఆదాయం సగానికి సగం తగ్గింది. 9,43,893 దస్తావేజులకుగాను రూ.4204 కోట్లు మాత్రమే రావడం గమనార్హం.

భౌతిక స్వరూపం

ప్రభుత్వానికి పలు మార్గాల్లో ఆదాయం సమకూరుతుంది. అబ్కారీ శాఖ, మైనింగ్, రిజిస్ట్రేషన్లు తదితర శాఖల నుంచి భారీగా ఆదాయం వస్తుంది. అందులో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కూడా ప్రధానమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 33 రెవెన్యూ జిల్లాలు ఉంటే, రిజిస్ట్రేషన్ జిల్లాలు 12. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ సౌత్, మెదక్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు.

ఇకపోతే దాదాపు 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. కొత్తగా ఇటీవల పటాన్‌చెరు, రామగుండం, జయశంకర్ భూపాలపల్లిలోనూ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులను అవసరాలరీత్యా తెరిచారు.

ఆదాయం ఇలా..

గత ఐదేండ్ల లెక్కలను పరిశీలిస్తే రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం ముడుతున్నది.

దస్తావేజులు..ఆదాయం

సంవత్సరం	దస్తావేజులు	రుసుం(రూ.కోట్లల్లో)
2018-19	15,04,876	5,837
2019-20	1614417	6,241
2020-21	12,05,510	9,231
2021-22	94,38,93	4204
2022-23	1207060	10,669

జిల్లాల పరిస్థితి

ఆదాయం అత్యధికంగా రంగారెడ్డి జిల్లా నుంచే వస్తున్నది. 2023-24 తాజా సంవత్సరం లెక్కల ప్రకారం రంగారెడ్డిలో ఎక్కువ ఆదాయం వచ్చింది. రంగారెడ్డిలో ఇప్పటివరకు 1,18,072 డాక్యుమెంట్లను రిజిష్టర్ చేయగా రూ.1961.80 కోట్లు ఆదాయం వచ్చి ప్రథమస్థానంలో ఉంది. అలాగే మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 83,742 డాక్యుమెంట్లకుగాను రూ.1200.75 కోట్లు, హైదరాబాద్‌లో 30,814కుగాను రూ.758.14 కోట్లు, సంగారెడ్డిలో 36,294 దస్తావేజులకుగాను రూ.419.65 కోట్ల ఆదాయం సమకూరింది. హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్లు తక్కువైనా, భూముల విలువలు భారీగా ఉన్న నేపథ్యంలో ఆదాయం అధికంగా వచ్చింది. ఇదిలావుండగా కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 1,398 డాక్యుమెంట్లకుగాను రూ.3.94 కోట్ల మేర ఆదాయం మాత్రమే సర్కారు ఖజానాలో జమ అయింది.

బ్యాంకింగ్ ఉద్యోగార్థులకు సిబిల్ స్కోరుంటేనే బ్యాంక్‌ల్లో ఉద్యోగం

- కనీసం 650 ఉండాల్సిందే
- విద్యా రుణాలు చెల్లించకపోతే అనర్హులు
- ఐబిపిఎస్ కొత్త నిబంధనలు
- బ్యాంకింగ్ సంఘాల మండిపాటు



హైదరాబాద్ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో ఉద్యోగం పొందాలంటే ఇంతక్రితం పోటీ పరీక్ష రాసి.. మెరిట్ సాధిస్తే సరిపోయేది. కానీ దీనికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్స్ (ఐబీపీఎస్) కొత్త చిక్కుముడి పెట్టింది. బ్యాంక్ ఉద్యోగాలను భర్తీ చేసే ఈ సంస్థ అభ్యర్థుల సిబిల్ స్కోర్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్టు తెలిపింది. జులై 1న ఐబీపీఎస్ జారీ చేసిన క్లర్కుల రిక్రూట్‌మెంట్ కోసం కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌లో పలు నిబంధనను విధించింది. సిబిల్ స్కోర్ కనీసం 650 ఉండాలని షరతు విధించింది. అదే విధంగా విద్యా రుణం పొంది.. తిరిగి చెల్లించలేని వారిని అనర్హులుగా నిర్ణయిస్తున్నది. బ్యాంకింగ్ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే సమయంలో సిబిల్ స్కోర్‌ను కూడా పరిశీలించుకోవాలని సూచించింది.ఉద్యోగానికి ఎంపికై చేరే ముందు సిబిల్ స్టేటస్‌ను సమర్పించాల్సిందే. అప్పటికే రుణాలు పొంది ఉంటే ఎలాంటి రుణ బకాయిలు లేవని సంబంధిత బ్యాంకర్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను సమర్పించాలని ఐబిపిఎస్ తన నోటిఫికేషన్‌లో పొందుపర్చింది. సిబిల్, విఫలమయితే అర్హత ప్రమాణాల ప్రకారం ఉద్యోగ చేరిక ఆఫర్ లెటర్‌ను ఉపసంహరించుకోవచ్చు లేదా రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించింది. సిబిల్ నివేదిక అనేది వ్యక్తుల రుణ చరిత్ర, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ ఆధారంగా వారి సామర్థ్యాన్ని సూచించే పరపతి. సిబిల్ స్కోర్ అనేది 300 మరియు 900 మధ్య ఉండే మూడు అంకెల సంఖ్య. క్రెడిట్ ప్రొఫైల్‌లో గృహ రుణాలు, క్రెడిట్ కార్డ్‌లు, వ్యక్తిగత, వాహన, ఓవర్‌డ్రాఫ్ట్ రుణాలు తదితర వాటి చెల్లింపు చరిత్ర ఆధారంగా సిబిల్ స్కోర్ నిర్ణయించబడుతుంది. విద్యార్థులు తమ చదువుల నిమిత్తం విద్యా రుణాలు పొంది.. ఆ తర్వాత అనివార్య కారణాల వల్ల చెల్లింపుల్లో విఫలమైతే ఐబిపిఎస్ నిబంధనల వల్ల బ్యాంక్ ఉద్యోగం పొందడం వీలు కాదు. అభ్యర్థుల మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వాలని బ్యాంకింగ్ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కొత్త షరతును ఎత్తివేయాలి : బెఫీ

ఐబిపిఎస్ ప్రవేశపెట్టిన కొత్త షరతును ఎత్తివేయాలని బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ) జనరల్ సెక్రటరీ దేబాషిష్ బసు చౌదరి డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన ఐబిపిఎస్ ఛైర్మన్‌కు లేఖ రాశారు. సిబిల్ స్కోర్ 650 ఎగువన ఉండాలనే నిబంధనలో ఎలాంటి లాజిక్ లేదన్నారు. విద్యా రుణాలు పొందే సమయంలోనే తల్లిదండ్రుల బాధ్యతతోనే భవిష్యత్తు చెల్లింపుల పూచీతో రుణాలు ఇవ్వబడుతాయని ఆయన గుర్తు చేశారు. నియామకాల్లో విద్యా రుణాలను, సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేశారు. తక్షణమే ఈ షరతును ఉపసంహరించుకోవాలని కోరారు.

పురపాలన దేశానికే ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌కు నీరు తెచ్చి, ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో రింగ్ మెయిన్ పూర్తిచేస్తామని వివరించారు. పురపాలకశాఖ 2014-2023 మధ్య కాలంలో మొత్తం రూ. 1,21,294 కోట్ల నిధులు ఖర్చు చేసిందని తెలిపారు. దీనిలో రూ.1,11,360 కోట్లు (91.8శాతం) రాష్ట్ర ప్రభుత్వ నిధులు కాగా, కేవలం రూ. 9,934 కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం నుంచి రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన పథకాల ద్వారా వచ్చాయని అన్నారు. అంతకు మించి ఒక్క రూపాయి కూడా అదనంగా పట్టణాభివృద్ధికి రాలేదని విమర్శించారు.

ఈ సందర్భంగా వివిధ పథకాల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పురపాలకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్, హైదరాబాద్ మెట్రోరైల్ ఎమ్‌డీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవి ఆదివాసీ ప్రాంతాలే : హైకోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్ : ములుగు జిల్లా మంగపేట మండలం లోని 23 గ్రామాలు రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ పరిధిలోకి వస్తాయని హైకోర్టు బుధవారం కీలక తీర్పు చెప్పింది. చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ఈ తీర్పు చెప్పింది. సుమారు 75 సంవత్సరాల సుదీర్ఘ పోరాట తర్వాత సంచలన తీర్పును వెలువరించింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చాక ప్రభుత్వం తాలూకాలను పునర్విభజన చర్యల్లో భాగంగా పాల్వంచ పరిధి నుంచి 23 గ్రామాలను మంగపేట పరిధిలోకి తెచ్చింది. ఇలా చేయడం రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకమని దాఖలైన కేసుల్ని సింగిల్ జడ్జి కొట్టేశారు. రాజ్యాంగం అమలోకి రావడానికి ముందే ఆ గ్రామాలన్నీ నిజాం పాలనలో షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయన్న తీర్పును సవాల్ చేసిన అప్పీల్‌ను సీజే బెంచ్ కొట్టేసింది. సింగిల్ జడ్జి తీర్పును సమర్థించింది. నిజాం కాలంలోనే షెడ్యూల్ ఏరియాలో ఉన్న గ్రామాలని, తర్వాత రాజ్యాంగం వచ్చాక కూడా షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయని, కేవలం తాలూకా పునర్విభజన చర్యల్లో భాగంగా ఒక తాలూకా నుంచి మరో తాలూకాకు మారాయని, వాటిని నాన్ షెడ్యూల్ ఏరియాగా ప్రభుత్వాలు ప్రకటించలేదని తీర్పులో స్పష్టం చేసింది.

2 వేల ఇళ్ల ఆక్రమణల్ని తొలగించవద్దు : స్టే ఆర్డర్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం నడ్డిగడ్డలో 40 ఎకరాల్లోని ఆక్రమణల నివాసాలను తొలగించరాదని హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. తొలగింపు చర్యలు తీసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఆర్‌పీఎఫ్‌ను ఆదేశించింది. ఆక్రమించుకుని 40 ఏళ్లుగా ఉంటున్న వారిపై ఇంతకాలానికి మేల్కొనడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించింది. 2 వేల కుటుంబాలు ఉంటే వాళ్లను ఖాళీ చేయాలనే ఆలోచన ఎందుకు వచ్చిందని కూడా అడిండి. ఆ కుటుంబాలకు ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు, రేషన్‌కార్డులు ఇచ్చారని,హడావుడిగా ఆక్రమణల్ని తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రభుత్వాలను ప్రశ్నించింది. విచారణను ఆగస్టు 23కు వాయిదా వేస్తున్నామని, అప్పటి వరకు స్టే అమల్లో ఉంటుందని చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ బెంచ్ ప్రకటించింది.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం

- సీపీఐ(ఎం) ఏపీ ప్రతినిధి బృందానికి ఏపీ మంత్రి అంబటి రాంబాబు హామీ
- పోలవరం వరద ముంపు ప్రాంతాలకు ఆర్అండ్ఆర్ ఇవ్వాలి : సీపీఐ(ఎం)



అమరావతి : పోలవరం నిర్వాసితులకు పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం తప్పక పరిష్కరిస్తుందని, వచ్చేవారం రాజమండ్రిలో నిర్వాసితుల సమస్యలను పూర్తిస్థాయిలో చర్చించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఏపీ జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు హామీ ఇచ్చారు. బుధవారం విజయవాడలోని జలవనరులశాఖ మంత్రి క్యాంప్ కార్యాలయంలో పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని నెల్లిపాక నుండి విజయవాడ వరకు 'పోలవరం పోరుకేక' పేరుతో మహా పాదయాత్ర చేపట్టిన సీపీఐ(ఎం) ఏపీ ప్రతినిధి బృందంతో మంత్రి అంబటి రాంబాబు, అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆర్అండ్ఆర్ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళా వందనంతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి వెంకటేశ్వర్లు, రంపచోడవరం, ఏలూరు జిల్లాల సిపిఎం నాయకులు బి కిరణ్, ఎ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాదయాత్రలో గుర్తించిన సమస్యలను మంత్రి అంబటి రాంబాబుకు వి శ్రీనివాసరావు వివరించారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో పునరావాస సమస్యలు 2007 నుండి అలాగే కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న కాంటూరు లెవల్స్ 41.15 మీటర్లు, 45.72 మీటర్లకు మించి 2022 వరదల్లో ముంపునకు గురైందన్నారు. చాలా గ్రామాలతోపాటు నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీలూ ముంపునకు గురయ్యాయంటే అధికారులు చెబుతున్న కాంటూరు లెక్కలపై అనుమానాలు కలుగుతున్నాయని వివరించారు. వరద ముంపు గ్రామాలన్నిటికీ కచ్చితంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. లైడార్ సర్వే చేపట్టాక ముంపుపై కచ్చితత్వం రావడం లేదని అధికారులు క్షేత్రస్థాయిలో మరోసారి సమగ్రంగా ముంపుపై సర్వే చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. అసైన్డ్, అటవీ, పోడు భూములకు సంబంధించిన సమస్యలను సానుకూలంగా పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని శ్రీనివాసరావు కోరారు. ఇందుకు రిహబిలిటేషన్ అండ్ రీ సెటిల్‌మెంట్ (ఆర్అండ్ఆర్) కమిషనర్ చెరుకూరి శ్రీధర్ జోక్యం చేసుకుంటూ వరదలతో మునిగిన ప్రాంతాలన్నిటికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని చట్టంలో లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు అంగీకరించడం లేదన్నారు. దీనిపై వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాకే కొత్తగా ముంపు ఏర్పడినందున ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతున్నామని అన్నారు. 1986లో వచ్చిన వరదలు 2022 కంటే పెద్ద వరదలు అని, అయినా అప్పుడు ఇంతటి నష్టం వాటిల్లలేదని తెలిపారు.

ఎన్ఎస్ఏటీ స్కాలస్టిక్ టెస్ట్‌ను ప్రకటించిన నారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎన్ఎస్ఏటీ-2023) 18వ ఎడిషన్‌ను ప్రకటించింది. దేశంలోని ఏడు నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎస్ఏటీ పరీక్షలో పాల్గొనే అవకాశాన్ని కల్పించింది. ప్రతిభావంతులైన పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి విలువైన బహుమతులను అందించడం దీని ఉద్దేశం. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్ఎస్ఏటీలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.కోటి కంటే ఎక్కువ నగదు అవార్డులను గెలిచే అవకాశముందని తెలిపారు. ఈ పరీక్షను దేశవ్యాప్తంగా 300లకుపైగా నగరాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ నిర్వహిస్తామని, విద్యార్థులు నచ్చిన విధానాన్ని ఎంచుకోవచ్చని వివరించారు. గతేడాది నిర్వహించిన పరీక్షలో దాదాపు 2.5 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ ఏడాది మూడు వేల పాఠశాలల విద్యార్థులకు చేరువవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు వారి ప్రతిభను ప్రదర్శించేందుకు అనుకూలమైన, ఆహ్లాదరకమైన వాతావరణాన్ని కల్పిస్తామని వివరించారు. సమగ్ర సిలబస్‌తోపాటు సైన్స్, మ్యాథమెటిక్స్, మెంటల్ ఎబిలిటీ వంటి సబ్జెక్టులను క్రిటికల్ థింకింగ్ నైపుణ్యాన్ని పెంపొందిస్తామని తెలిపారు. వందశాతం స్కాలర్‌షిప్ అందుబాటులో ఉన్నందున ప్రతిభావంతులైన పేద విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

బాలిక కిడ్నాప్.. లైంగికదాడికి యత్నం

- తప్పించుకున్న బాధితురాలికి ట్రాన్స్‌జెండర్ సహాయం

నవతెలంగాణ- హయత్‌నగర్

ఇద్దరు యువకులు బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి యత్నించగా.. వారి నుంచి తప్పించుకున్న బాలిక ఓ ట్రాన్స్‌జెండర్ సహాయంతో తల్లిదండ్రుల చెంతకు చేరింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. పెద్ద అంబర్‌పేటలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కుటుంబానికి చెందిన బాలిక 10వ తరగతి చదువుతున్నది. మంగళవారం రాత్రి ఆమె బాత్‌రూమ్ కోసం బయటకు రాగా.. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అడ్రస్ చూపిస్తూ.. అడిగారు. బాలిక విషయం చెబుతుండగానే బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ లైంగికదాడికి యత్నించగా.. వారి నుంచి తప్పించుకున్న బాలిక విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న ఓ హెూటల్ వద్దకు చేరుకుంది. ఓ ట్రాన్స్‌జెండర్ బాలికను గమనించి విషయం తెలుసుకుని.. తన ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందజేసింది.

లోకేష్‌కుమార్ కృషి అభినందనీయం : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎమ్‌సీ) కమిషనర్‌గా పనిచేసి, బదిలీ అయిన ఐఏఎస్ అధికారి లోకేష్‌కుమార్‌ను పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు అభినందించారు. సుదీర్ఘకాలం ఆయన జీహెచ్ఎంసీకి సేవలు అందించారని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాల విజయం వెనుక ఆయన కృషి ఉన్నదని ప్రసంసించారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా నగరంలో మౌలిక వసతుల కల్పన, ప్రజా రవాణాను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ఎస్ఆర్‌డీపీ,లింక్ రోడ్ల నిర్మాణం, ఎస్ఎన్‌డీపీ వంటి వ్యూహాత్మక కార్యక్రమాలను విజయవంతం చేయడంలో భాగస్వామిగా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా లోకేష్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమం లో గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, జలమండలి ఎమ్‌డీ దానకిషోర్, జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ రోనాల్డ్ రాస్, మెట్రో రైల్ ఎండి ఎన్వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కొరియా తరహాలోతెలంగాణలో పర్యాటకాభివద్ధి

- ఇండియన్ అంబాసిడర్ అమిత్‌కుమార్‌తో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దక్షిణ కొరియా తరహాలోనే తెలంగాణలో పర్యాటకాభివృద్ధి చేస్తామని మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోని ఇండియన్ అంబాసిడర్ అమిత్‌కుమార్ బుధవారం భేటీ అయ్యారు. కొరియా మాదిరిగా అమ్యూజ్‌మెంట్ పార్కులు, అడ్వెంచర్ టూరిజం, చిల్డ్రన్స్ పార్కులను తెలంగాణలో ఏర్పాటు చేస్తామన్నారు. దక్షిణ కొరియాలో పర్యాటక, క్రీడా రంగాల్లో జరిగిన అభివద్ధిపై అమిత్‌కుమార్‌తో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చర్చించారు. హైదరాబాద్‌లోని టాంక్‌బండ్, బుద్వేల్, గండిపేట తదితర పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటుకు దక్షిణ కొరియా తరహాలో పర్యాటకాభివద్ధి కోసం పూర్తి సహకారం అందిస్తామని మంత్రికి అమిత్ కుమార్ హామీనిచ్చారు. క్రీడా మైదానాలలో మౌలిక సదుపాయాల కల్పనకు, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటకాభివద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

తానా మహాసభలకు రౌనక్ యార్ ఖాన్‌కు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలోని తానా మహాసభలు నిజాంల అసఫ్ జాహీ రాజవంశానికి చెందిన తొమ్మిదవ అధిపతి రౌనక్ యార్ ఖాన్‌కు ఆహ్వానం అందింది.

ఉత్తర అమెరికాలోని పురాతన, అతిపెద్ద ఇండో-అమెరికన్ సంస్థ తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా), అమెరికాలోని ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో జులై 7న ప్రారంభం కానున్న 23వ తానా సమావేశాలకు హాజరు కావాల్సిందిగా కోరింది. రవి పొట్లూరి నేతృత్వంలోని తానా ప్రతినిధి బృందం హైనెస్ రౌనఖ్ యార్ ఖాన్‌ను వ్యక్తిగతంగా కలుసుకుని దానికి హాజరు కావాలని ఆహ్వానించారు.

మంత్రి ఎర్రబెల్లికి ఘన స్వాగతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో జూలై 7,8,9 తేదీల్లో జరిగే ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 23వ మహాసభల్లో పాల్గొనేందుకు వెళ్లిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు తానా నాయకులు ఘనస్వాగతం పలికారు. తానా మాజీ అధ్యక్షులు సతీష్ వేమన, జగదీష్ ప్రభల తదితరులు ఆయనకు స్వాగతం పలికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ ఉజ్జల్ జస్టిస్ భూయాన్‌ను నియమించారు. 2022 జూన్ 28 నుంచి తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉజ్జల్ భూయాన్ పని చేశారు. కొలీజియం సిఫారసుతో తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ సుప్రీంకోర్టుకు బదిలీ కానున్నారు.

కిషన్‌రెడ్డికి స్వాగతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా నియమితులైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బుధవారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బండి సంజయ్ వినతి

బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ న్యూఢిల్లీలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. హసన్‌పర్తి (కాజీపేట) నుంచి కరీంనగర్‌కు కొత్త రైల్వే లైన్‌ను నిర్మించాలని కోరారు. సానుకూలంగా



స్పందించిన మంత్రి ప్రాజెక్టు సమగ్ర నివేదికను తెప్పించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. మంత్రితో జరిగిన సమావేశంలో బండి సంజయ్ వెంట కేంద్ర జలవనరుల శాఖ సలహాదారు వెదిరే శ్రీరాం, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప ఉన్నారు.

ఏక్‌నాథ్ షిండే అనర్హతపై స్పీకర్ జ్యాపం

- సుప్రీంను ఆశ్రయించిన ఉద్ధవ్ ఠాక్రే గ్రూపు

న్యూఢిల్లీ : మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై అనర్హత వేటు ప్రక్రియను రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ జాప్యం చేస్తున్నారంటూ ఉద్ధవ్ ఠాక్రే గ్రూపు మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్‌సిపి రెండుగా చీలి అజిత్ పవార్ గ్రూపు షిండే ప్రభుత్వంలో చేరిన సమయంలో ఠాక్రే గ్రూపు ఈ పిటీషన్ వేసింది. నార్వేకర్ యొక్క ప్రవర్తన రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (ఫిరాయింపుల నిరోధక చట్టం) ప్రకారం స్పీకర్ తటస్థ మధ్యవర్తిగా ఉంటూ తన రాజ్యాంగ విధులను నిర్వహించాల్సిన బాధ్యతను 'సమ్మతంగా విస్మరిస్తుంది' అని ఉద్ధవ్ ఠాక్రే గ్రూపు తన పిటీషన్‌లో సుప్రీంకోర్టుకు తెలిపింది. 'నేరం చేసిన సభ్యులపై దాఖలు చేసిన అనర్హత పిటీషన్లను త్వరగా, గడువులోగా పరిష్కరించాలని స్పీకర్‌ను ఆదేశించాలని, లేదా ప్రత్యామ్నాయంగా అనర్హత పిటీషన్లపై సుప్రీంకోర్టే స్వయంగా నిర్ణయం తీసుకోవాలి' అని శివసేన (యుబిటి) నాయుకులు సునీల్ ప్రభు దాఖలు చేసిన 406 పేజీల పిటీషన్‌లో కోరారు. ఈ సందర్భంగా 2020లో కౌషమ్ మేఘాచంద్ర సింగ్ వర్సెస్ మణిపూర్ లెజిస్లేటివ్ అసెంబ్లీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉద్ధవ్ ఠాక్రే గ్రూపు తరుపు న్యాయవాదులు గుర్తు చేశారు. అనర్హత పిటీషన్లను దాఖలు చేసిన తేదీ నుంచి మూడు నెలలలోపు నిర్ణయించాలని అప్పట్లో తీర్పు ఇచ్చింది. అలాగే ఈ ఏడాది మే 11న ఠాక్రే- షిండే వివాదం కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ స్పీకర్ నార్వేకర్‌పై విశ్వాసం ఉంచిందని, అనర్హత పిటీషన్లపై స్పీకర్ సరైన నిర్ణయం తీసుకుంటారని తెలిపిందని ఠాక్రే గ్రూపు గుర్తు చేసింది. అయితే ఈ తీర్పు ఇచ్చిన మూడు నెలలు గడిచినా స్పీకర్ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఒక్క విచారణకు కూడా పిలవలేదని తెలిపింది.

దేశానికి వనరుల రాజధానిగా తెలంగాణ

- ఐటీలో తెలంగాణ అసమాన వృద్ధి
- రైట్ సాఫ్ట్‌వేర్ న్యూడెవలప్‌మెంట్ సెంటర్
- ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారతీయ నగరాలతో పోలిస్తే తెలంగాణలో ఐటీ ఎగుమతులు, టెక్ ఉద్యోగాల్లో అసమాన వద్ధి చెందిందని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రపంచ ప్రతిభావంతులను ఆకర్షిస్తూ హైదరాబాద్ భారతదేశానికి వనరుల రాజధానిగా మారిందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రైట్ సాఫ్ట్‌వేర్ అత్యాధునిక డెవలప్‌మెంట్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈ ఈవెంట్ రైట్ సాఫ్ట్‌వేర్‌కు ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన రైట్ సాఫ్ట్‌వేర్‌ను అభినందించారు. తెలంగాణలో, వరంగల్ నగరాల్లో ఐటీ వద్ధిని ప్రోత్సహించడానికి, ఉపాధి అవకాశాలను సష్టించేందుకు రైట్ సాఫ్ట్‌వేర్ నిబద్ధతతో ఉన్నందుకు ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ఎన్ఆర్ఐ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి ఇ.విష్ణువర్ధన్ రెడ్డి, చీఫ్ రిలేషన్స్ ఆఫీసర్ అమర్‌నాథ్‌రెడ్డి ఆత్మకూరి, రైట్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు, సీఈవో కష్ణ బెండపూడి, ఇందు బెండపూడి, సీఎఫ్‌వో, యూకే, యూరఫ్ ప్రెసిడెంట్ డాన్ కార్టర్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో స్టెల్లాంటిస్ డిజిటల్ హబ్

హైదరాబాద్‌లో స్టెల్లాంటిస్ డిజిటల్ హబ్‌ను మంత్రి కేటీఆర్ బుధవారం ప్రారంభించారు. ఇది ప్రపంచంలోని ప్రముఖ ఆటోమేకర్‌లలో మొబిలిటీ ప్రొవైడర్ ఒకటిగా ఉందన్నారు. 30 కంటే ఎక్కువ దేశాలలో పారిశ్రామిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. 130 కంటే ఎక్కువ మార్కెట్‌లలో కస్టమర్‌లతో స్టెల్లాంటిస్ ప్రపంచంలోని అత్యంత వైవిధ్యమైన కంపెనీలలో ఒకటిగా నిలిచింది. కంపెనీ జీప్, సిట్రోయెన్, మసెరటి, ప్యుగోట్, ఫియట్ మొదలైన కొన్ని దిగ్గజ బ్రాండ్‌లతో ప్రపంచవ్యాప్త మొబిలిటీ లీడర్‌గా గుర్తింపు ఉంది. విప్రోతో బీఓటీ మోడల్ ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో సమగ్రమైన మొబిలిటీ ఎకో సిస్టం ఉందన్నారు.

న్యూ మొబిలిటీ కోసం...

మొబులిటీ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కి హైదరాబాద్ కేంద్రంగా మారిందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. స్వయం ప్రతిపత్తి, సురక్షితమైన, ఎలక్ట్రిక్ వాహనాలపై దష్టి సారించిన మొబీస్ ఇండియా, బిట్స్‌పిలానీ(హైదరాబాద్), తెలంగాణ ప్రభుత్వం మధ్య వ్యూహాత్మక ఒప్పందం జరిగింది. హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో
నేడు చలో ఇందిరా పార్క్

నవతెలంగాణ- నాగోల్

సీపీఐ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా పార్క్ ధర్నా చౌకు వద్ద నేడు ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం సీపీఐ మేడ్చల్ జిల్లా సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ ఇండ్ల స్థలాల పట్టాలు, డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం చేస్తున్న ధర్నాకు దరఖాస్తుదారులు, సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ధర్నాకు మేడ్చల్ జిల్లా సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, మండల కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఏసీపీ మధుసూదన్‌కు సన్మానం



నవతెలంగాణ- చైతన్యపురి

చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ ఇటీవల ఏసీపీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా బుధవారం ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ జాహెద్ ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం జాహెద్ మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ పోలీస్ వ్యవస్థ నెంబర్ వన్‌గా ఉందన్నారు. సీఎం కేసీఆర్ పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ గౌడ్, జీహెచ్ఎంసీ రైతుబంధు చైర్మన్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ముంపును తగ్గించేందుకు పటిష్ట చర్యలు



• ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నవతెలంగాణ -ఎల్బీనగర్

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సరూర్ నగర్ ప్రాంతంలో ముంపును తగ్గించేందుకు అనేక రకాల పటిష్ట చర్యలను తీసుకుంటున్నట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సరూర్ నగర్ చెరువు కట్ట కింద జరుగుతున్న పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. ప్రియదర్శిని పార్క్ మసీదు వద్ద గతంలో మూడు గేట్లు పెట్టినట్లు తెలిపారు. దానికి అనుగుణంగా మరో మూడు గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా చెరువు మట్టని అవసరం మేరకు పెంచుకోవడం, తగ్గించుకోవడం కోసం మూడు గేట్లు పెట్టడం జరిగిందని తెలిపారు. ఒకవేళ భారీ వర్షాలు పడి చెరువులో నీరు బయటకు వచ్చి కాలనీలను ముంచెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలుగా టన్నెలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ టన్నెలింగ్ ఏర్పాటు దాదాపు మూడు, నాలుగు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయన్నారు. అనుకున్న దానికంటే ఎక్కువ ఖర్చు అవుతుందని కాంట్రాక్టర్ చెప్పారని అన్నారు. అదనంగా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్ మీద ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటికే రెండు మార్గాల ద్వారా నీరు బయటకు విడుదల అవుతుందని.. ఇప్పుడు నిర్మించిన మూడో టన్నల్ వల్ల చెరువులో ఉన్న నీరు త్వరగా బయటకు పోవడానికి వీలుగా ఉంటుందని.. తద్వారా నీరు ఓవర్ ఫ్లో కాకుండా కింద ఉన్న కాలనీలు కోదండరాంనగర్ కాలనీ, పీ అండ్ టీ కాలనీలు ముంపు ప్రాంతం నుంచి రక్షించబడతాయని వివరించారు. అలాగే పుల్లారెడ్డి స్వీట్ హౌస్ దగ్గర 3 కల్వర్టులను గతంలో మూసివేసినట్లు..ప్రస్తుతం అవన్నీ తెరిపించడం జరిగిందని చెప్పారు. దీంతో వరద తీవ్రత 80% తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, రమణారెడ్డి, అశోక్, ముద్ద కళ్యాణ్, కిరణ్ కుమార్, ప్రదీప్ గౌడ్, శ్రీనాథ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్కేసర్ అభివృద్ధికి సమిష్టి కృషి చేస్తున్న కౌన్సిల్



• మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ -ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడానికి కౌన్సిల్ సమిష్టి కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి కొనియాడారు. మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని ఆధ్వర్యంలో బుధవారం ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డి గూడ, ఘట్కేసర్, ఎన్ఎఫ్ నగర్ లోని 1వ వార్డు కౌన్సిలర్ చందుపట్ల వెంకటరెడ్డి, 2వ వార్డ్ కౌన్సిలర్ కొమ్మ గోని రమాదేవి మహిపాల్ గౌడ్, 3వ వార్డ్ కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డి, 5వ వార్డు కుమ్మిడి అనురాధ రాఘవరెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ సుల్తానా, 14వ వార్డు కౌన్సిలర్ బండారి వసంత శ్రీనివాస్ గౌడ్‌లు..ప్రత్యేక నిధులు దాదాపు 60లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, మున్సిపాలిటీ సాధారణ నిధులు 24లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ కౌన్సిలర్లు సైనికులుగా మున్సిపాలిటీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తున్నారని చెప్పారు. అనతి కాలంలోనే ఎంతో అభివృద్ధి సాధించామని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రగతికి నిదర్శమని గుర్తుచేశారు. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీఠవేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలుగల మాధవరెడ్డి, కమిషనర్ వేమన రెడ్డి, రైతు సమితి మండల అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు బొక్క సురేందర్ రెడ్డి, బొట్టు అరుణ, వల్లె అరుణ, సహకార సంఘం డైరెక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంపాలు సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన

నాగార్జున విద్యా సంస్థల వైస్ చైర్మెన్ గుమ్మకొండ రజనీ విఠల్ రెడ్డి



నవతెలంగాణ - హస్తినాపురం

విద్యార్థులకు సహజ సిద్ధమైన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఏటా తమ నాగార్జున విద్యాసంస్థల్లో శాకాంబరీ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్మన్ గుమ్మకొండ రజనీ విఠల్ రెడ్డి తెలిపారు. సాగర్ రోడ్ సమీపంలోని హస్తినాపురం సెంట్రల్ వద్ద ఉన్న నాగార్జున మోడల్ స్కూల్ లో బుధవారం శాకాంబరీ ఉత్సావాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనకు సహజ సిద్ధంగా లభించే వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఔషధాలు మానవాళికి ప్రకృతి ఇచ్చిన గొప్ప వరం అని అన్నారు. పిల్లల ఆహారంలో అన్ని రకాల పోషకాలు ఉండేలా తల్లి దండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయ్ కుమార్ రావు, ఇంచార్జి సవిత, దివ్య, పుష్పలత, అరుణ, ప్రియాంక, ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్వహణకు నిధులు మంజూరు

హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయిలెట్ల నిర్వహణకు రూ.20 లక్షల నిధులను సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ఆమోదం తెలిపి.. తీర్మానం చేయడం పట్ల బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు టాయిలెట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంజూరు చేసిన నిధులతో మున్సిపల్ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి..త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు.

నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎం సహాయనిధి



• మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ- బడంగ్ పేట్

నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎం సహాయ నిధి పథకం అని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీ 18వ వార్డులో నివాసం ఉండే శివకుమార్ తండ్రి నారాయణకు సీఎం సహాయ నిధి నుంచి రూ.50వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు బుధవారం రూ. 50వేల చెక్కును మంత్రి సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సీఎం సహాయ నిధి పథకం ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

జేబీ ఇన్ఫ్రా గ్రూప్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ రెడ్డి



నవతెలంగాణ -వనస్థలిపురం

సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జేబీ ఇన్ఫ్రా గ్రూప్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ రెడ్డి కోరారు. సమాజ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం జేబీ ఇన్ఫ్రా గ్రూప్ సభ్యులు బీఎన్‌రెడ్డి నగర్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా 150 మంది సభ్యుల నుంచి సేకరించిన రక్తాన్ని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ కు అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రోగులకు బ్లడ్ కొరత ఉందని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడాలని సూచించారు. సోషల్ సర్వీస్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన జేబీ గ్రూప్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ కోటేశ్వర్ రెడ్డి, లింగయ్య, కిషన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు నీలకంఠం, సురేందర్, యాదయ్య, ప్రవీణ్ గౌడ్, చందర్, చంద్ర శేఖర్ రెడ్డి , జేబీ గ్రూప్ సంస్థ సభ్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగట్లోనే ఉడికిపోతున్న కూరగాయలు

• మల్ రెడ్డి రాంరెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

పొయ్యి మీద వేయకుండానే అంగట్లోనే కూరగాయలు ఉడికిపోతున్నాయని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి ఎద్దేవా చేశారు. ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలకు నిరసనగా బుధవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు జయమ్మ ఆధ్వర్యంలో కూరగాయల దండలు మెడలో వేసుకుని, కూరగాయల బుట్టలు నెత్తిన పెట్టుకొని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి దిల్ సుఖ్ నగర్ వరకు ర్యాలీ నిర్వహించి..రాజీవ్ చౌక్ వద్ద ధర్నా చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో రూ. 400 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.1,200కి పైగా పెరిగిందని, టమోటా ధర..బంగారు ధరలను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. అల్లం, వెల్లుల్లి ఇతర నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనంతో దశాబ్ది ఉత్సవాల పేరుతో సంబరాలు జరుపుకుంది కానీ..ధరల పెరుగుదల వంటి అంశాలపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. నేడు కేసీఆర్ ప్రభుత్వం..రైతుకి వినియోగదారుడికి మధ్యన దళారీ వ్యవస్థని పెంచి పోషిస్తూ కమీషన్లకు కక్కుర్తి పడుతుందని విమర్శించారు.రూ. 20 కి రైతు దగ్గర కొన్న దళారి రూ. 150కి వినియోగదారునికి అమ్ముతూ.. అటు రైతులను ఇటు వినియోగదారులను మోసం చేస్తూ లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టడానికి ప్రజలు రెడీగా ఉన్నారని జోస్యం చెప్పారు. ఈ ధర్నాలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లా నర్సింహా రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్ రెడ్డి, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, వేణు యాదవ్, కిషోర్ గౌడ్, నర్సింహా యాదవ్, గజ్జి శ్రీనివాస్,ఎల్బీనగర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, ఎస్టీ సెల్ రమేష్ నాయక్, ఎస్సీ సెల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'పేదల రక్తాన్ని పీలుస్తున్న బీఆర్ఎస్ సర్కార్'



నవతెలంగాణ- బడంగ్ పేట్

ధరల మీద ధరలు పెంచి పేదల రక్తాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పీలుస్తుందని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో మహా జన సంపర్క్ అభియాన్ లో భాగంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి అందెల శ్రీరాములు చేస్తున్న గడప గడపకూ బీజేపీ పాదయాత్రలో ఈటల రాజేందర్ పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా తెలంగాణలో కాషాయ జెండా రెపరెపలాడబోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వమే పేదలకు న్యాయం చేస్తుంది తప్ప.. కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పార్టీ ఉపాధ్యక్షులు వరికుప్పల వెంకటేష్, కార్పొరేటర్లు, బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-తుర్కయాంజల్

తుర్కయాంజల్ మున్సిపాలిటీ మునుగనూరు ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రీ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 1వ వార్డు కౌన్సిలర్ తాళ్లపల్లి సంగీత మోహన్ గుప్తా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ రక్షక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్, సుశీల, పాఠశాల ఉపాధ్యాయురాలు మంగ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, పిల్లులకు ఉచిత టీకాలు

వెటర్నరీ డాక్టర్ ఆనంద్ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్

కుక్కలు, పిల్లులకు ఉచితంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నట్లు హయత్‌నగర్ పశు వైద్యాధికారి ఆనంద్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జునొసిస్ డే సందర్భంగా జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. హయత్ నగర్ పశు వైద్య శాలలో రాబిస్ వ్యాధి రాకుండా టీకాలు ఇస్తున్నట్లు తెలిపారు.



బీజేపీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బుధవారం ఆయన స్వగృహంలో యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామిడి శూరకర్ణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ఈటల రాజేందర్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి..ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-బడంగ్ పేట్

ఘనంగా బొంతు రామ్మోహన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ ఉప్పల్

హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ జన్మదిన వేడుకలను బుధవారం ఉప్పల్ శిల్పారామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. దీంతో శిల్పారామం గులాబీ మయంగా మారింది. ఇంకా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్, చిల్కానగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, 500 మహిళలతో ర్యాలీగా వెళ్లి.. రామ్మోహన్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తాడూరు శ్రీనివాస్, గంధం నాగేశ్వరరావు, మేకల హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజీలో మొక్కలు నాటిన బొంతు..

హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పుట్టినరోజు వేడుకలను ఉప్పల్ శిల్పారామంలో అంగరంగ వైభగంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు రామ్మోహన్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో బొంతు రామ్మోహన్ తన కుటుంబంతో కలిసి మొక్కలు నాటారు.



తన పుట్టినరోజు సందర్భంగా మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా చర్లపల్లి డివిజన్‌లో ఇటీవల ఆకస్మికంగా మరణించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భూపతి బాలరాజు ఇద్దరు కుమారులైన చరణ్ సాయి, పండు పై చదువులకు అయ్యే ఖర్చు మొత్తాన్ని భరిస్తానని బొంతు రామ్మోహన్ ప్రకటించారు.

దళిత కౌన్సిలర్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నం

సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు అభివృద్ధికి నయాపైసకేటాయించకుండా మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వివక్ష చూపడాన్ని నిరసిస్తూ..మంత్రిని అడగడానికి వెళ్లిన ఘట్కేసర్ దళిత కౌన్సిలర్ పద్మారావును పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండల కమిటీ ఖండిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్ సబితలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష తేడా లేకుండా మున్సిపల్ పట్టణాన్ని పారదర్శకంగా అభివృద్ధి చేయాల్సిన ప్రజాప్రతినిధులు మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మన్ నయా పైసా కేటాయించకుండా నానా రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దళిత కౌన్సిలర్ పట్ల అనుసరిస్తున్న వైఖరి సరైంది కాదని విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ వార్డు అభివృద్ధికి రాజకీయాలకతీతంగా దోహదపడాలని వారు కోరారు. కౌన్సిలర్ అక్రమ అరెస్టును ప్రజలు, ప్రజాతంత్ర వాదులు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు.

మహేశ్వరానికి మెడికల్ కాలేజీ మంజూరు

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ హామీ మేరకు మెడికల్ కాలేజీ మంజూరైందని జీవో విడుదల చేసినట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హరితహారం సభలో సీఎం కేసీఆర్ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు హామీ ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ హామీ మేరకు 100 సీట్లతో మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం ప్రజల తరుపున నూతన సచివాలయంలో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసినట్లు మంత్రి తెలిపారు.

ఘనంగా సతీష్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ- సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని టీడీజీఎఫ్ తెలంగాణ దళిత గ్రాడ్యుయేట్ ఫోరం గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ సందూరు సతీష్ మిత్ర మండలి ఆధ్వర్యంలో సతీష్ తన గృహంలో బుధవారం జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ఆకుల శ్రవణ్, కీర్తన్, రవిశంకర్ రెడ్డి, లక్ష్మణ్, ప్రవీణ్, బొమ్మ రాజ్, వెంకటేష్, సతీష్, పార్టీ శ్రేణులు, నాయకులు, పెద్దలు, మిత్రులు బంధువులు పాల్గొన్నారు.

నేడు వార్డు కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ- చైతన్యపురి

చైతన్యపురి డివిజన్ పరిధిలోని భవానీ నగర్ రోడ్ నెంబర్ 11 నందు గురువారం ఉదయం 10.30 గంటలకు వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని కాలనీ సంఘాల అధ్యక్ష, సంఘ సభ్యులు, డివిజన్ నివాసులు, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు, పార్టీ శ్రేణులు, అభిమానులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్పొరేటర్ కోరారు.

రెండు రోజుల్లో వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేయాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీసీ కులవృత్తి, చేతివృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం సంబంధించిన వెరిఫికేషన్ ప్రాసెస్ వేగవంతం చేసి, రెండు రోజుల్లో పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఈ రుణ పథకం విధి విధానాలు, వెరిఫికేషన్ గురించి వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి.ఆశన్న, సిబ్బందితో కలిసి జీహెచ్ఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్‌లు సమావేశం నిర్వహించారు. లక్ష ఆర్థిక సహాయం ఎంపికలో ఎటువంటి వ్యక్తుల ప్రలోభాలకు లొంగకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయాలని వారు ఆదేశించారు.

బాక్స్ డ్రైన్ పనులు పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మీర్జాల్ గూడలో రూ. 1 కోటి 60 లక్షలతో కొనసాగుతున్న బాక్స్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రామూయాదవ్, నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటును నమోదు చేసుకోవాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్
- జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

అర్హులందరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశమందిరము లో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డి. ఆర్. ఓ. చంద్రావతి తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితా పరిశీలనలో భాగంగా చేపట్టిన ఇంటింటి విచారణ ప్రక్రియ పూర్తి చేసినట్టు చెప్పారు. ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలని, 18 సంవత్సరాల వయసు దాటిన ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు తమ వంతుగా స్వీయ బాధ్యతతో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ యువత ఓటరుగా నమోదు చేసుకోవడంలో కృషి చేయాలని కోరారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలనే లక్ష్యంతో పాటు, ఓటు హక్కు వినియోగంలో అవకతవకలు అరికట్టడంపై ఎన్నికల కమిషన్ దష్టి సారించిందని అన్నారు. ఫారం 6-బీ ద్వారా ఓటర్లు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవడంతో పాటు అర్హులైన నూతన యువత ఓటరుగా నమోదు చేసుకోవడానికి, ఓటర్ల జాబితాలో చనిపోయిన, పెండ్లై వెళ్ళిపోయిన, డూప్లికేట్ కార్డు ఓటర్ల తొలగింపులో ప్రజాప్రతినిధులు సహకరించవలసినదిగా జిల్లా కలెక్టర్ కోరారు. పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రానికి మార్చుకునే విధంగా అవకాశం కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల పూర్తిస్థాయి బూత్ లెవెల్ ఏజెంట్లు ఇంటికి వెళుతున్న సందర్భంగా చనిపోయిన, రెండు ఎపిక్ కార్డులు కలిగిన వారి వివరాలను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతనంగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవా లన్నారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకొని, ఓటరు జాబితాలో పేర్లు తప్పులు ఉన్న వాటిని సవరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొని రావాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఓ శ్రీనివాస్ మూర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

జులై 8న భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అమోయ్ కుమార్ అధికా రులను ఆదేశించారు. ప్రధాని పర్యటన సందర్భంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ అమోయ్ కుమా ర్ సమీక్షించారు. జులై 8న హకీంపేట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో ప్రధాని మోడీ చేరుకుంటారని తెలిపారు. అందుకు సంబంధించి జిల్లా అధికారులు హకీంపేట లో పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టాలని కలెక్టర్ అధికారులను సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని అన్నారు. రోడ్ల మరమ్మతులు, బారికేడింగ్ చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తిని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన మంత్రి పర్యటన సందర్భంగా విస్తత బందోబస్తు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సిబ్బంది, అంబులెన్స్, వైద్య బందాలను నియమించడం వైద్య ఆరోగ్య శాఖ అధికారి కి సూచించారు. వేదికల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ ఆదేశించారు. ప్రధాన మంత్రి పర్యటనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, లోపాలు లేకుండా చూడాలని, ప్రోటోకాల్ ను అనుసరించి ఏవిధమైన లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డి. ఆర్. ఓ. చంద్రావతి, ఆర్డీవోలు రవి, మల్లయ్య, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాసమూర్తి, డిఎఫ్ ఓ జానకిరామ్,డి ఎస్ ఓ ,తనూజ, , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూలై 10,11,12 తేదీల్లో టోకెన్ సమ్మె



- మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు ఉన్నికృషన్

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) పిలుపులో భాగంగా జూలై 10,11,12 తేదీల్లో జరిగే టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్ల కమిటీ ప్రెసిడెంట్ ఉన్నికృషన్ పిలుపు నిచ్చారు. బుధవారం సీఐటీయూ ఆఫీస్ కమలానగర్ తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల పథకం యూనియన్ (సీఐటీయూ) ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరానికి సంబంధించి సుమారు నాలుగైదు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి వెంటనే చెల్లించాలని దఫా దఫాలుగా కలెక్టర్‌కు మెమొరండాలు అందజేసినా నేటికీ బిల్లులు చెల్లించలేదని తెలిపారు. కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ఫలితంగా కార్మికులకు రూ. 2000 పెంచుతున్నట్టు సీఎం గత సంవత్సరం మార్చి 15వ తేదీన అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి నేటికీ 16 నెలలు కావస్తున్న జీవో నెంబర్ 8ని విడుదల చేసి అమలు చేయకపోవడం విడ్డూరమని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10,11,12 తేదీలలో వంట బందు చేసి ఎంఈఓ ఆఫీస్‌ల ముందు నిరసన తెలియజేసి 12వ తేదీన కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కారిం చకపోతే జులై 15 తర్వాత కార్మికుల హక్కుల సాధనకు నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి వెనుకాడ బోమని అన్నారు. యూనియన్ జిల్లా నాయకురాలు ప్రేమలత మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 2800 మంది కార్మికులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనము వండి పెడుతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలతో పోల్చితే గత బడ్జెట్ సరిపోవడంలేదన్నారు. ముఖ్యమంత్రి గౌరవ వేతనం పెంచుతున్నట్టు ప్రకటించిన నాటి నుంచి ఏరియార్స్‌తో సహా చెల్లించాలని, కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ సభ్యులు భాగ్యమంగ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని షిరిడీ నగర్‌లో రూ. 20 లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు డివిజన్ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ లౌక్యా, ఏఈ శ్రీకాంత్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రజిని కాంత్, నాయకులు అధికార ప్రతినిధి జీఎన్వీ సతీష్ కుమార్, సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, రామూయాదవ్, బాబు, సత్యనారా యణ, సంపత్ రావు, ఉపేందర్ రెడ్డి, కిషోర్, చెన్నరెడ్డి, సూరి, చికెన్ సెంటర్ రాజు, పార్థు, ఆగమయ్యా బాల రాజు, కాలనీ వాసులు మురళీధర్,రమేష్,బాబు సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను బీఆర్ఎస్ ఆదుకుంటుంది



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

కార్యకర్తలకు, వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటూ ఆదుకుంటుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ ఓల్డ్ కష్టమ్ బస్తీకి చెందిన బి.ఆర్ ఎస్ కార్యకర్త హరి ఇటీవల మరణించారు. పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే పార్టీ ఇన్సురెన్స్ క్రింద రూ. 2 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తారు. అందులో భాగంగా హరి కుటుంబానికి మంజూరైన రూ. 2 లక్షల ఇన్సురెన్స్ సహాయాన్ని హరి భార్య విజయకు బుధవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, ఆరీఫ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గోధుమకుంట గ్రామానికి చెందిన వంగేటి మల్లారెడ్డి తండ్రి ఎల్లారెడ్డి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ. 60,000 చెక్కును లబ్దిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గోధుమకుంట గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు తాండూరి సంధ్యా దశరథ గౌడ్, పుట్ట రమేష్ గౌడ్, బీఆర్ఎస్ గోధుమకుంట గ్రామశాఖ సెక్రెటరీలు పాల్గొన్నారు.

క్రిశాంక్ ఆధ్వర్యంలో షీ టాక్స్ కార్యక్రమం



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ ప్రాంతంలోని మహిళల సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్ర ఖనిజాభివద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ మార్ట్ ఫోర్ట్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో షీ టాక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 65 మంది యువతులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై చర్చించారు. మడ్‌ఫోర్ట్ ప్రాంతంలో బస్ స్టాప్‌లు, ఆర్టీ సేవలు లేకపోవడం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. అలాగే యువత కోసం కౌన్సెలింగ్ సెంటర్, కంప్యూటర్ శిక్షణా కేంద్రం కూడా ఏర్పాటు చేయాలని వారు క్రిశాంక్‌ను అభ్యర్థించారు. కాగా యువతులు మహిళల సమస్యలు తెలుసుకునేందుకు కార్యక్రమాన్ని నిర్వహించినందుకు క్రిశాంక్‌ను వారు అభినందించారు. కార్యక్రమం ద్వారా తెలుసుకున్న సమస్యలను క్రిశాంక్ పరిష్కారం చేయిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సువర్ణ, జానకి, మాధవి, సరిత, మేరీ, సంధ్య,ఆషియా, సల్మా బేగం, సమీరా, సహన, పద్మ, కాంచన, చిన్నారి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవాలయం కమల నగర్, ఈసీఐఎల్ క్రాస్ రోడ్ ఆలయ కమిటీ నూతన ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌లు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరై దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ చే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో కుషాయి గూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. నూతన ఆలయ కమిటీ చైర్మెన్‌గా కాసం వెంకటహరి, ఆలయ కమిటీ సభ్యులుగా యార్లగడ్డ దుర్గకుమారి, మాల్క రమాదేవి, ఎం. పరమేశ్వర్ దాస్, గొల్ల పద్మ, ఉట్ల యాదగిరి, ఎక్స్ అఫీషియో మెంబర్ గౌరీభట్ల సురేష్ శర్మ, ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ ఏఎస్ రావు నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, బేతాళ బాలరాజు, మురళి పంతులు, జనార్ధన్, మల్లారెడ్డి, గంప కష్ణ, చందు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.



నూతన బోర్‌వెల్ పనులు ప్రారంభించిన సాయన్న కుమార్తెలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ ఏడో వార్డు నెహ్రూ సెంచరీని కాలనీలో రూ. 3.5 లక్షల నిధులతో మంజూరు అయిన బోర్వెల్ పనులను బుధవారం దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదితలు ప్రారంభించారు. ఏడో వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు ఈ తేజ పాల్ నేతత్వంలో జరిగిన కార్యక్రమానికి మాజీ సభ్యుడు శ్యాం కుమార్, మార్కెట్ మాజీ చైర్మెన్ శ్రీనివాస్, స్థానికులు శ్రీహరి, సంతోష్, రాములు, శివ, వినోద్, మూర్తి, శ్రీధరన్, సంచనరీ కాలనీ వాసులు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్తెలకు స్థానికులు కృతజ్ఞతలు చెప్పి తేజ పాల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రిని నిజాంకాలేజీ క్రికెట్ టీం క్యాప్టెన్ దారా రాహుల్ డేవిడ్‌తోపాటు ఆ జట్టు సభ్యులు బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత మండలి కార్యాలయంలో కలిశారు. ఉన్నత విద్యామండలి పూర్తి స్థాయి చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ప్రొ. ఆర్. లింబాద్రికి జట్టు సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపి సన్మానించారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

బండారి లక్ష్మారెడ్డిని కలిసిన మాజీ కౌన్సిలర్



నవతెలంగాణ-కాప్రా

బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డిని కాప్రా మాజీ కౌన్సిలర్ బ్యారగల్ల బాలమ్మ సైనిక్ పూరిలోని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి తమ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కౌన్సిలర్ తమ దష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్ గౌడ్, కంటెస్టెంట్ కార్పొరేటర్ గూడ ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీ ఉజ్జిని మహంకాళి బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తున్నామని ఈవో మనోహర్ రెడ్డి తెలిపారు. బుధవారం శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని వారు కలిసి బోనాల జాతరకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు

నవతెలంగాణ-బేగంపేట

ప్రణాళిక బద్ధంగా కార్పొరేషన్ అభివృద్ధి..



- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- మీర్‌పేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ప్రణాళిక విధంగా అభివృద్ధి చేస్తున్నామనిరాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 35వ డివిజన్ కార్పొరేటర్ గిల్లా సౌందర్య విజయ్ ఆధ్వర్యంలో పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో వర్షం పడిందంటే చాలు లెనిన్ నగర్ వర్షం నీటిలో మునిగిపోయేదని అన్నారు. కానీ ప్రస్తుతం ఎంత వర్షం కురిసిన ఒక గంటలో నీళ్ల వెళ్లిపోతున్నాయని తెలిపారు. బాలాపూర్ చౌరస్తా నుండి బడంగ్‌పేట్ వెళ్లే దారి చాలా రద్దీగా ఉండేదని, వాహనాల రద్దీని తగ్గించేందుకు కట్ట కింద నుండి మరో రోడ్డు వేశామని చెప్పారు. మంచినీళ్ల సమస్య త్వరలో పరిష్కారం కాబోతుందని తెలిపారు. మున్సిపల్ ఏర్పడిన వెంటనే మంచినీళ్ల కనెక్షన్లు వాటర్ బోర్డ్‌కు అప్పగించడంతో నల్లా బిల్లులు ఎక్కువ వస్తున్నాయనే ప్రజల డిమాండ్ మేరకు నల్లా బిల్లుల సైతం తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటి పన్నుల సైతం తగ్గించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు సైతం ఇచ్చారని అధికారులు తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలియజేశారు. ప్రజల ఇబ్బందులు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కండ్లు మూసుకుని అభివృద్ధి పనులను చూడలేక ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్తారని కేసీఆర్ ప్రభుత్వం పై ప్రజలు ధీమా ఉన్నారని అన్నారు. అనం తరం మహేశ్వరం నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, కో అప్షన్ సభ్య లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-జవహర్‌నగర్

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి గ్రామంలో యగోజు యాకచారి మరణ వార్త తెలుసుకున్న జవహర్‌నగర్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు అక్కడికి చేరుకొని ఆయన భౌతిక దేహానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామదాసు, వెంకటరమణ చారి, కర్నెకంటి పుల్లయ్య చారి, జవహర్ నగర్ అధ్యక్షులు దిగోజు బ్రహ్మాచారి, కష్ణచారి, నరసింహ చారి, రమేష్ చారి, యకాచారి, ఏకాంత చారి, భీష్మచారి, శ్రీనివాస్ చారి, సత్యంచారి, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ 2 వ డివిజన్ కార్పొరేటర్ కె.సుభాష్ నాయక్ పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి లు శుభాకాంక్షలు తెలిపారు. సుభాష్ నాయక్ ప్రజా సేవాలో మరింతగా ముందుకు సాగాలని కోరారు. నవతెలంగాణ-బోడుప్పల్



ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

కాలనీవాసులు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. బుధవారం గాజులరామారం డివిజన్ మితుల నగర్ పరిధిలో టెంపుల్ లైన్ పార్కు లో బోరు పనులను స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీల లో మౌలిక వసతులు కల్పిస్తూ ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. కాలనీవాసులు సురేష్ , కిరణ్, ప్రవీణ్, ధనుంజయ రెడ్డి, ప్రసాద్, జనార్దన్ రెడ్డి, డాక్టర్ గంగాధర్ చారి, సంపత్ ,అశోక్ రెడ్డి, రమణారెడ్డి, జగదీష్, రాము, గోపాల్, చక్రధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉచిత హెల్త్ క్యాంప్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్ లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవేర్ గ్లోబల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ ఉచిత హెల్త్ క్యాంప్‌నకు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి డా. కె.పట్టాభి రామారవు ముఖ్య అతిథిగా విచ్చేసి హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డికొండ రవిందర్ , ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ ఎ.అనంత సేన రెడ్డి, జి.రామా రావు, ఎగ్జిక్యూటివ్ బాడి మెంబర్‌లు, జిల్లా కోర్టు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు



నలుగురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతులు



నవతెలంగాణ - సిటీబ్యూరో

నగరంలోని ట్రాఫిక్ విభాగంలో వివిధ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతులు లభించాయి. నార్త్ జోన్ అదనపు ట్రాఫిక్ డీసీపీ ఎస్.రంగారావు తెలిపిన వివరాల మేరకు.. మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై ఎం.శంకర్ రాజు, నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న మోహన్ బాబు నాయక్, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైలుగా పనిచేస్తున్న పి.శ్రీనివాస్, పి.నరేష్ కుమార్ సీఐలుగా పదోన్నతులు పొందారు. ఈ మేరకు సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ మురళీకష్ణ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఏసీపీ శంకర్ రాజు, సీఐ రాజా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కోలన్ హన్మంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
సుభాష్ నగర్ 130 డివిజన్ బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు భిక్షపతి, జనరల్ సెక్రెటరీ సతీష్, రవి ముదిరాజ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై బుధవారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ. 4 వేల చొప్పున నిరుద్యోగ భృతి, వెనుకబడిన వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వనున్నట్టు తెలిపారు." హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర "ప్రజలకు ఎంతో దగ్గర చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్ ముదిరాజ్ , వసంత్ , జగన్ ముదిరాజ పాల్గొన్నారు.

మేడ్చల్ సీఐగా బి. నర్సింహ సాజల్ రెడ్డి



నవ తెలంగాణ- మేడ్చల్
మేడ్చల్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా నర్సింహ సాజల్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు.అంతకుముందు సీఐగా విధులు నిర్వహించిన రాజశేఖర్ రెడ్డి గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐగా బదిలీ అయ్యారు. కాగా మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గత 9నెలలుగా సీఐగా విధులు నిర్వహిస్తున్న నర్సింహ రెడ్డిని లా అండ్ ఆర్డర్ సీఐగా నియమిస్తూ పోలీస్ ఉన్నంత అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ నర్సింహ రెడ్డి నియామకం పట్ల మాజీ ఉప సర్పంచ్ నర్సింహ రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఆంజనేయులు, కౌన్సిలర్లు, రాజకీయ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన సీఐ నర్సింహ సాజల్‌రెడ్డి



నవ తెలంగాణ - మేడ్చల్
మేడ్చల్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన బి.నర్సింహా సాజల్ రెడ్డి బుధవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీఐకి మంత్రి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల ఫోరం సంఘం అధ్యక్షుడు విజయా నందా రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు రాజమల్లారెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భాగ్య రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మర్రి నర్సింహా రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, గోమారం శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, యాదగిరి గౌడ్, రాజగోపాల్ రెడ్డి, రామస్వామి, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలో 90 శాతం పనులు పూర్తి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
కూకట్ పల్లి నియోజకవర్గంలో 90 శాతం పనులను పూర్తి చేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.1.75 కోట్లతో సేవరేజ్ పైపులైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్ప నకు రాజీ పడకుండా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నిధులు కేటాయిస్తూ హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూల్ బాగ్ కాలనీ డ్రయినేజీ సమస్యకు పరిష్కారం

నవతెలంగాణ - బాలానగర్
బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడలోని పూల్‌బాగ్ కాలనీలో రూ.1 కోటీ 20 లక్షల వ్యయంతో డ్రయినేజీ పైప్ లైన్ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కాలనీవాసులు దశాబ్ద కాలంగా డ్రయినేజీ సమస్య ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎంతోమంది ఉద్దండులు కేంద్ర మంత్రులుగా పని చేసినా ఈ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారన్నారు. దశాబ్దాలుగా పెండిగ్‌లో ఉన్న సమస్యలకు సీఎం కేసీఆర్ పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే దిల్‌కుష్ నగర్, ఇందిరానగర్ వాసులకు రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్న బాలానగర్ ఫ్లైఓవర్ ద్వారా పరిష్కారం చూపించామన్నారు. కార్యక్రమంలో జలమండలి ఈఈ, డీజీఎం, సెక్షన్ మేనేజర్, జీహెచ్ ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు సభాపతి రెడ్డి కూడా మందడి సుధాకర్ రెడ్డి, పంజా రాంచందర్, ఎన్.వి. రత్నం, దేవులపల్లి కష్ణమూర్తి, నాగేందర్ గౌడ్, మహిళలు, స్థానిక కాలనీ వాసులు, పాల్గొన్నారు.



డ్రయినేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

- అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహ గౌసోద్దీన్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
డ్రైయినేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కృషి చేస్తానని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహ గౌసోద్దీన్ అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్ నగర్, గాయత్రి నగర్, శ్రీ వివేకానంద నగర్‌లో నూతన భూగర్భ డ్రైయినేజీ నిర్మాణానికి జలమండలి డీజీఎం రవి కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మూర్తిలతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్వత్‌నగర్, గాయత్రినగర్, వివేకానంద నగర్, ఓల్డ్ అల్లాపూర్‌లలో భూగర్భ డ్రయినేజీ లైన్ శిథిలావస్థకు చేరడంతో మురుగు నీరు రోడ్లపై పారుతుందన్నారు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. డ్రైయినేజీకి మరమత్తు చేయాలని అధికారులకు కార్పొరేటర్ ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, జాహేద్ షరీఫ్ బాబా, సంజీవరెడ్డి, రోనంకి జగన్నాథం, నసీర్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రాము యాదవ్, కమ్మరి శ్రీనివాస్, సుమన్, కాశీనాచారి, టోపీచారి, బ్రహ్మ యోగి రాజు, బంగారు, అశోక్, మొగులయ్య పార్వతమ్మ, లక్ష్మీ, రేవతి, మనెమ్మ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ - కూకట్‌పల్లి
వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోగల ఆల్విన్ కాలనీ ఫేస్ 1 ప్రధాన రహదారి నుంచి మాధవరం కాలనీ వెళ్లే ప్రధాన రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ ఆశతో కలిసి మాజీ కార్పొరేటర్ మాధ వరం రంగారావు బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్విన్ కాలనీ, చౌరస్తా నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సీసీ రోడ్డు ఇరువైపులా విస్తరించడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, వెంకటేష్ గౌడ్, మోహన్ రావు, శాస్త్రి, శంకర్,తదితరులు పాల్గొన్నారు.

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ - కూకట్ పల్లి
పెన్షనర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం తెలంగాణా ఆల్ ఫెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కూకట్‌పల్లి ఉప కోశాధికారి మోషే జయరాజ్‌కు అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటిదశలో కూకట్ పల్లి ఉప ట్రెజరీ అధికారి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరామన్నారు. ప్రతి నెలా మొదటి తేదీనే ఫెన్షన్లు చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న డీఆర్‌లను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్) కింద అన్ని కార్పొరేట్ వైద్యశాలల్లో నాణ్యమైన వైద్య సదుపాయం, రూ.2 లక్షల గరిష్ఠ పరిమితిని ఎత్తివేసి ఎంత ఖర్చు అయితే అంత రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. సీఎం హామీ మేరకు ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి కాంట్రిబ్యూషన్ వసూలు లేకుండా చూడాలని విన్నవించారు. అన్ని జిల్లాల్లో వెల్‌నెస్ కేంద్రాలు అన్ని రకాల వైద్య పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి డాక్టర్లు ఇతర సిబ్బందిని నియమించాలన్నారు. ముందస్తు డబ్బు చెల్లించి చేయించుకున్న వైద్య ఖర్చులు, మెడికల్ రీఎంబర్స్ మెంట్ బిల్లులను 3 నెలలలోగా చెల్లించాలని కోరారు. డీఈపీఎస్ - 95 ఫెన్షనర్లకు ఆసరా ఫెన్షన్లు మంజూరు చేయాలన్నారు. గ్రాట్యుటీ రూ. 20 లక్షలు చెల్లిస్తూ మెడికల్ అలవెన్సులు రూ. 2 వేలకు పెంచాలని కోరారు. రాష్ట్ర ఆల్ ఫెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, ట్రెజరర్ కేబీ చారి తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకుల శుభాకాంక్షలు



నవతెలంగాణ- మేడ్చల్
బీజేపీ రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మెన్‌గా నియమితులైన ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బీజేపీ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు కొండం అంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఈటల నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. రాష్ట్ర నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, మున్సిపాల్టీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సీఏచ్ ఈశ్వర్, వెంకటేష్ చారి, శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం నాయకులు రాఘవ రెడ్డి, కేశవరెడ్డి, సీనియర్ నాయకులు రవి కుమార్, యువజన విభాగం నాయకులు సాయిచరణ్ పాల్గొన్నారు.

కలిసి కట్టుగా పని చేయాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో
నగర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అందరం కలిసి కట్టుగా సమన్వయంతో పని చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఓడీలు, జోనల్ కమిషనర్లు, డీసీలతో పరిచయం చేసుకున్నారు. జీహెచ్‌ఎంసీ చేపడుతున్న కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ... నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కొత్తగా ప్రారంభించిన వార్డు ఆఫీస్‌ల పనితీరును ఎప్పటికప్పుడు జోనల్, డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇంకా ప్రారంభం కాని వార్డు కార్యాలయాలను వేగవంతంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శానిటేషన్‌పై సమీక్షిస్తూ సంబంధిత డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో ప్రతీ రోజు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇ.వీ.డీ.ఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఇ.ఎన్.సీ. జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్లు ప్రియాంక అలా, సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెనడి, యాదగిరి రావు, జోనల్ కమిషనర్లు పంకజ, మమత, రవికిరణ్, శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ సీసీపీ శ్రీనివాస్, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.పద్మజ, హౌసింగ్ ఓ.ఎస్.డీ సురేష్ కుమార్, ఎస్‌సీ విద్యాసాగర్, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర రెడ్డి, సీ.పీ.ఆర్.వో ఓ మహమ్మద్ ముర్తుజా, డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి నల్లచెరువు అభివద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



నవతెలంగాణ-కూకట్ పల్లి
ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో కూకట్ పల్లి నల్లచెరువు పరిసర ప్రాంత వాసులు, రెవెన్యూ అధికారులతో కలిసి చెరువు అభివద్ధిపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నల్ల చెరువు ప్రాంతం వాసులు చెరువు అభివద్ధికి ముందుకు వచ్చి, ప్రభుత్వం అందించే టీడీఆర్‌కు ఒప్పుకున్నారని తెలిపారు. నల్లచెరువును అత్యంత సుందరంగా అభివద్ధి చేయాలని సూచించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, లైటింగ్, వాటర్ ఫౌంటెన్, షటిల్ కోర్ట్ వంటి వాటికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఎమ్మార్వో గోవర్ధన్, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



- ఫతే నగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవ తెలంగాణ - బాలానగర్
ఫతేనగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయలని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. మూసాపేట్ సర్కిల్ ఫతేనగర్ డివిజన్ మాధవీ నగర్ కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో భాగయ్య లతీఫ్, రెడ్డి, మెహబూబ్, అశోక్, సురేందర్ నాయుడు పాల్గొన్నారు.

దుండిగల్ ప్రజల కరెంటు సమస్య తీరేది ఎప్పుడు?

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందుల్లో ప్రజలు

నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సి పాలిటీ దుండిగల్‌లో గత మూడు నెలలుగా కరెంటు సమస్య విపరీతంగా కొనసాగుతోంది. అనేక పర్యా యాలుగా స్థానిక కౌన్సిలర్లకు, అధికారులకు ఫిర్యాదులు చేసినా విద్యుత్ అధికారులు సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కొరత ఎక్కడా లేదని ఓవైపు ప్రజా ప్రతినిధులు చెబుతున్నా దుండిగల్‌లో కరెంటు కోతలతో వ్యాపారస్తులతో పాటు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు కాల్వలకు దగ్గరగా ఉన్న ప్రజలు దోమలతో సతమతమతున్నారు. కరెంటు కోత లతో ఇండ్లు ఇరుకుగా ఉండడంతో గాలి ఆడక వృద్ధులు , చిన్నపిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. సమస్యపై కౌన్సిలర్లు విద్యుత్ అధికారులతో మాట్లాడడం లేదని స్థాని కులు వాపోతున్నారు. ప్రతిరోజు గంటల కొద్దీ కరెంటు తీయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కరెంటు సమస్యపై అధికా రులకు తెలిసినా ఏ మాత్రం పట్టించుకోకపోవడం దుండి గల్ అధికారుల పనితీరుకు నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు.

సమస్యను పట్టించుకోవడం లేదు



కరెంట్ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు.చాలా సార్లు అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు, క్రిందిస్థాయి సిబ్బందికి తెలియజేశాం. సమస్య నెలల తరబడి కొనసాగుతున్నా విద్యుత్ ఏఈ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారు. ఇప్పటికైనా ప్రజల ఇక్కట్లను అర్థం చేసుకోని సమస్యను పరిష్కరించాలి

-బస్తీ నాయకుడు మహమ్మద్ అమీర్

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

- రూ.5 కోట్లతో బస్తీలలో మెరుగైన సౌకర్యాలు
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- అంబేద్కర్‌నగర్, ఉమాదేవి నగర్, లెనిన్ నగర్‌లో పాదయాత్ర



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని ప్రతి ప్రాంతాన్ని ప్రజల సహాయ సహకారాలతో రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ కెపి వివేకానంద్ అన్నారు. బుధవారం గాజులరామారం డివిజన్ లో "ప్రగతి యాత్ర"లో భాగంగా 82వ రోజు ఎమ్మెల్యే కేపి వివేకానంద్ అధికారులు ,ఆయా ప్రాంత వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ నగర్, ఉమాదేవి నగర్, లెనిన్ నగర్ లలో పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి మిగిలి ఉన్న పనులను తెలుసుకున్నారు. గడిచిన ఏళ్లలో ఈ డివిజన్ లో రూ.5 కోట్లతో బస్తీల్లో భూగర్భడ్రైనేజీ, మంచినీటి సరఫరా, సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి చేసినందుకు ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిగిలి ఉన్న కల్వర్టు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు . స్పందించిన ఎమ్మెల్యే అక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు . వాటిని త్వరలోనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ. గోవర్ధన్, డి.ఈ.ఈ .రూపాదేవి, ఏఈ కళ్యాణ్, జలమండలి డిజిఎం విష్ణు ప్రసాద్, మేనేజర్లు అంకిత్, ఝాన్సి స్థానిక డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, బస్తీల సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

సూపర్ మాక్స్ కార్మికులకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్
- షాపూర్ నగర్ రైతు బజార్ నుంచి సూపర్ మాక్స్ కంపెనీ వరకు ర్యాలీ
- కంపెనీ ఎదుట దీక్ష చేపట్టిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
సూపర్ మాక్స్ పరిశ్రమ కార్మికులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బుధవారం కార్మికులతో కలిసి వారికి మద్దతుగా పరిశ్రమ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సూపర్ మాక్స్ పరిశ్రమ కార్మికులు 127 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కంపెనీ మూతపడి ఆరు నెలలు అవుతుందన్నారు. కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డికి కార్మికుల సమస్యలు చెప్పినా పట్టించుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జాబ్ మేళాతో ఉద్యోగాలు ఇప్పిస్తున్నామని చెప్పినా 600 కుటుంబాలు ఉద్యోగాలు పోగొట్టుకుని రోడ్డున పడ్డాయని వాపోయారు. ఎమ్మెల్యేను మరోసారి గెలిపిస్తే జీడి మెట్లలోని కంపెనీలు మూత పడుతున్నాయని ఆందోళన చెందారు. ఎమ్మెల్యేకు కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే కార్మికుల పక్షాన దీక్ష చేపట్టాలని సవాల్ విసిరారు. నీళ్లు , నిధులు, నియామకాల పేరుతో ఏర్పడ్డ రాష్ట్రంలో కొత్త ఉద్యోగాలు రావడం పక్కన పెడితే ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని విమర్శించారు. కార్మికులకు చెల్లించాల్సిన జీవితభత్యాలతో పాటు బకాయిలను విడుదల చేయాలన్నారు. లేనియెడల ప్రతి కార్మికుడికి రూ. 50 లక్షల నష్టపరిహారం ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే బీజేపీ తరపున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు షాపూర్ నగర్ రైతు బజార్ నుండి సూపర్ మాక్స్ కంపెనీ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కార్మికులు ఐ.ఎస్.రావు, లక్ష్మారెడ్డి, ఈశ్వరరావు, దయాకర్ చారి, సూర్యనారాయణ, దుర్యోధనరావు, మధుకర్ , రవీందర్ ,మనోహర్, నాగలక్ష్మి , మీనా కుమారి, పద్మ ,మధుసూదన్, యాదయ్య ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని ఎస్ ఆర్ నాయక్ నగర్ కాలనీలో కళ్యాణ మండపంకు రూ.40 లక్షలు, జనప్రియ దగ్గర వర్షం నీరు పోవడానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ కౌన్సిలర్ బి రంగారావు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను తన నివాసం వద్ద కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. కాలనీవాసుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కాలనీ ప్రెసిడెంట్ వై రాజ గోపాల్ రెడ్డి, కాలనీ మాజీ అధ్యక్షులు శేషాచారి, పివి భాస్కర్ రెడ్డి, రాజారెడ్డి, మహేందర్ రెడ్డి, రాజేష్, సింహాచలం, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నవతెలంగాణ-దుండిగల్

ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తెలిపారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యలను పరిష్కరించాలని కృష్ణ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు అవకాశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

సృజనత్మాకతను ప్రోత్సహించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన ఆవిష్కరణలకు అవకాశం ఇచ్చేం దుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇంటింటా ఇన్నోవేటర్స్‌కు నేటి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. వచ్చేనెల 5వ తేదీ వరకు గడువు విధించారు.

ప్రతి ఒక్కరికి అవకాశం

ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించాలని ఉదేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసింది. గృహిణి నుంచి పాఠశాలలు, కళాశాల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఇలా ఎవరైనా ఇందులో పాల్గొనవచ్చు. ఆశావహులు వచ్చేనెల 5వ తేదీ నాటికి రెండు నిమిషాల నిడివితో కూడిన వీడియో, ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు ఫొటోలు, ఆరు వాక్యాల్లో 9100678543 నంబర్‌కు వాట్సాప్ పంపించవచ్చు. జిల్లా నుంచి అత్యుత్తమ ఆవిష్కం^ణలను ఎంపిక చేసి ఆగస్టు 15వ తేదీన ప్రదర్శించనున్నారు. అలాగే ఆవిష్కర్తల పేరు, వయసు, ప్రస్తుత వృత్తి, మొబైల్ నంబర్, ఏరియా, మండలం, జిల్లాతో కూడిన వివరాలను 9100678543కు వాట్సాప్‌లో పంపాలని సంబంధిత అధికారులు సూచించారు.



అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి ఒక్కరిలో ఏదోక ప్రతిభ దాగి ఉంటుంది. దానిని వేలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చక్కని అవకాశం కల్పించింది. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు నిత్య జీవితంలో ఉపయోగపడే ఆవిష్కరణల కోసం ఇదో మంచి అవకాశం. మరిన్ని వివరాల కోసం 7799171277 నంబర్‌పై సంప్రదించాలి.



- సి.ధర్మేందర్ రావ్, సైన్స్ అధికారి, హైదరాబాద్



ఆలయ పరిసరాల్లో కార్పొరేటర్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సమీపిస్తున్న నేపథ్యంలో బుధవారం కార్పొరేటర్ దీపిక రెజిమెంటల్ బజార్‌లో ఉన్న జూలేశ్వరి మాత ఆలయం వద్ద ప్యాచ్ వర్క్ చేయించారు. అలాగే ఆలయాల వద్ద శానిటేషన్ పనులను కూడా చేయించి నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. ఆలయాల కమిటీ వారు కోరిన మేరకు ఆలయ పరిసరాలలో హైమస్ట్ లైట్లను ఏర్పాటు చేయించారు.

ఎస్సీ, ఎస్టీల కేసులను సత్వరం విచారించాలి



- హైదరాబాద్ డివిజన్ ఆర్డీవో, కమిటీ చైర్మెన్ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్సీ, ఎస్టీలపై జరిగే అత్యాచార నిరోధక చట్టం కింద నమోదయ్యే కేసులను సత్వరమే విచారించి చార్జిషీట్ దాఖలు చేసి నిందితులకు శిక్షపడేలా చూడాలని హైదరా బాద్ డివిజన్ ఆర్డీవో, కమిటీ చైర్మెన్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై హైదరాబాద్ డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో 2017 నుంచి 2023 సంవత్సరం వరకు జరిగిన సంఘటనలపై ఆర్డీవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో, కమిటీ చైర్మెన్ మాట్లాడుతూ బాధితులకు పరిహారం సత్వరమే అందేట్లు చూడాలని, ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా అందించాలని అధికారులను ఆదేశించారు. కుల, జెన్యూనిటీ గురించి ఎలాంటి సమాచారం అడిగినా వెంటనే ఇవ్వాల్సిందిగా తహసీల్దార్లను ఆదేశించారు. అనంతరం కమిటీ మెంబర్లు అడిగిన ప్రశ్నలపై పోలీసు అధికారులు సమాధానమిచ్చారు. ఈ సమావేశం ప్రశాంతంగా నిర్వహిం చినందుకు ఆర్డీవో, కమిటీ చైర్మెన్‌ను అభినందించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ డివిజన్‌లోని పోలీసు అధికారులు, తహసీల్దార్లు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



పేదలకు ఆస్పత్రిలో అన్నదానం చేయడం చాలా సంతృప్తినిస్తుంది

- డాక్టర్ ముజీబ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో మంగళవారం రెడ్ హిల్స్‌లోని ఎంఎన్జే క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో సుమారు 600 పేద రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరుమీద నెలలో నాలుగు సార్లు పేదలకు ఆస్పత్రిలో అన్నదానం చేయడం తనకు చాలా సంతృప్తిగా ఉంటుందని, పేదవారికి ఒకపూట భోజనం పెట్టడం దేవుడు తనకిచ్చిన వరంగా భావిస్తూ, ముస్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు ఆ దేవుడు ఆశీస్సులతో చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్ కుమార్, సభ్యులు కె.ఆర్. రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, శంకర్, నరేష్ కుమార్, ఎంఎన్జే క్యాన్సర్ ఆస్పత్రి సభ్యులు శివకుమార్, అరుణ్ జ్యోతి, శివకుమార్, శేఖర్, ఈఎస్ఐ రాజ్ కుమార్, సీటీవో సుదర్శన్, నాలుగో తరగతి అసోసియేట్ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, ఏపీఆర్వో మహమ్మద్ వహీద్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT IBRAHIMPATNAM
I.A. NO.24 OF 2022,
I.A. NO.25 OF 2022,
I.A. NO.26 OF 2022
IN
O.S. No. 1646 of 2016

Between:
Kurma @ Dulla Maheshwar .....Petitioner/Plaintiff
AND
Jaithwaram Buchi Reddy Died per LRs .....Respondent/Defendant
Smt. J.Kalamma and others ....Respondents/Proposed Defendants

To,
Sudini Keerthana, W/o. Vishnu Vardharn Reddy, Aged major, Occ: Housewife, R/o. Thurka Yamjal Village, Abdullapurmet Mandal, Ranga Reddy District.

NOTICE

It is hereby take notice that the plaintiff herein has filed the Lrs petition to bring the legal heirs of Jaithwaram Buchi Reddy along with section 5 petition and abetment petition in above suit against you and other respondents/defendants in the above mentioned court and the above matters is posted on **18-07-2023** for your appearance and Counter. Therefore it is here by informed that, you should appear in the above-mentioned court by 10:30 A.M., either in person or through an advocate on the abovementioned date. If you failed to appear before the court, the Hon'ble Court would be decided the matter in your absence.

(BY ORDER OF THE COURT)
J. INDRAVARDAN GOUD
Advocate,
Office at Flat no. 131,
1st Sairam Nagar Colony, Champapet,
Hyderabad

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT IBRAHIMPATNAM
I.A. NO.27 OF 2022,
I.A. NO.28 OF 2022,
I.A. NO.29 OF 2022
IN
O.S. No. 1702 of 2016

Between:
Kurma @ Dulla Shankaraiah .....Petitioner/Plaintiff
AND
Jaithwaram Buchi Reddy Died per LRs .....Respondent/Defendant
Smt. J.Kalamma and others ....Respondents/Proposed Defendants

To,
Sudini Keerthana, W/o. Vishnu Vardharn Reddy, Aged major, Occ: Housewife, R/o. Thurka Yamjal Village, Abdullapurmet Mandal, Ranga Reddy District.

NOTICE

It is hereby take notice that the plaintiff herein has filed the Lrs petition to bring the legal heirs of Jaithwaram Buchi Reddy along with section 5 petition and abetment petition in above suit against you and other respondents/defendants in the above mentioned court and the above matters is posted on **18-07-2023** for your appearance and Counter. Therefore it is here by informed that, you should appear in the above-mentioned court by 10: 30 A.M., either in person or through an advocate on the abovementioned date. If you failed to appear before the court, the Hon'ble Court would be decided the matter in your absence.

(BY ORDER OF THE COURT)
J. INDRAVARDAN GOUD
Advocate,
Office at : Flat no. 131,
1st Sairam Nagar Colony, Champapet,
Hyderabad

IN THE COURT OF HON'BLE II ADDL. JR. CIVIL JUDGE CUM VII ADDL. METROPOLITAN MAGISTRATE, R.R. DISTRICT, AT: HAYATHNAGAR
O.S. No.458 OF 2023

Between:
Nulu Navya Shri ....Plaintiff
AND
The Tahasildar MRO Abdullapurmet and others ...Defendants

To
All Concerned

Please take notice, this is to inform the General Public, that the Plaintiff filed the above Suit O.S. No. 458/2023 for Declaration to declare the Plaintiff as the Sole Beneficiary of the Suit Schedule property, Open Land bearing Plot No. 128, in Survey No. 944, admeasuring 202 sq. yards or 168.88 sq. meters situated at Koheda Village & Gram Panchayat, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, by virtue of Testamentary Succession, through Unregistered WILL DEED dated 25.07.2006. The above case stands posted on 7th July 2023 to all concerned, for appearance at 10:30am Hence this Notice.

BY ORDER OF THE COURT /
K. RAGHAVENDRA CHARY
ADVOCATE
COUNSEL FOR PLAINTIFF

IN THE COURT OF THE HON'BLE PRL.JUNIOR CIVIL JUDGE-CUM-IV ADDL. METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGARI DISTRICT, UPPAL AT L.B.NAGAR
O.S. No. 450 of 2023

Between:-
H.V.Lokeshwar Sharma alias
H.V. Sai Baba Sarma @Lokesh @ Shyam .....Plaintiff
AND
1. T.Sathyanarayan Reddy.
2. All Concerned .....Defendants

To
ALL CONCERNED

Take notice that the Plaintiff filed the above Suit for Declaration declaring the Plaintiff is the absolute Owner and Possessor of the Suit Schedule Property being the Legal Heir and Successor of Late Smt.Gangabai @ Annapurna @ H.V. Annapurnamma W/o. Late Athmaram Haridas @ Athmaram who died on 21-07-2008 and the suit is stands posted to 21/08/2023. If any person or persons having any Objections or Claims they may appear before the above Court on **21/08/2023 at 10.30 a.m.** either in person or through an Advocate, failing which the matter will be decided basing on the documents available on record.

SCHEDULE OF PROPERTY

All that Dwelling Unit bearing No.4-118/40, in Part of Plot No.24 admeasuring 100 Sq.yards or 83.6 Sq.mtrs, situated at Seshasayee Nagar, Uppal Kalan Village, Uppal Mandal, now Medchal-Maikalgiri District (Erstwhile Ranga Reddy District) and bounded by:
NORTH : Part of Plot No.24 (belongs to M.Shankaraiah) **SOUTH** : Part of Plot No.24 **EAST** : Part of Plot No.24
WEST : 25.' wide Road

(BY ORDER OF COURT)
Sd/-
M/s.Deekonda Ravinder,
Advocates, Hyd.
Counsel for the plaintiff

IN THE COURT OF HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE CUM V ADDL. METROPOLITAN MAGISTRATE COURT, Madchal Malkajgiri District., at L B NAGAR
O.S. No.119 of 2022

BETWEEN:
G. Mutyalu, S/o.late Pichalah .... PLAINTIFF
AND
R. Karuna, W/o.Lakshmipathi Rao & Others .....DEFENDANTS

NOTICE

To,
R. Neela, D/o. Ramavarapu Lakshmipathi Rao, (Defendant No.3) Quarter No.4, Sriramnagar, Munchintal Road, Muchintala, Palamukia - 509 325

Take notice that the Plaintiff has field the above Suit against you & Others declare that the Plaintiff is Owner and Possessor of the Suit Schedule Property of. 200.00 sq. Yds., (167. sq. Mtrs.,) bearing plot No.31-D, in partly Sy. Nos.33/10 and part of 33/11 situated at Chengicherla Village & Grampanchayat, Ghatkesar (M), R.R. District. (Presently comes under Boduppal Muncipal Corporation, Madchal Malkajgiri Dist.,) The above Suit is posted for your apperence on **03-08-2023 at 10-30 am.,** if you are intrested to contest the matter, you may appear by person or through Counsel, failing which you may be declares ex-parte and matter will be proceeded further in your absence.

(BY ORDER OF THE COURT)
K L N SWAMY,
Counsel for Plaintiff
Cell No.94401 51002
O/o. 6-4-472/4, Krishna Nagar Colony, Axis Bank Lane, Opp. Gandhi Hospital, Secunderabad - 500 080

IN THE COURT OF THE HON'BLE XI ADDL. CHIEF JUDGE : CITY CIVIL COURT : AT HYDERABAD.
OP. No. 32 of 2023

Between:-
G. H. Viswnath and another. ....Petitioners.
A N D
The Supdt of South Central Railway P.A. & C.A.U's Railway Nilayam Secunderabad and others. ...Respondents.

NOTICE

To:
1) The Supt of South Central Railway P.A. &C.A.U's Railway Nilayam,Secunderabad.
2) The Divisional Railway Manager (P)/Sc Personal Branch IV Floor, Sanchalan Bhavan, Secunderabad.
3) All Concerned. .....RESPONDENTS

Please take notice that, the above named petitioners have filed the above case against you all for seeking relief of appointment of Guardian/Manager of Mentally and physically disabled person G.H.SURENDER LAL, and there by permit the petitioner No.1 i.e. G.H.VISWANATH, who is none other than younger brother of G.H.SURENDER LAL, both sons of late G. Hari Lal, and the said case stands posted to **26-7-2023** at about **10.30 am** for your appearance before the Hon'ble Court on the said date either in person or through counsel, failing which the matter will be decided exparte in your absence.

BY ORDER OF THE COURT
M/s.P SARASWATHI
Advocate.
Off: Flat No.201, 2nd floor, Archies Metro, L.B.Nagar, R.R. Dist. 9573231149

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE. RANGA REDDY DISTRICT. AT: HAYATH NAGAR
O.S.NO. 456 OF 2023

BETWEEN:
D. Eswaramma & others .....PLAINTIFFS
AND
1. The Tahsildar, Hayathnagar Mandal, R.R.District.
2.All Concerned .....DEFENDANTS

NOTICE

Please take notice that the above case is filed by the Plaintiffs to declare them as the legal heirs of Late D. Narsimha S/o Venkaiah, against you and others defendants and the same stands posted to 14.07.2023 for your appearance either in person or through your counsel on the above said date before Hon'ble Junior civil Judge R.R.Dist, At: Hayathnagar otherwise the case will be decided as per law Hence this notice.

SCHEDULE OF PROPERETY

All that piece and parcel of Land marked as Plot bearing No.4, Eastern part admeasuring 70 sq Yads (out of 150 sq yads), in Sy. No. 46,56 and 57, in ward No.4, block No.11, situated at Anmagal Hayathnagar, Hayathnagar Village, under L.B.Nagar Municipality, Hayathnagar Revenue mandal, R.R. District. Which is more fully described in the suit schedule of property. And entire plot bounded by:-
North :: Plot No.5 **South** :: 30' wide road, **East** :: 30' wide road, **West** :: Plot No.4 western part .

//BY ORDER OF THE COURT//
G. MAHATMA
Advocate.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT : MAHESHWARAM
I.A.No. 621 OF 2021
IN
O.S.No. 235 OF 2021

Between:
Jatavath Mohan & another .....Petitioners/Plaintiffs
AND
Jatavath Ramdas & others .....Respondents/Defendants

To
Sri Puli Ravinder Reddy s/o P.Laxma Reddy, Aged about 40 years, Occ: Business, R/o Saidabad Colony, Hyderabad .....Respondent No.2/Defendant No.2

That the above suit is filed by the Plaintiffs for declaration of title and declaration to declare the registered sale deeds are null and void and not binding on the Plaintiffs in respect of Schedule Property against you and others, along with the above suit the Petitioners also filed above I.A. seeking Interim Injunction restraining you and others from alienating the Schedule Property to third parties pending disposal of main suit and above I.A. and suit is posted on 18-07-2023 for your appearance. Therefore you are hereby directed to appear before the Hon'ble Junior Civil Judge, Ranga Reddy District at Maheshwaram on **18-07-2023 at 10:30 A.M.** either in person or through an Advocate failing which the matter will be decided as per law in your absence.

(BY ORDER OF THE COURT)
(L. SRINIVAS)
Advocate,
Maheshwaram, R.R. District
Counsel for Petitioners/Plaintiffs
Ph.No.9912711501

IN THE COURT OF THE HON'BLE XIVTh ADDL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: HAYATHNAGAR.
O.S.No. 217 of 2017

Between:-
Mula Krishna and Another's ... Plaintiff
AND
Nallabolu Sathanarayana Reddy and Others ...Defendants

To
Defendant Nos.1,2,4,5,11,13 & 14
1. Nallabolu Sathanarayana Reddy, S/o. N. Krishna Reddy, Aged about 60 years, Occ: Business, R/o. H.No.B-Q1, Municipal colony, Amberpet, Hyderabad
2. GPR Housing Pvt. Limited, Rep, by its Project Manager, Sri Ganta Veeraiah Chowdary, S/o. Surya Narayana, Aged aobut 41 years, Occ: Business, R/o. FCI Colony, Vanasthalipuram, Hyderabad.
4. V. Mallikarjun, s/o. V. Deechupaliaiah, Aged about 48 years, Occ: Business, R/o. H.No.35-70, Vallabh nagar, Wanaparthy town, Mahaboobnagar District.
5. M/s. Ushodaya Real Estates Pvt. Limited, Rep by its Managing Director, Sri Kalem Prabhakar Reddy, S/o. Late K. Yadagiri Reddy, Aged about 50 years, Occ:Business, Having their office at Plot No.302,SaiTowers,Dilsukhnagar Hyd'bad.
11. Yanamaddi Jagadish, S/0. Late. Y. Ranga reddy, Aged about 48 years, Occ: business, R/o. H.No.8-198, Prasunna Nagar, HMT, Chintal, R.R.district.
13. Smt. Bonagiri Bharathi, W/o. B. Ramulu, Aged about 56 years, Occ: A.N.M, R/o. H.No.8-1-362, RTC colony, Nalagonda Town,
14. Porohith Raghothom, S/o. Ramachandra, Aged about 58 years, Occ: Employee, R/o. H.No.3-3-526, Kutbiguda, Hyderabad.

That the Plaintiff filed the above suit against you for Declaration and Perpetual Injunction, in respect of Suit Schedule Property i.e. All that the land admeasuring Ac.0-27 guntas, in Sy.No.177/AA, situated at KAVADIPALLY Village, ABDULAPURMET MANDAL Mandal, Ranga Reddy District and bounded by **NORTH** : Land in Part of the Sy.No.177, **SOUTH** : Land in Part of the Sy.No.177, **EAST** : Land of Part of the Sy.No.177 and **WEST** : Land Bearing Sy.No.170 and the said suit is posted to 13-07-2023 for your all appearance. Hence you are hereby directed to appear either in person or through an Advocate on the said date i.e. **13-07-2023 at 10.30 A.M.** before the above Court, failing which the matter will be decided basing on the documents available on record.

M/s. K. RAJ REDDY
ADVOCATES
Counsel for the Plaintiffs
Off: 17-1-386/SN/16&/16/1, S.N. Reddy Nagar, Sama Saraswathi Garden lane Champapet, Saidabad, HYD-59.

IN THE COURT OF THE HON'BLE IX ADDL. JUDGE CITY CIVIL COURTS: AT HYDERABAD.
O.P. No.1643 OF 2022

BETWEEN:-
Kalluri Swapna and another ...Petitioners.
And
R.Ramanujan Prasad and others. ...Respondents

To
1. R.Ramanujan Prasad S/o. R Adinarayana Age: 38 years, Occ: Driver. Rio. H.No.8-7-89/C/97. Chaithanyanagar, Karmanghat, Hyderabad
2. K P Kullayappa S/o. Chinnappa Kunchapu Aged: Major, Occ: owner of crime vehicle, R/o.Plot No.107 B. Dwarakanagar, Hasthinapuram South, Saroomagar Mandal. Ranga Reddy District- 500079 ....Respondents

Please take notice that the above OP filed by the petitioners for claiming compensation under M.V Act against you, the above said case has been posted to 27.07.2023 for your appearance before this Hon'ble court therefore you are here by summoned to appear before the above cited I-Hon'ble court on **27.7.2023 at 10.30 a.m.,** either in person or through duly instructed advocate failing which an exparte order will be passed against you.

BY ORDER OF THE COURT
P.PANDURANGA REDDY
ADVOCATE
H.No.8-4-98/7,Pavanpuri colony Karmanghat, Hyderabad-500079, Mobile No. +919866087771

IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
I.A.No. 221 OF 2022
IN
O.S.No. 1039 OF 2022

BETWEEN:
Tandbandu Srinivas Chary .....Petitioner/Plaintiff
AND
Tandband Kavitha and others ... Respondents/Defendants

To,
Tadbadnd Raju (R4) S/o.Late Shivaraj, aged about 48 years, Occ:Corpentor, H.No. 12-07-92/2 New Mettuguda. Secunderabad ... Resopondent&Defendant No.4

NOTICE

Please take Notice that the Plaintiff in the above Suit filed Suit for Partition and separate possession and to declare, Gift Deed, Registered with Joint sub Registrar and released as Document 277 of 2020, subsequently, Mortgage deed without Possession, registered with Sub registrar officer of Azampura and released as Document No. 3573/ 2021, as Null and Void and Not Binding on the Plaintiffs. And also filed separate Petition I.A.No. 221 of 2022 in the above Suit against the Respondents/Defendants and the Hon'ble Court was pleased to post the matter on 19-07-2023 for your appearance and Counter. Therefore you are hereby informed to appear before this Hon'ble Court on **19-07-2023 at 10.30 A.M.** in person or along with your Counsel failing which the Hon'ble Court Proceed with the matter in your absence.

//"BY ORDER OF THE HON'BLE COURT"//
M/s. Prism Legal Associates,
Daraboina Subramanyam Yadav
Advocate,
#5-4-790/E, 2nd floor, Goverdhan Chambers, Abids Circle, Station Road. Hyderabad-500001,

---

IN THE COURT OF THE II ADDITIONAL SENIOR CIVIL JUDGE MEDCHAL MALKAJGIRI DISTRICT AT MALKAJGIRI
I.A.No. 5 of 2022
in
O.S.No. 1145 of 2022

Between:
Sri K.Komal Reddy .... Petitioner/Plaintiff
AND
1. Smt.Mamindla Jyothi Yadav and others ...Respondents/Defendants

1. M/s Anantha Sai Realters
Having its Office at H.No.16-3-10/3/16
II Floor, Sai Krupa Market, Malakpet
Hyderabad – 36.
Rep.by its Managing Partners
(a) Sri K.Linga Reddy S/o Late K.Narsimha Reddy
Aged about 51 years, Occ. Business.
R/o Plot No.11, V.V.Nagar, Street No.8, Habsiguda, Hyderabad – 500 007.
(b) Sri B.Dayanand S/o Late B.Ramulu
Aged about 54 years, Occ: Business
R/o H.No.1-5-38/17, Maruthi Nagar
Kothapet, Hyderabad – 500 035.
(c) Sri G.Sripathi S/o Sri G.Chandraiah
Aged about 26 years, Occ: Business
R/o H.No.11-13-98/1, Vasavi Colony
Ashtalakshmi Temple, Kothapet
Hyderabad – 500 035.
.....Respondent No.3/Defendant No.3
2. M/s VSR Constructions & Property Developers (P) Ltd., Rep.by its Managing Director, Sri C.Ramkotaiah
Situated at above Meghna Super Market C-61, 2nd Floor, Madhura Nagar, Yousufguda, Hyderabad – 500 038.
....Respondent No.4/Defendant No.4

1. Please take notice that the Plaintiff has instituted the suit before the above Hon'ble Court for the reliefs of Declaration of Title, Recovery of Possession and for other reliefs. Both of you are arrayed as the Defendant Nos. 3 and 4 respectively.
2. Likewise, the Plaintiff has also filed the Petition Under Order 39 Rules 1 & 2 of CPC seeking the orders of Injunction. In the said Petition bearing I.A.No. 5 of 2022, you are arrayed as the Respondent Nos.3 and 4 respectively.
3. The main Suit as well as the Interlocutory Application bearing I.A.No. 5 of 2022 are posted on 12-07-2023 for your appearance. Therefore, you are directed by the Hon'ble Court to be present at **10.30 A.M. on 12-07-2023** to represent the matter either in person or through the Counsel.

(BY THE ORDER OF THE COURT)
M.SREEDHARA MURTHY
SMT. SHOBHA RANI
ADVOCATES
ABOVE RELIANCE FRESH
I FLOOR, SAI BRINDAVAN MANSION,
RAILWAY STATION ROAD,
MALKAJGIRI, SECUNDERABAD.
PH. 9848016477

DOCUMENTS LOST

I, **BELIDE MADHURI, W/O. B. PRAVEEN KUMAR,** AGED 39 YEARS, OCC: HOUSEWIFE, R/O. H.NO. 3-14-12/C, FLAT NO.303, SAIRAM TOWERS, STREET NO.2, SRINIVASAPURAM, RAMANTHAPUR, AMBERPET, HYDERABAD - 500 013 T.S.. I HAVE LOST MY ORGINAL SALE DEED DOCUMENTS HOUSE/LAND/PLOT (DOCUMENTS NO.1965/1996 (CHIKKADAPALLY), 2511/2017 (CHIKKADAPALLY), 2512/2017 (CHIKKADAPALLY), 1655/2010 (SHAMSHABAD), 5465/2010 (YADAGIRIGUTTA), 1655/2000 (CHAMPAPET), 1417/2011 (CHEVELLA). I LOST MY ABOVE DOCUMENTS WHILE I WAS TRAVELLING FROM ABIDS, NEAR CHERMAS TO HOUSE AT RAMANTHAPUR ON 02-07-2023.

IF ANY ONE FOUND THEM KINDLY CONTACT 81069 77991

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD.
O.S. No. 2600 OF 2023

Between:
Jorrigala Laxmi & 3 others ...Plaintiffs
AND
The Tahsildar/M.R.O. Himayatnagar & All Concerned ....Defendants

To,
ALL CONCERNED

Whereas the plaintiffs have filed the above suit for Declaration declaring that the plaintiffs are the Legal Heirs and successors of Late. Jorrigala Durgaiah who died on 31-10-2018 against you and others and the said suit stands posted to 25-07-2023 for the claims/objections. Hence if any person or persons having any claims/objections, they may appear before the above Hon'ble Court on **25-07-2023 at 10.30 a.m.,** either in person or through an Advocate, Failing which the matters will be decided basing on the documents available on record.

(BY ORDER OF HON'BLE COURT)
Counsel for Plaintiffs
LEGAL WAGON
ADVOCATE & ASSOCIATES
Office at 11-6-23, A.R. Avenue, Red Hills, Nampally Criminal court Road, Hyderabad. 500001, T.S, Mobile No. 9032178690

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE AT:: MAHABUBNAGAR
O.S.No. 70 of 2022

Between:
Smt.Manchana Varalaxmi and others ....Plaintiffs
And
Smt.Manchana Chandrakala and others ....Defendants

NOTICE

TO,
1.Smt.Manchana Chandrakala W/o late M.Durgaiah,aged 70years,Occ:Housewife
2.Smt.Juluri Uma Devi W/o Krishnaiah,aged 50 years,Occ:House wife.
3.Smt.K.Jyothi W/o Ramesh,aged 47years,Occ:House wife,
4.Smt.B.Sangeetha W/o Bhaskar,aged 40 years,Occ:House wife,
All are R/o H.No.8-7-92/19,plot No.19,Road No.1,Laxmi Narasimha colony,Hasthinapuram,B.N.Reddy Nagar,Hyderabad.
5.Sri.Manchana Raghavender S/o late M.Buuchi Lingam,aged 43 years,Occ:Agriiculture, R/o Karoor Village,Nawabpet Mandal,Mahabubnagar District,
6.Smt.Manchana Sravanthi @ Vyshnavi W/o M.Raghavender,aged 35 years,Occ: House wife,R/o Sheshu KiranaShop,Gunji,Shadna gar,Farooqnagar Mandal,Ranga Reddy Dist.,
7.Smt.Kistamma W/o Satya narayana,aged 46 years,Occ:Business,R/o Sheshu Kirana Shop,Gunji,Shadnagar,Farooqnagar Mand al,Ranga Reddy Dist.,Cell No.9848 113 148.
8.Sri.Manchana Raghavulu @ Veera Ragha vulu S/o late M.Ramulu,aged 63years, Occ: Business &Agriculture, R/o H.No.2-01,Ippatoor village,Nawapet Mandal,Mahabubnagar District.
9.Sri.Manchana Omprakash S/o late Manch ana Ramulu,aged 55 years,Occ:Business, R/o plot No.387,Road No.10,Srinivasapura m,B.N.Reddy nagar colony,Chinthalkunta, Opp:Anis High School,Hyderabad,JoiSanth oshimatha Kirana & General Stroe.
10.Smt.Bhanu W/o Satyam,aged 29years, Occ:House wife,R/o Karur Village,Nawabpet Mandal,Mahabubnagar District.
11.Sri.Katta Shashidhar S/o Pandaiah,aged major,Occ Agriculture,R/oThirumalapur Villa ge,Rajapur Mandal,Mahabubnagar District.
12.Shaik Misba S/oShaik Zilani Basha aged years,Occ:Agriculture R/o Ippatoor Village, Nawabpet Mandal,Mahabubnagar District.
13.Mohammed Mohiuddin Kurrath S/o Ahmed Mohiuddin,aged years,Occ:Agriculture,R/o Ippatoor Village,Nawabpet Mandal, Mahabubnagar District.
....Defendant No.1 to 13

Whereas the plaintiffs have filed the above suit against you for partition and separate po ssession with regard to the suit **schedule"A"property** of land in Sy.Nos:116/A, 118/AA/1,173/1/1/1/1,173/1/1/1/2,173/1/1/2,173/1/2,173/2,and 173,situated within the limits of Ka rur Village of Nawabpet Mandal,Mahabubna gar Dist.,and the suit **schedule"B"property** of residential hous e bearing No.2-1,situated within the limits of Ippatoor Village,Nawabpet Mandal,Mahabubnagar Dist.,before the Hon"ble Prl.Junior Civil Judge,Mahabubnagar.And the said suit is posted to 26-07-2023 for your appearance before the above said cou rt.So you are hereby instructed to a ppear on 26-07-2023 at 10.30 am either in perso ns or through your authorized agent, failing which the matter will be decided in your absencebasingontherecordavailableon record.

(By the order of the Hon"ble Prl.Junior Civil Judge, Mahabubnagar)
Shivanna,
B.Com,LL.B.,
Advocate
Mahabubnagar.
Cell No.9985637709.

కృష్ణారెడ్డి స్మారక ఉపన్యాస కార్యక్రమం



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్లో ప్రొఫెసర్ జి.క్రిష్ణారెడ్డి స్మారకోపన్యాస కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవి గీత రామస్వామి (జార్జిరెడ్డి కుటుంబీకురాలు) " భూమి, తుపాకులు, కులం స్త్రీ: విప్లవత్మక జ్ఞాపిక" అనే అంశం పై పలువురు మాట్లాడారు. తెలంగాణాలో ఆధిపత్య కులాల ఆధిపత్య దోరనితో దళితులపై ఏవిధంగా దాడులు చేసారో ఆమె వివరించారు. నేటితరం యువత ఉద్యమ స్ఫూర్తిని పోరాడే తత్వాన్ని మర్చిపోవడం వల్లనే అగ్రవర్ణాల వారు, వ్యాపారులు రాజకీయాల్లో ఉంటున్నారని తెలిపారు. బహుజన వాదం బలపడకుంటే రాబోయే తరాలు బానిసత్వంలో జీవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నేటి సమాజంలో సామాన్య ప్రజలపై జరుగుతున్న అన్యాయాలపై ఈ సెమినార్‌లో పొలిటికల్ సైన్స్ హెడ్ డా.చంద్రునాయక్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అసో.ప్రొ.కృష్ణ కుమార్, అ.ప్రొ.చలమల్ల వెంకటేశ్వర్లు, రీసెర్చ్ స్కాలర్స్, పీజీ విద్యార్థులు, మేధావులు పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన విజయారెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలలో పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్పొరేటర్ పి.విజయారెడ్డి, ప్రధాన ఉపాధ్యాయురాలు శాంత రాథోడ్‌తో కలిసి నోటు బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

24న సామూహిక భోజనాలు

నవతెలంగాణ-ఓయూ

మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీఆర్ఎస్వీ ఓయూ ప్రధాన కార్యదర్శి మిథున్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ఓయూలో గల ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో సామూహిక భోజనాలు నిర్వహిస్తున్నట్టు మిథున్ ప్రసాద్ తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, విద్యార్థి, యువజన విభాగాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని మిథున్ ప్రసాద్ కోరారు.

బల్దియాకు కొత్త బాస్

- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా రోనాల్డ్ రోస్ బాధ్యతలు స్వీకరణ
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసిన కొత్త కమిషనర్





నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా రోనాల్డ్‌రోస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆర్థిక శాఖలో కార్యదర్శిగా రోనాల్డ్‌రోస్ విధుల్ని నిర్వర్తించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పని చేసిన లోకేశ్‌కుమార్‌ను అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రోనాల్డ్ రోస్‌కు గతంలో మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా, ఫైనాన్స్ సెక్రెటరీ, గురుకుల పాఠశాల సెక్రెటరీగా, జీహెచ్ఎంసీలో ఖైరతాబాద్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా పని చేసిన అనుభవం ఉన్నది. లోకేష్ కుమార్ నుంచి రోనాల్డ్‌రోస్ బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తదనంతరం రోనాల్డ్ రోస్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ.వీ.డీ.ఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఇ.ఎన్.సీ జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్లు ప్రియాంక అలా, వి.కృష్ణ, సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెనడి, హెచ్ఆర్‌డీసీఎల్ సీ.ఇ. సరోజినీ దేవి, ప్రాజెక్టు సీ.ఇ. దేవానంద్, సీసీపీ దేవేందర్ రెడ్డి, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వరరెడ్డి, అడిషనల్ సీ.పీ.శ్రీనివాస్, హౌసింగ్ ఓఎస్‌డీ సురేష్ కుమార్, సీ.ఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ పద్మజ, సీపీఆర్‌ఓ మహమ్మద్ ముర్తుజా, సెక్రెటరీ లక్ష్మి, పీడీ సౌజన్య, జాయింట్ కమిషనర్ శశి రేఖ వెంకట్ రెడ్డి, సంధ్య, ఎస్ఈలు వెంకటరమణ, విద్యాసాగర్, రవీందర్ రాజు, రత్నాకర్, అశోక్‌రెడ్డి, చినారెడ్డి, శంకర్, పీ.ఆర్.ఓ పద్మ తదితరులు కమిషనర్‌ను కలిశారు.

పేదలు అధికంగా ఉండే ప్రాంతాల్లో బస్తీ దవాఖానలు



- ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-అంబర్‌పేట

పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకే బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పటేల్‌నగర్ చౌరస్తాలో బస్తీ దవాఖానను మంత్రి స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని 360 బస్తీ దవాఖానల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వైద్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఈ బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో బస్తీ పేదలు నివసించే ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, స్థానిక నాయకులు లవంగు ఆంజనేయులు, కారంగుల లింగారావు, ఆమునూరి సతీష్, రంగు సతీష్ గౌడ్, మల్లేష్ యాదవ్, జాఫర్, మహేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాంబాబు యాదవ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జి. రాంబాబు యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, రైతు సమన్వయ సమితి చైర్మెన్ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు. రాంబాబు యాదవ్ కార్మిక, ఉద్యోగుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారనీ, తాను ఆయురారోగ్యాలతో ఉంటూ భవిష్యత్తులో కార్మికుల కోసం కృషి చేయాలని తెలిపారు. వాటర్ బోర్డు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన రాంబాబు యాదవ్‌కు కార్మికవర్గం నుంచి ఆశీర్వాదాలు ఉన్నాయనీ, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, రాష్ట్ర కనీస వేతనాల చైర్మెన్ పి.నారాయణ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.రూప్‌సింగ్, యూనియన్ జనరల్ సెక్రెటరీ జయరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, జాంగీర్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ అత్తర్ అలీ, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, సి.రాజు, మేడ్చల్ శ్రీనివాస్, జంగయ్య, ఆశం, రవీందర్, పాండు, జమీల్, నర్సింగ్ రావు, ఎల్లమయ్య, సాయికిరణ్ గౌడ్, అజయ్ నాథ్, యూనియన్ అడ్వైజర్స్ లక్ష్మణ్ కుమార్, షకీల్, తదితరులు పాల్గొన్నారు.



బొంతు రామ్మోహన్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-అంబర్‌పేట

నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు బీఆర్ఎస్ అంబర్ పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, రాష్ట్ర మహిళా నాయకురాలు దేవిరెడ్డి విజిత రెడ్డి, జనార్దన్, చందర్‌చారి, జేడీ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- కేంద్రమంత్రి రాందాస్ అద్వాలేతో బీసీ నాయకుల చర్చలు



నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ అద్వాలేను బీసీ నాయకుల బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడేండ్లుగా అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కాలేజీ కోర్సు స్కాలర్ షిప్ రేట్లు రెట్టింపు చేసి ఆర్థిక పరిమితి పెంచాలన్నారు. జాతీయ స్థాయిలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మాదిరిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలన్నారు. కులవృత్తులు, చేతి వృత్తులు దిబ్బతింటున్న కారణంగా జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల స్వయం ఉపాధి పథకాలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. కాలేజీ హాస్టళ్ళ భవన నిర్మాణాలకు తెలుగు రాష్ట్రాల్లోని సంక్షేమ పథకాలకు 80 శాతం గ్రాంటు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం కులాల వారిని లెక్కలు తీయడానికి సుముఖంగా ఉందనీ, సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని కేంద్రమంత్రి హామీనిచ్చారని తెలిపారు. ప్రధాని మోడీ, ఇతర కేంద్ర మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి రాందాస్ అద్వాలే చెప్పినట్టు తెలిపారు. ఈ చర్చల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఢిల్లీ అధికార ప్రతినిధి, ఇన్‌చార్జి కర్రీ వేణుమాధవ్, దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా.ఎన్.మరేష్, డా.బత్తల వెంకటరమణ, బత్తల హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికులను శ్రమ దోపిడీ నుంచి రక్షించండి



- రాష్ట్ర లేబర్ కమిషనర్ అహ్మద్ నదీమ్‌కు జేపీసీ వినతి

నవతెలంగాణ-అడిక్‌మెట్/హిమాయత్‌నగర్

మిషన్ భగీరథలో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం, లేబర్ అధికారులు విడుదల చేసిన కనీస వేతనాల జీవోలను అమలు చేయకుండా వారి శ్రమను దోచుకుంటూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల జేపీసీ నాయకులు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్య అన్నారు. బుధవారం చిక్కడపల్లి లోని అంజయ్య కార్మిక సంక్షేమ భవన్‌లో రాష్ట్ర లేబర్ కమిషనర్ అహ్మద్ నదీమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మిషన్ భగీరథకు అనేక అవార్డులు, రివార్డులు వస్తున్నాయి అంటే అది కార్మికుల శ్రమ ఫలితమే అనీ, వారి శ్రమను గుర్తించకుండా కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న కార్మికులు కార్మిక నిబంధనలకు నోచుకోకుండా కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పండగ, జాతీయ, ఆర్జిత సెలవులు లాంటి ఏ చట్టాలను కూడా నోచుకోకుండా విధులు నిర్వహిస్తుండటం దురదృష్టకరమని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు జీవో 60 ప్రకారం రూ.15,600 జీతాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ దాన్ని అమలు చేయకుండా అతి తక్కువ జీతాలు ఉన్న కన్స్ట్రక్షన్ ఆఫ్ డ్యామ్స్ అనే జీవో 107ను అమలు చేస్తూ కేవలం రూ.9-10వేల లోపు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో బడా కాంట్రాక్టర్లు అయిన మెగా కన్స్ట్రక్షన్ కంపెనీ, ఎల్అండ్‌టీ కంపెనీ లాంటి సంస్థలు కాంట్రాక్టులు నిర్వహిస్తున్నప్పటికీ కార్మికులకు మాత్రం కనీస వేతనాలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కార్మికులను శ్రమదోపిడీకి గురి చేస్తున్న కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకుని కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు అయ్యేలా చూసి న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన లేబర్ కమిషనర్ జీవోలన్నింటినీ పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు అని వారు ఈ సందర్భంగా తెలిపారు.



డిప్యూటీ మేయర్‌ను కలిసిన లాలాపేటవాసులు

నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లోని లాలాపేట్‌లో బొడ్రాయిని ప్రతిష్ఠిస్తున్న సందర్భంగా లాలాపేట్ వాసులు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డిని తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కిలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వంజరి ముత్యాలు, మల్లేష్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, గణేష్, మహేష్ సాయి, బాలి యాదవ్, అశోక్ యాదవ్, కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-ఓయూ

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు సూచించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బుధవారం బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో లాలాగూడ పోలీస్ స్టేషన్, చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సహకారంతో తార్నాక విజయపురి కాలనీలోని సరోజినీనాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయంలో ట్రాఫిక్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ రాజు మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యత, రోడ్డు భద్రత, ట్రాఫిక్ ఉల్లంఘనలు, నేరాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలు, భద్రత ప్రమాణాల పట్ల సంపూర్ణ అవగాహణ కలిగి ఉండి, చుట్టుపక్కల వారిని చైతన్య పరచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతూ, తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్న ఘటనలను నిత్యం చూస్తూనే ఉన్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలన్నారు. నియమ నిబంధనలను వివరిస్తూ, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ట్రాఫిక్ సీఐ తిమ్మప్ప, లాలాగూడ ఎస్ఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్ఐ వికరుద్దీన్, ఏఎస్ఐ వీరమ్మ, సుమన్ కుమార్, వనిత ఫార్మసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మమత, ఎగ్జిబిషన్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుర్భర స్థితిలో నాట్కో ప్రభుత్వ పాఠశాల



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్‌లోని నాట్కో ప్రభుత్వ పాఠశాలను సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సర్వే చేశారు. బోరబండ సైట్ 3 లో ఉన్న నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుస్థితి, సౌకర్యాల లేమి, టీచర్ల లేమితో దుర్భరమైన స్థితిలో ఉన్నదని, సీపీఐ(ఎం) నాయకులు టి.సాయి శేషగిరిరావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్య లేనిదే ఏ సమాజం అభివృద్ధి సాధించదనీ, అలాంటి విద్య పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనీ, దీన్ని తాము ఖండిస్తున్నామని తెలిపారు. 1800 మంది విద్యార్థులు ఉన్న ఈ స్కూలులో ఆటలు, చదువులో ఉత్తీర్ణత శాతం ఎక్కువగానే ఉన్నదన్నారు. ప్రస్తుతం 37 మంది టీచర్లు ఉన్నారనీ, ఇంకా 18 మంది టీచర్లు అవసరం ఉందని తెలిపారు. పాఠశాలలు ప్రారంభించి 20 రోజులు దాటినా ఇంతవరకు టీచర్లని నియమించలేదన్నారు. బాత్రూములు కూడా సరిపోవడం లేదనీ, ఉన్నవి కూడా తీవ్ర దుర్గంధం వస్తున్నాయని విద్యార్థులు సీపీఐ(ఎం) నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను వెంటనే అధిగమించాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్కూలు ప్రిన్సిపాల్ యాదిగిరితో మాట్లాడినట్టు తెలిపారు. డీఈవో, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్తామని తెలిపారు. టీచర్లు లేని కారణంగా విద్యార్థులను చేర్చుకోమని బోర్డు కూడా పెట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థులకు మంచి విద్యా బోధన చేయటానికి టీచర్లుగా తమ బాధ్యత తాము నెరవేరుసామని ప్రిన్సిపాల్ చెప్పినట్టు తెలిపారు. ఈ దుస్థితి మారకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని సాయి శేషగిరిరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు దాదిమల్ల కృష్ణ, చింతల శ్రీను, విద్యార్థి నాయకులు సునీల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దేవయ్య బస్తీలో బస్తీ దవాఖాన ప్రారంభం

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ డివిజన్ దేవయ్య బస్తీలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి బస్తీ దవాఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపీనాథ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేద ప్రజల పక్షపాతి అన్నారు. ఏ పథకం ప్రవేశ పెట్టినా పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెడతారని తెలిపారు పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనీ, వారికి వైద్యం అందుబాటులో ఉండేలా బస్తీ దవాఖానను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ బస్తీ దవాఖానలో ఉచిత వైద్యంతో పాటు, అని& పరీక్షలు ఉచితంగా చేస్తారనీ, మందులు కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఎస్‌పీహెచ్‌ఓ అనురాధ, డివిజన్ అధ్యక్షులు కృష్ణమోహన్, విజయకుమార్, డివిజన్ కో-ఆర్డినేటర్ విజయసింహ, డివిజన్ ఇన్‌చార్జి సిరాజ్, షరీఫ్, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ తెలంగాణ పర్యటనను అడ్డుకుంటాం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఈనెల 8వ తేదీన ప్రధాని మోడీ తెలంగాణ పర్యటనను అడ్డుకుంటామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో బలోపేతం కావడానికి శాయశక్తుల సహకరించిన బీసీ వర్గాలు, యువతను వంచిస్తూ పార్టీ అధ్యక్షునిగా ప్రాతినిధ్యం వహించిన బీసీ సామాజికవర్గానికి చెందిన బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్షుడి స్థానం నుంచి తప్పించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీల నాయకత్వం అగ్రవర్ణ పార్టీల నిర్మాణానికే పరిమితం తప్పా ప్రజలను పరిపాలించడానికి తాము పనికిరామా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ రాష్ట్ర బీసీల ఆకాంక్షలను అర్థం చేసుకోవాలని కోరారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేని కారణంగా అసెంబ్లీ, పార్లమెంటులలో బీసీలు అడుగు పెట్టలేకపోతున్న విషయం ప్రధానికి తెలిసినా అందుకు అవసరమైన చిన్న రాజ్యాంగ సవరణను పార్లమెంటు సాక్షిగా తొమ్మిదేండ్ల పాలనలో చేపట్టకపోవడం చూస్తే బీసీ ప్రధాని అయిన మోడీపై అగ్రవర్ణాల ఆంక్షలు స్పష్టంగా అగుపిస్తున్నాయని తెలిపారు. 75 ఏండ్లుగా తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అవకాశానికి నోచుకోని బీసీల పట్ల బీజేపీ అగ్ర నాయకత్వం, ప్రధాని మోడీకి సానుభూతి లేకపోవడం విచారకరమన్నారు. కొనసాగుతున్న అగ్రవర్ణ పార్టీల ఆగడాలను అడ్డుకోవడానికి తెలంగాణలో బీసీల పక్షాన నిలిచేందుకు త్వరలోనే ప్రత్యేక పార్టీ ప్రజల ముందుకు రానుందని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షుడు దొంత ఆనందం, కార్యదర్శి మామిళ్ళ సుధాకర్, రెండు తెలుగు రాష్ట్రాల ప్రతినిధి ఉసిరికాయల సిద్ధార్థ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిబాబా, పొదిల రాజు, చేపూరి ఓదెల యాదవ్, బొమ్మ నరేందర్, కోణం శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మా కష్టాలను గుర్తించండి : రవాణా రంగ కార్మికుల జేఏసీ



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ రవాణా రంగ కార్మికుల ఐక్య సమితి ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 2 కోట్ల పైచిలుకు జనాభా రవాణా రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తు న్నారని తెలిపారు. పెద్ద పెద్ద వ్యవస్థల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూడటం చాలా బాధాకరమన్నా రు. రవాణా రంగ కార్మికులను ఒక్క తాటిపైకి తీసుకొచ్చి తెలం గాణ రవాణా రంగ కార్మికుల ఐక్య సమితి జేఏసీగా ఏర్పడి పలు డిమాండ్లను మీడియా సమావే శంలో అమలు చేశారు. రవాణా కార్మిక సంక్షేమం ఏర్పాటు చేయా లనీ, హైదరాబాద్‌లో ఆటోలకు కొత్త పరిమితులు అందజేసి పెరిగిన క్వార్టర్ టాక్, గ్రీన్ ట్యాక్స్ తగ్గించి కేబ్ రంగానికి జీవో 46 అమలు చేసి లారీలకు సింగిల్ పర్మిట్ విధానం ప్రైవేట్ డ్రైవర్లకు కనీస వేతన చట్టం అమలుతోపాటు పెట్రోల్ డీజిల్ జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమా ండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ్, రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సంపత్‌రెడ్డి, రవి, శివకుమార్, రాంపల్లి మల్లేష్ గౌడ్, సూర్య ప్రకాష్, ముక్తార్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ తొలగింపు బీజేపీ బీసీ వ్యతిరేక వైఖరికి నిదర్శనం



నవతెలంగాణ-అడిక్‌మెట్

అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్ తొలగింపు బీజేపీ బీసీ వ్యతిరేక వైఖరికి నిదర్శనం అనీ, ఆపద సమయంలో వెట్టిచాకిరికి, త్యాగాలకు బీసీలు ఫలం సమయంలో అధికారానికి, వైభవాలకు రెడ్లు, రావులా ఈ మోసాలు ఎంతకాలం అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ప్రశ్నించారు. బుధవారం విద్యానగర్ బీసీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో గతంలో ఎన్నడూ లేని రికార్డు స్థాయిలో లక్ష కోట్ల ప్రజాధనం బీఆర్ఎస్ అవినీతి దాహానికి బలవుతుంటే, ఇందుకు అడుగడుగునా సాక్షాధారాలు బహిరంగమవుతున్నా, ఆ అవినీతిని అంతమొందించాల్సిన ప్రధాన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పై ఉందన్నారు. కేసీఆర్ కుటుంబం అవినీతి పై ఏమాత్రం చర్యలు తీసుకోకుండా కేవలం తన రాజకీయ లాభానికి బ్లాక్ మెయిల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని నియంత్రించడానికే వాడుకునే కేంద్ర ప్రభుత్వ విధానాలను ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య కృత్రిమ యుద్ధ వాతావరణ సృష్టించి, పరస్పర కొట్లాటగా సృష్టించి పరిష్కరించే ప్రయత్నం చేయకుండా బండిని బలి చేసి అనేక నేరారోపణలు ఈటలపై మోపిన చాణిక్య నీతి స్థానిక బీజేపీ మేధస్సు కాదా అని అనుమానం వ్యక్తం చేశారు. బీజేపీకి బీసీలపై ఈ మోసాలు కొత్త కాదనీ, గతంలో ఆలె నరేందర్, బండారు దత్తాత్రేయ, వన్నెల శ్రీరాములు, బంగారు లక్ష్మణ్ పార్టీని పార్టీని వీడినట్టు తెలిపారు. ఈ నాయకులను వాడుకొని వెంకయ్యానాయుడు, విద్యాసాగర్ రావు, కిషన్ రెడ్డిలో సమయానుకూలంగా తాము మాత్రమే కీలక పదవులు పొందారు అని గుర్తు చేశారు. బీజేపీ రెడ్డి, రావులు సర్వకాలాలందు అధికార పార్టీతో కుమ్మక్కైన వారేనని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, వేముల రామకృష్ణ, జి.కృష్ణ, సాయిబాబా, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే కాలేరు



నవతెలంగాణ-అంబర్‌పేట

పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో అనారోగ్యాలపాలై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోల్నాక డివిజన్ పరిధిలోని లంక బస్తీకి చెందిన సుభాష్ చికిత్సకి మంజూరైన రూ.2 లక్షలా 50 వేల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌కె.బాబు, భూపతి లక్ష్మణ్, రచకట్ల దేవేందర్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం కృషితో ఎదగాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-ముషీరాబాద్

యువత స్వయం కృషితో ఎదగాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ పరిధిలోని పార్సిగుట్టలో అద్వైత ఫార్మాసిటికల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఆలోచించకుండా టాలెంట్ ఉంటే ప్రయివేటు రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్ నేత, నిర్వాహకులు కె.సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓ మారుమూల పల్లెటూరు.. నిరుపేద కుటుంబం.. సరైన మైదానమే లేదు.. ఆటలో ఓనమాలు నేర్పేవాళ్లు లేరు. ఇలాంటి చోట నుంచి వచ్చిన ఓ అమ్మాయి భారత జట్టుకు ఎంపిక అవుతుందని ఎవరూ ఊహించరు. అయితే బారెడ్డి మల్లి అనూషకు ఇది సాధ్యమయింది. బంగ్లాదేశ్ పర్యటించే భారత సీనియర్ మహిళల జట్టులో చోటు దక్కించుకుంది. ఆశలే లేని చోట అసలు క్రికెటర్ ఎలా పుట్టిందో తెలుసుకుందాం...



నిరుపేద అమ్మాయి భారత జట్టుకు ఎంపికయింది

అనంతపురం జిల్లా, నార్పల మండలం, బండ్లపల్లి గ్రామంలో ఓ రైతు కుటుంబంలో పుట్టింది అనూష. పేదరికం వల్ల చిన్నప్పటి నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. అసలు ఆటల్లో వచ్చే పరిస్థితి కాదామెది. క్రికెట్‌పై ఆసక్తి ఉన్నా.. ఎలా నేర్చుకోవాలో.. ఎక్కడ నేర్చుకోవాలో కూడా తెలీదు. అయితే ఆమె చదువుకున్న పాఠశాలలో పీఈటీ రవీంద్ర ప్రోత్సాహంతో క్రికెట్ ఆడడం మొదలుపెట్టింది. మొదట పేస్ బౌలింగ్ చేసేది. బ్యాటింగ్ లోనూ మంచి పట్టు సాధించింది. అన్నిటికిమించి ఫీల్డింగ్‌లో అదరగొట్టేది. తోటి అమ్మాయిలు ఫీల్డింగ్ చేయడానికి భయపడుతుంటే బెదురులేకుండా డైవ్‌లు కొట్టి క్యాచ్‌లు అందుకునేది. క్రికెట్లో రాణిస్తూనే ఆర్థికంగా ఇబ్బందులతో రోజువారీ కూలీగా పని చేసేది.

కెరీర్‌లో కీలక మలుపు

2014లో అనంతపురం ఆర్డీటీ అకాడమీ నిర్వహించిన టోర్నీలో బండ్లపల్లి పాఠశాల తరపున తన సత్తా చాటుకుంది అనూష. ఆ అకాడమీలో ఆడే అవకాశాన్ని పొందింది. ఇదే ఆమె కెరీర్‌లో కీలక మలుపు. ఇక్కడ చేరిన తర్వాత బౌలింగ్‌పైనే ఆమె దృష్టి పెట్టింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లకు మంచి అవకాశాలు ఉండడంతో పేస్ నుంచి స్పిన్‌కు మారింది. ఆంధ్ర అండర్-19 జట్టులో చోటు దక్కించుకుంది. 2018 చెన్నైలో జరిగిన సౌత్‌జోన్ టోర్నీతో తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన అనూష మ్యాచ్ మ్యాచ్‌కు పురోగతి సాధిస్తూనే వుంది. 2019లో ఎన్‌సీఏ శిబిరానికి ఎంపిక కావడంతో అనూషకు మరింత మంచి సౌకర్యాలు, కోచింగ్ లభించాయి. 2021లో బీసీసీఐ సీనియర్ వన్డే టోర్నీలోనూ ఈ స్పిన్నర్ తన ముద్ర వేసింది. రాజస్థాన్, బెంగాల్, హైదరాబాద్, జట్లపై మెరుగైన ఆట ఆడింది.

అసలు ఊహించలేదు


"భారత జట్టుతో కలిసి ఆడతానని అసలు ఊహించలేదు. ఒకప్పుడు పేదరికంతో కూలికి వెళ్లిన నేను దేశం తరపున ఆడుతున్నానంటే నమ్మలేకపోతున్నా. ఆర్డీటీ అకాడమీ, ఆంధ్ర క్రికెట్ సంఘం అండ వల్లే ఈ స్థితిలో ఉన్నా. ఎన్‌సీఏ శిక్షణ వల్ల ఎంతో మెరుగయ్యా. బంగ్లాదేశ్ పర్యటనలో సత్తా చాటుతాననే నమ్మకంతో ఉన్నా. బౌలింగ్, బ్యాటింగే కాదు ఫీల్డింగ్ అంటే ఎంతో ఇష్టం" అంటుంది అనూష.



రవీంద్ర జాడేజాలా...

ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్ జోనల్ టోర్నమెంట్లో సౌత్‌జోన్‌కు ఆడుతూ ఈస్ట్‌జోన్‌పై అనూష గొప్ప ఆట ఆడింది. బరోడాలో జరిగిన మ్యాచ్‌లో త్రిపురపై 10 పరుగులకే 5 వికెట్లు పడగొట్టింది. హాంకాంగ్‌లో జరిగిన మహిళల వర్ధమాన క్రికెటర్ల కప్‌లో భారత్-ఏకు ఆడే అవకాశాన్ని దక్కించుకుంది. అదే జోరుతో సీనియర్ జట్టులోనూ స్థానాన్ని సంపాదించింది. క్యాచ్‌లు పట్టడమే కాదు మెరుపు రనౌట్‌లు చేసే అనూష రవీంద్ర జడేజా అభిమాని. అతడిలాగే ఆల్‌రౌండర్‌గా సత్తా చాటాలని కోరుకుంటోంది.

అన్నంతో ఇష్టంగా...



స్కూళ్లు మొదలయ్యాయి. చిరుతిళ్ల విషయంలో పిల్లల మారాం తెలియనిది కాదు. పిల్లల లంచ్ బాక్స్‌లు తల్లులకు పెద్ద సవాల్. వాళ్ళు ఇష్టపడేలా ఆహారం ఏ విధంగా చేసి పెట్టాలా అని రోజూ సతమతమవుతూనే ఉంటారు. అంతేకాదు, చిరుతిళ్ళకు అలవాటు పడి అన్నం తినడంలో నిరాసక్తత చూపిస్తుంటారు కూడానూ. తినే ఆహారం టేస్టీగా, వెరైటీగా ఉంటేనే ఇష్టపడతారు. లేదంటే తినడమే మానేస్తారు. ఇది వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందుకే పిల్లలకు సరైన ఆహారం అందించేలా... రోజుకో వెరైటీ అన్నాన్ని వారి బాక్స్‌లో సర్దితే ఇష్టంగా తింటారు.. అవి ఎలా చేయాలో చూద్దామా..

ఆలూ రైస్

కావల్సినవి పదార్థాలు : బియ్యం - రెండు కప్పులు, ఆలూ - మూడు (పెద్దవి), పచ్చిమిర్చి - నాలుగు, కొత్తిమీర - మీడియం కట్ట, ఇంగువ - అర చెంచా, ఆవాలు - అర చెంచా, జీలకర్ర - చెంచా, నెయ్యి - పావు కప్పు, ఉప్పు - రుచికి సరిపడా

మసాలా కోసం : ఎండుమిర్చి - మూడు, ధనియాలు - రెండు చెంచాలు, శెనగపప్పు - రెండు చెంచాలు, మెంతులు- అరచెంచా, నువ్వులు- అరచెంచా

తయారు చేసే విధానం : బియ్యం శుభ్రంగా కడిగి అన్నం వండుకుని పళ్లెంలోకి మార్చి చల్లారనివ్వాలి. ఆలూని ఉడికించి చల్లారాక పొట్టుతీసి ముక్కలుగా తరిగి పక్కన పెట్టుకోవాలి. చిన్న కడాయిలో ఎండుమిర్చి, ధనియాలు, సెనగపప్పును వేయించి తర్వాత మెంతులు, నువ్వులు కూడా చేర్చి వేయించి దించేయాలి. చల్లారాక మిక్సీలో మెత్తని పొడి చేసుకోవాలి. తర్వాత మందపాటి గిన్నెలో నాలుగు చెంచాల నెయ్యి వేడిచేసి ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పచ్చిమిర్చి, ఆలూ ముక్కలు వేసి సన్న మంట మీద మగ్గనివ్వాలి. కాసేపయ్యాక అందులో కొత్తిమీర తురుము, తయారు చేసి పెట్టుకున్న మసాలా పొడి వేసి మూత పెట్టాలి. ఆరేడు నిమిషాలయ్యాక ఇది కూరలా తయారవుతుంది. ఇందులో చల్లార బెట్టు కున్న అన్నం వేసి కలియ తిప్పితే ఆలూ అన్నం సిద్ధమ యినట్టే. దీన్ని రైతాతో కలిపి తింటే మరింత రుచిగా ఉంటుంది.



ఫ్రైడ్ రైస్

కావలసిన పదార్థాలు : నూనె - రెండు చెంచాలు, బియ్యం - రెండు కప్పులు, సోయా చంక్స్ (మీల్ మేకర్) - అరకప్పు, తరిగిన సోయా బీన్స్, క్యారెట్ ముక్కలు - పావు కప్పు, ఉల్లికాడలు - రెండు, ఉప్పు - రుచికి సరిపడా, గరం మసాలా - రెండు చెంచాలు, జీడిపప్పు - పదిహేను




తయారు చేసే విధానం : బియ్యాన్ని కడిగి అన్నం కాస్త పొడిపొడిగా వండుకోవాలి. సోయా చంక్స్‌ను మూడు నాలుగు నిమిషాలు కాస్త గోరు వెచ్చని నీటిలో వేసి నాననివ్వాలి. నీళ్ళు వంపేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు కడాయిలో నూనె పోసి కాస్త వేడయ్యాక ఉల్లికాడలు వేసి కొంచెం వేయించాలి. తర్వాత బీన్స్, క్యారెట్ ముక్కలు, జీడిపప్పు వేయిస్తూ కాస్త మధ్యస్తంగా మగ్గనివ్వాలి. తగినంత ఉప్పు, సోయా చంక్స్ వేసుకుని ఐదు నిమిషాలు కలుపుతూ ఉడికించుకోవాలి. తర్వాత ఉడికించి పెట్టుకున్న అన్నం వేసి మొత్తం కలిపి పైన కాస్త మసాలా చల్లి బాగా కలపాలి. వేడివేడి ఫ్రైడ్ రైస్ రెడీ.

గోంగూర అన్నం

కావల్సిన పదార్థాలు : బియ్యం - రెండు కప్పులు, గోంగూర - రెండు కట్టలు (చిన్నవి), ఉల్లిగడ్డలు - రెండు, పచ్చిమిర్చి - నాలుగు, ధనియాల పొడి - అరచెంచా, జీలకర్ర - చెంచా, ఉప్పు - తగినంత, నూనె - కొద్దిగా

తయారు చేసే విధానం : ముందుగా అన్నం వండుకొని అందులో ఉప్పు కలిపి పళ్లెంలోకి తీసుకొని చల్లారబెట్టుకోవాలి. గోంగూర ఆకులు తుంచి కడిగి.. సన్నగా తరిగి పెట్టుకోవాలి. వెడల్పాటి గిన్నెలో నూనె వేసి వేడయ్యాక జీలకర్ర, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ ముక్కలు వేయించాలి. అందులో గోంగూర వేసి మూతపెట్టాలి. గోంగూర మెత్తగా మగ్గాక అన్నం కూడా చేర్చి సన్ననిమంటపై కలపాలి. అన్నం కూడా బాగా వేడయ్యాక దింపేయాలి.



కరివేపాకు రైస్

కావలసిన పదార్థాలు : కరివేపాకు - కప్పు, బియ్యం - ఒకటిన్నర కప్పులు, కొబ్బరిపొడి - అరకప్పు, పచ్చిమిర్చి - నాలుగు, ఎండుమిర్చి- రెండు, సొంటి పొడి - అర చెంచా, జీలకర్ర, ఆవాలు- చెంచా చొప్పున, ఉల్లిగడ్డ - ఒకటి (సన్నగా తరిగి ఉంచుకోవాలి), అల్లంవెల్లుల్లి ముద్ద - చెంచా, జీడిపప్పు - పది, ఉప్పు - తగినంత, నూనె - తగినంత

తయారు చేసే విధానం : బియ్యాన్ని పొడిపొడిగా ఉండేలా అన్నం వండి పక్కన పెట్టుకోవాలి. కడాయిలో చెంచా నూనె వేసి జీడిపప్పు, కొబ్బరి తురుము, కరివేపాకును వేర్వేరుగా వేయించుకోవాలి. వెంటనే కరివేపాకును పొడిచేసి పెట్టుకోవాలి. ఇదే కడాయిలో మరికొంచెం నూనె వేసి జీలకర్ర, ఆవాలు, ఎండుమిర్చి, పచ్చి మిర్చి వేసి వేయించుకోవాలి. ఇందులో ఉల్లిగడ్డ ముక్కలు, అల్లం వెల్లుల్లి ముద్ద, సొంటి పొడి చేర్చాలి. దీనిలో అన్నం, కరివేపాకు పొడి, కొబ్బరి తురుము, జీడిపప్పు వేసి కలపాలి. అన్నం కొంచెం వేడయ్యాక తగినంత ఉప్పు చేర్చి దింపాలి. అంతే నోరూరించే కరివేపాకు ఫ్రైడ్ రైస్ తయారవుతుంది.



ఉసిరికాయ రైస్

కావల్సిన పదార్థాలు : ఉసిరికాయలు - ఏడు, కొబ్బరి తురుము - అరకప్పు, పచ్చిమిర్చి - నాలుగైదు, ఉప్పు - తగినంత, నూనె - ఒక చెంచా, శెనగపప్పు, మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర - అర చెంచా చొప్పున, పల్లీలు - అరగుప్పెడు, ఎండుమిర్చి - మూడు, ఇంగువ - కొద్దిగా, కరివేపాకు రెబ్బలు - నాలుగు, పసుపు - పావు చెంచా, అన్నం- రెండున్నర కప్పులు.

తయారు చేసే విధానం : ఉసిరికాయల్ని కడిగి గింజలు తీసేసి చిన్న చిన్న ముక్కల్లా తరగాలి. కొబ్బరి తురుము, పచ్చిమిర్చి తీసుకుని మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత కడాయిలో నూనె వేడిచేసి ఆవాలు, శెనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, ఎండుమిర్చి, పల్లీలు, ఇంగువ వేసి వేయించాలి. అందులో కరివేపాకు వేయాలి. అవి చిటపటలాడాక ముందుగా చేసి పెట్టుకున్న ఉసిరి ముక్కలు, కొబ్బరి మిశ్రమాన్ని చేర్చాలి. పచ్చివాసన పోయే వరకు సన్న మంట మీద కలుపుతూ ఉండాలి. ఇందులో అన్నం వేసి కలిపి, ఉప్పు చూసుకుని దించేస్తే సరి..



పర్సనల్ డేటా రక్షణ బిల్లుకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం

(మొదటిపేజి తరువాయి)

ఈ బిల్లు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టబడుతుదని అధికారిక వర్గాలు తెలిపాయి. బిల్లులోని నిబంధనలను ఉల్లంఘించిన ప్రతి సందర్భంలోనూ సంస్థలపై రూ. 250 కోట్ల వరకు జరిమానా విధించాలని బిల్లు ప్రతిపాదించింది. ఈ బిల్లు సంప్రదింపుల కోసం ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన చివరి డ్రాఫ్ట్‌లోని దాదాపు అన్ని నిబంధనలను కలిగి ఉంది. ప్రతిపాదిత చట్టం ప్రకారం ప్రభుత్వ సంస్థలకు ఎటువంటి మినహాయింపు ఇవ్వలేదని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. "వివాదాల విషయంలో డేటా ప్రొటెక్షన్ బోర్డ్ నిర్ణయిస్తుంది. పౌరులు సివిల్ కోర్టును ఆశ్రయించడంతో నష్ట పరిహారాన్ని క్లెయిమ్ చేసే హక్కును కలిగి ఉంటారు" అని పేర్కొన్నాయి. చట్టం అమలు చేయబడిన తరువాత వ్యక్తులు వారి డేటా సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్ గురించి వివరాలను కోరుకునే హక్కును కలిగి ఉంటారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20 నుంచి ఆగస్టు 11 వరకు జరగనున్నాయి.

ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన జి. కిషన్ రెడ్డి హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చర్చలు మరింత ఊపందుకున్నాయి. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అర్జున్ రామ్ మేఘ్వాల్, భూపేందర్ యాదవ్, కిరెన్ రిజిజుతో సహా పలువురు కేంద్ర మంత్రులు.బీజేపీ అధ్యక్షుడు జెపి నడ్డాతో సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పార్టీ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌ను కలవగా, మరో మంత్రి ఎస్‌పిఎస్ బాఘెల్ నడ్డాను కలిశారు. సమావేశాలలో ఏమి జరిగిందనే దానిపై అధికారిక సమాచారం లేదు. అయితే గత రెండు రోజులుగా ఎక్కువ మంది నాయకులు కేంద్ర నాయకులను కలిశారు.

కార్మిక కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

(మొదటిపేజి తరువాయి)

కంపెనీలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇద్దరు కార్మికులు మృతిచెందారనీ, ఆ కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోయిన పిల్లలకు కార్మిక శాఖ రూ.కోటి నష్టపరిహారం చెల్లించేలా స్థానిక మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవ చూపాలని కోరారు. కార్మికులకు భద్రత కరువై పిట్టల్లా రాలిపోతున్నా, పట్టించుకునే వారు లేక కుటుంబాలు అల్లాడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు పెంచకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో కార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందనీ, ఈ ప్రాంతాల్లో బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది కార్మికులు వలస వచ్చి పని చేస్తున్నారని తెలిపారు. వీరికి 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్ సెలవులు, బోనస్, గ్రాట్యూటీ కూడా ఇవ్వకుండా 12 గంటలు పని చేయించుకుంటున్నారని వాపోయారు. చట్ట ప్రకారం ప్రతి ఐదేండ్లకు కనీస వేతనాల చట్టాన్ని సవరించాల్సి ఉన్నా చేయడం లేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేండ్లలో 2021 జూన్‌లో ఐదు రంగాలకు కనీస వేతనం రూ.18 వేలు ఉండాలని నిర్ణయించారని, దాన్ని సైతం యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వం గెజిట్ చేయడం లేదని చెప్పారు. కనీస వేతనాల సలహా మండలి సిఫారసులను బేఖాతరు చేస్తూ, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. ఈ విషయంపై అనేక సందర్భాల్లో ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతోనే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టి, కార్మిక లోకాన్ని సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. జులై 17 తర్వాత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జాతాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు అలువాల రవికుమార్, జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రుద్రకుమార్, స్థానిక నాయకులు పరమేష్ కుమార్, చంద్రయ్య, శంకర్,వెంకటేష్, శేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నీటి మూటలే..

(మొదటిపేజి తరువాయి)

చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు జీ న్యూస్‌కు మోడీ ఇంటర్వ్యూ ఇస్తూ 'మీ కార్యాలయం ఎదుట ఎవరైనా పకోడీ షాపు తెరిచారని అనుకోండి. అది ఉపాధి కిందికి రాదా?' అని ప్రశ్నించారు. 'రోజుకు రూ.200 సంపాదించే వ్యక్తి ఏ పుస్తకంలోనూ కన్పించడు. ఏ ఖాతాలోనూ చేరడు. వాస్తవమేమంటే యువత పెద్దఎత్తున ఉపాధి పొందుతోంది' అని ఆయన చెప్పారు. ప్రధాని ఈ ఇంటర్వ్యూ ఇచ్చిన కొద్ది రోజులకే లక్నోలో నిరుద్యోగులు భారీ ప్రదర్శన నిర్వహించారు. 2017-18లో నిరుద్యోగుల సంఖ్య 45 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా గరిష్ట స్థాయికి చేరింది. ఇది ప్రభుత్వ సమాచారమే. దేశంలో నాణ్యతతో కూడిన ఉద్యోగాలు చాలా తక్కువగా ఉన్నాయని దేశ ఆర్థిక వ్యవస్థను పర్యవేక్షిస్తున్న ఓ కేంద్రం అధిపతి మహేష్ వ్యాస్ తెలిపారు. 2017 నుండి దేశంలోని వివిధ ప్రాంతాలలో నిరుద్యోగులు ఉద్యోగాల కోసం గళం విప్పుతూనే ఉన్నారు.

స్మార్ట్ సిటీలో అభివృద్ధి ఏది?


స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా 2015లో ప్రభుత్వం 100 నగరాలను ఎంపిక చేసింది. ఆయా నగరాలలో మౌలిక సదుపాయాల కల్పనే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అయితే ఉన్న నగరాలనే అభివృద్ధి చేస్తున్నారు తప్పించి కొత్త నగరాలపై దృష్టి సారించడం లేదు. ఉదాహరణకు ఢిల్లీ, పూణే, ఉదయ్‌పూర్ ఇప్పటికే నగరాలు. అయితే అవి 'స్మార్ట్' జాబితాలో లేవు. పైగా స్మార్ట్ సిటీలలో కొన్ని అభివృద్ధి ప్రాజెక్టులు నత్తనడక నడుస్తున్నాయి. కొన్ని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. స్మార్ట్ సిటీల అభివృద్ధికి నిర్దేశించుకున్న గడువును దఫదఫాలుగా పొడిగిస్తున్నారు. వచ్చే సంవత్సరం జూన్ వరకూ గడువు పెట్టుకున్నప్పటికీ కనీసం 20 నగరాలు కూడా లక్ష్యాల మేరకు అభివృద్ధి చెందే అవకాశాలు కన్పించడం లేదు. పైగా ప్రజలు కోరుకున్న రీతిలో వాటి అభివృద్ధి జరగడం లేదు. వ్యర్థాల తొలగింపు, మురికివాడలలో సౌకర్యాల కల్పన, కాలుష్య నివారణ, జీవవైవిధ్య పరిరక్షణ వంటి విషయాలలో ముందుకు అడుగులు పడడం లేదు. కాషాయ పార్టీ దృష్టిలో 'స్మార్ట్' అంటే వనరుల లభ్యత ఉన్నా లేకున్నా మతపరమైన పర్యాటకం, రియల్ ఎస్టేట్, సాంకేతిక పరిజ్ఞానం వంటి వాటిని అభివృద్ధి చేయడం. అంతేకానీ పట్టణ పేదలకు అందుబాటు ధరల్లో గృహవసతి కల్పించడం కాదు. రాబోయే పది సంవత్సరాలలో స్మార్ట్ సిటీల్లో 25 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని బీజేపీ ఎన్నికల ప్రణాళిక హామీ ఇచ్చింది. అయితే ఆ దిశగా పెద్దగా అడుగులు పడుతున్న దాఖలాలు కన్పించడం లేదు.

కాలుష్య కోరల్లో 'గంగ'

ఇరవై వేల కోట్ల రూపాయల బడ్జెట్‌తో 2014 మేలో 'నమామి గంగ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గంగానదిని కాలుష్య కోరల నుండి బయటపడేయడం దీని ఉద్దేశం. అయితే ఇప్పటికీ నదీ జలాలు కాలుష్యంతో నిండి ఉన్నాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం కన్పిస్తోంది. నది దిగువ ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నీటిలో చేరిన వ్యర్థ పదార్థాలు, బాక్టీరియా ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా పరిణమించాయి. మురుగు నీటిని శుద్ధి చేసే ప్రక్రియ వేగం పుంజుకోవడం లేదు. సెప్టిక్ ట్యాంకులు, మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేసే పని నుండి కార్మికులను దూరంగా ఉంచుతామని బీజేపీ హామీ ఇచ్చింది. అయితే ఇప్పటికీ దేశంలోని పలు ప్రాంతాలలో కార్మికుల చేతే ఆ పనులు చేయిస్తున్నారు. 2017-22 మధ్యకాలంలో ట్యాంకుల నుండి వెలువడే విషవాయువుల కారణంగా 330 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే దీనిని ప్రభుత్వం ఖండిస్తోంది. ఈ సంవత్సరం మార్చి 22, ఏప్రిల్ 26 మధ్యకాలంలో ఒక్క గుజరాత్‌లోనే ఆరుగురు చనిపోయారు. సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తూ 1993 నుండి వెయ్యి మందికి పైగా చనిపోయారని అధికారిక లెక్కలే చెబుతున్నాయి.

కాళేశ్వరం వల్లే భారీగా పంట దిగుబడి

- కాలం ఎత్తిపోయినా కాల్వల ద్వారా నీరు
- అవినీతిపై రాహుల్ మాటలు విడ్డూరం: ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు



నవ తెలంగాణ - సిద్దిపేట

"కాళేశ్వరం నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉంది. ఖర్చు పెట్టింది రూ.80 వేల కోట్లు అయితే.. లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుంది.. కాళేశ్వరం పూర్తయింది కాబట్టే భూమికి బరువైనంత పంట దిగుబడి వస్తుంది.. కాలం ఎత్తిపోయినా కాల్వల ద్వారా నీరు పారుద్ది.." అని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో బుధవారం ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో రైతులకు స్ప్రింక్లర్లు, తుంపర సేద్య పరికరాలను మంత్రి పంపిణీ చేశారు. ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు సదస్సులో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం పూర్తి చేశాం కాబట్టే భూమికి బరువైనంత పంట పండుతున్నదని చెప్పారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో కేవలం 300 స్ప్రింక్లర్ల సెట్లు పంచేదని, ఇవాళ ఒక్కరోజే 1001 మందికి స్ప్రింక్లర్లు పంపిణీ చేసుకుంటున్నామని అన్నారు. 15 వేల స్ప్రింక్లర్ల సెట్ల పంపిణీకి రూ.20 కోట్ల 18 లక్షల సబ్సిడీ ప్రభుత్వం భరించిందని, ఇది రైతుల పట్ల ప్రేమ, చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి కాల్వల ద్వారా రైతులకు నీళ్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

ఎన్నికల కోసం ఆపద మొక్కులు మొక్కే వారికి దండం పెట్టాలని, గత ప్రభుత్వాల హయాంలో దొంగరాత్రి కరెంటు వచ్చేదని, ఇవాళ సీఎం కేసీఆర్ నాయకత్వంలో 24 గంటలు నాణ్యమైన కరెంటు సరఫరా జరుగుతున్నదని అన్నారు. చుక్క చుక్క ఒడిసి పట్టి కాళేశ్వరం జలాశయాలు నింపాలని సీఎం కేసీఆర్ చెప్పారని, కాలం ఎత్తి పోయినా.. కాళేశ్వరం గేట్లు ఎత్తి రైతులకు కాల్వల ద్వారా పంట పొలాలకు నీళ్ల ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. కాళేశ్వరంతో యాసంగిలో 55 లక్షల ఎకరాల పంట పండిందని, 26 వేల కోట్ల రూపాయల ధాన్యాన్ని కొన్నామని చెప్పారు. ఎండమావులకు ఆశపడొద్దు, ధోకేబాజ్‌లకు లొంగొద్దని రైతులకు హితవు పలికారు. చేర్యాల ప్రాంత రైతులకు శుభవార్త అని, దేవాదుల నీళ్ల తెచ్చి తపాస్‌పల్లి రిజర్వాయరు నింపుతామని చెప్పారు. మల్లన్నసాగర్, రంగనాయక, కొండ పోచమ్మ, అంతగిరి, గౌరవెల్లి రిజర్వాయర్లు నింపి కాల్వల ద్వారా పంట పొలాలకు నీళ్ల అందిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లాలో 8 వేల 500 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేసినట్టు, ఈ సంవత్సరం 18000 ఎకరాలు టార్గెట్ పెట్టుకున్నట్టు.. ఆయిల్ ఫామ్ ద్వారా ఎకరాకు లక్ష రూపాయల వరకు ఆదాయం ఉన్నదని తెలిపారు. ఆయిల్ ఫామ్ ఎకరాకు 80 వేల రూపాయల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నదన్నారు.

పంట కాలాన్ని నెల ముందుకు తేవాలని, వరి బదులుగా ప్రత్యామ్నాయ పంట మార్పిడి చేయాలని, పంట మార్పిడి విధానం వల్ల పంటలు బాగా పండుతాయని, వెదజల్లే పద్ధతిన వరి సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు నాగిరెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ వైస్ చైర్మెన్ సోమిరెడ్డి, జిల్లాలోని పలు మండలాల ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మెన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సునీత, అధికారులు పాల్గొన్నారు.

మణిపూర్‌కు వామపక్షపార్టీల ఎంపీల బృందం

(మొదటిపేజి తరువాయి)

రోజుల పాటు సీపీఐ(ఎం), సీపీఐకు చెందిన ఐదుగురు ఎంపీలతో కూడిన ప్రతినిధి బృందం పర్యటించనుంది. ప్రతినిధి బృందం చురచంద్‌పూర్, ఇంఫాల్ లోయలో అన్ని జాతుల ప్రజలను కలుస్తుంది. 7న సాయంత్రం 5 గంటలకు గవర్నర్‌ను కలవనున్నది. 8న మీడియాతో సమావేశమై తమ అనుభవాలను వివరించనున్నది. ప్రతినిధి బృందంలో సీపీఐ(ఎం) పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు బికాష్ రంజన్ భట్టాచార్య, జాన్ బ్రిట్టాస్, సీపీఐ నుంచి రాజ్యసభ ఎంపీలు బినోయ్ విశ్వం, పి. సంతోష్ కుమార్, సీపీఐ నుంచి లోక్‌సభ ఎంపీ కె. సుబ్బరాయన్ ఉన్నారు.

మరో 8 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతి

(మొదటిపేజి తరువాయి)

ఉత్తర్వుల జారీ పట్ల, ఇది సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన వైద్యవిద్య విప్లవమంటూ వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అభివర్ణించారు. వైద్యకళాశాలల ఏర్పాటుతో మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ సేవలు విస్తరించాయని తెలిపారు.

నవతెలంగాణ సీజీఎం సోదరుడు ప్రసాదరావు కన్నుమూత

(మొదటిపేజి తరువాయి)

పేరున్న వ్యాపారవేత్తగా ఎదిగారు. పీఆర్ఎల్ ప్రసాద్‌గా ఆయన అందరికీ చిరపరిచితులు. ఆయన భౌతికకాయాన్ని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వై.సిద్దయ్య, జాలా అంజయ్య, నాయకులు జయరాం, పమిడి వెంకట్రావు, నగర కార్యదర్శి జి.రమేష్, పలువురు గ్రానైట్ రంగ ప్రముఖులు తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రసాదరావు సోదరుడు పి.ప్రభాకర్, కుటుంబసభ్యులను నేతలు పరామర్శించారు. గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు చెరుపల్లి సీతారాములు, ఎస్ వీరయ్య, పోతినేని సుదర్శన్, టి జ్యోతి తదితరులు సంతాపం ప్రకటించారు. నవతెలంగాణ ఇన్‌చార్జి ఎడిటర్ ఆర్ రమేశ్, బోర్డు సభ్యులు, జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, సిబ్బంది సంతాపం ప్రకటించారు.

పదవుల కోసం పాకులాడొద్దు

(మొదటిపేజి తరువాయి)

ఆక్సిజన్. ప్రజాస్వామ్యం మన భవిష్యత్తు. ప్రతి ఒక్కరూ అట్టడుగు స్థాయిలో నాయకత్వాన్ని పెంపొందించడానికి కృషి చేయాలి. ఒకరితో ఒకరు కయ్యానికి దిగొద్దు" అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విభాగాలకు 'నాయకత్వ అభివృద్ధి మిషన్'పై పార్టీ జాతీయ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచించాలని నాయకులు, కార్యకర్తలను ఆయన కోరారు. పార్టీని బలోపేతం చేయడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామనీ, మీరు బలంగా లేకపోతే ముందుకు సాగలేమని అన్నారు. పార్టీలో గొడవలు పార్టీని బలహీనపరుస్తాయని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలలో తన ఓటమి కోసం బీజేపీకి సహరించినవారికి కూడా పార్టీ విజయం సాధించాలనే కోరికతో పార్టీ టికెట్లు ఇచ్చినట్టు ఖర్గే తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్ చింతన్ శిబిర్‌లో " లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్" ప్రకటించబడిందని ఖర్గే చెప్పారు.

కొనలేం-తినలేం

(మొదటిపేజి తరువాయి)

పండించే ప్రాంతాలలో భారీ వర్షాలు, వరదల కారణంగా పంట లభ్యత బాగా తగ్గిపోయింది. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలోనూ, కొన్ని కొండ ప్రాంతాలలోనూ వర్షాల కారణంగా కూడా పంట దెబ్బతిన్నది. దీంతో సరఫరాలపై ప్రభావం పడింది. ఇటీవల తమిళనాడులో కురిసిన భారీ వర్షాలతో పంటకు బాగా నష్టం జరిగింది. దీనితో పాటు వంగ, మునగ, క్యారట్, బీట్‌రూట్, ఉల్లిగడ్డ, బంగాళదుంప దిగుబడులు కూడా పడిపోయాయి.

వానొస్తే..వాగులు దాటలేని దుస్థితి

ఆ పల్లెలతో సంబంధాలు కట్

- అత్యవసర పరిస్థితిలోనూ ఆస్పత్రికి వెళ్లలేని దైన్యం
- ఏండ్ల నుంచి అదే అవస్థ



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవులే కాదు.. పచ్చదనంతోపాటు వాగులు, వంకలకు పెట్టింది పేరు.. అడవుల నుంచి జాలువారే వర్షపునీటితో ఏర్పడిన వాగులు మరిన్ని ఉన్నాయి. వర్షాకాలం అవి ఉగ్రరూపం దాల్చి సమీప గ్రామాలను ముంచెత్తుతాయి. రోడ్డు మార్గాలు లేక.. వాగులపై వంతెనలు లేక.. ఆయా ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఏటా వాగులు దాటే క్రమంలో వరద ఉధృతిలో కొట్టుకుపోయి అనేక మంది ప్రాణం కోల్పోతున్నారు. ఏండ్ల నుంచి ఇలాంటి అవస్థలు ఉన్నా.. వంతెనల నిర్మాణాల్లో ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా మారుమూల పల్లెలకు ప్రయాణ సౌకర్యం కల్పించడంలో విఫలమవుతున్నాయి. ఏజెన్సీలో గిరిజనులు, నిరుపేదలకు వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి.. అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల సమీపంలోని వాగులపై వంతెనలు నిర్మించి రాకపోకలకు మార్గం సుగుమం చేయాలని అనేక ఏండ్ల నుంచి పాలకులకు విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించడం.. ఆ తర్వాత మర్చిపోవడం పరిపాటిగా మారుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తే.. నిత్యావసర సరుకులు, వ్యవసాయానికి పురుగుమందులు, ఇతర సామాగ్రి తీసుకెళ్లేందుకు కూడా వీలుండని దుస్థితి. వాగులపై వంతెనలే కాకుండా మారుమూల గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు.

మైదాన ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి

జిల్లాలో అటవీ ప్రాంతం అధికంగా ఉండటంతో ఏజెన్సీలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులు వివిధ పనుల నిమిత్తం మైదాన ప్రాంతాలకు వస్తుంటారు. కానీ చాలా గ్రామాల సమీపంలో వాగులు, వంకలు ఉండటం.. వర్షాకాలంలో ఉగ్రరూపం దాల్చి దాటనీయని పరిస్థితి ఉంటుంది. సకాలంలో నిత్యావసరాలు, మందులు, ఇతర వస్తువులు లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాగులపై వంతెనలు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామాలు ఆదిలాబాద్ జిల్లాలోనే 133 వరకు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పెద్దవాగు, కడెం, ప్రాణహిత, పెన్‌గంగా తదితర నదుల పరివాహక ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది.

పీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్ రూమ్స్

అంబులెన్సులు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండటంతో గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అవరోధాలు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితిని అధిగమించడానికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. వివిధ పీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్‌రూంలు ఏర్పాటు చేసి గర్భిణులను ప్రసవం కోసం ముందస్తుగానే వీటిలోకి చేరుస్తున్నారు.



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం సస్మీర్ వద్ద వాగుపై వంతెన లేదు. వర్షం కారణంగా వరదొస్తే సోమిని, సమీర్, మొగవెల్లి, నాగేపల్లి, ఇప్పలగూడ, పాత సోమిని తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసర పరిస్థితిలోనూ బయటకు వెళ్లలేని పరిస్థితి. కొన్ని సమయాల్లో ప్రమాదకరంగా వాగు దాటుతూ ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు.

ఉట్నూర్ మండలం నర్సాపూర్(జే) గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై వంతెన లేకపోవడంతో ఎడ్లబండిపై ఇలా వాగు దాటుతున్నారు. వర్షాకాలంలో వాగు ఉధృతి పెరగడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా పోతుంది.

చింతలమానేపల్లి మండలం బాబాసాగర్-నాయకపు గూడకు వెళ్లే వాగుపై నిర్మిస్తున్న వంతెన అసంపూర్తిగా ఉంది. దీంతో వర్షాకాలంలో అటువైపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఇదే మండలంలోని దింద, కేతిని వాగుపై లోలెవల్ వంతెన ఉంది. కానీ వర్షాకాలంలో దాటే వీలుండదు.



కెరమెరి మండలం అనార్‌పల్లి సమీపంలోని వాగుపై వంతెన లేకపోవడంతో అనార్‌పల్లి, కరంజివాడ, పెద్ద కరంజి, జన్కాపూర్, బోరిలాల్‌గూడ, లక్మపూర్, అందుగూడ, ఇంద్రనగర్, శంకర్‌లొద్ది, కోట, గోండుగూడ తదితర గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి గ్రామాలు అనేకం ఉన్నాయి. ఏండ తరబడి ఈ అవస్థ ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు.

ఆటలు

ఎందుకీ వివక్ష..?

శాఫ్ ఛాంపియన్‌షిప్‌లో ఒక్కో ఆటగానికి దక్కింది రూ.2లక్షలే





గత మూడేళ్లుగా నిలకడగా రాణిస్తూ.. శాఫ్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత ఫుట్‌బాల్ జట్టులో ఒక్కో ఆటగానికి దక్కింది అక్షరాలా రూ.2లక్షల ప్రైజ్ మనీ మాత్రమే. బెంగళూరులోని శ్రీ కంఠీవర స్టేడియంలో భారత్-కువైట్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ తర్వాత విజేత నెగ్గిన భారత జట్టుకు 50వేల డాలర్లు(భారత కరెన్సీలో రూ.42లక్షలు) ప్రైజ్ మనీ చెక్కును అందించారు. ఈ మొత్తం జట్టులో ఉన్న మొత్తం ఆటగాళ్లు ఇతర సిబ్బందికి మాత్రమే. భారత్-లెబనాన్ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు సుమారు 20వేల మంది ప్రేక్షకులు హాజరుకాగా.. ఫైనల్‌కు దాదాపు 30వేల మంది హాజరయ్యారు. ఇంత ప్రేక్షకాదరణ ఉన్న ఫుట్‌బాల్‌కు ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీలో ఎందుకంత వివక్ష చూపుతున్నారో పాలకులకే ఎరుక. ఫిఫా ర్యాంకింగ్స్‌లోనూ భారత ఫుట్‌బాల్ జట్టు 100కు చేరుకోవడమంటే గొప్ప విశేషమే. ఐపిఎల్ ఒక సీజన్‌కు ఓ దేశీయ ఆటగానికి ఇచ్చే కనీస ధర రూ.20 లక్షలు. ఈ ఏడాది ఐపిఎల్‌లో ఓ సీజన్ మ్యాచ్ ఆడేందుకు ఓ విదేశీ ఆటగానికి రూ.18.5కోట్లు, దేశీయ ఆటగానికి రూ.8.25కోట్లు ముట్టజెప్పారు. వారేమైనా అద్భుతం చేశారా అంటే అదీ లేదు. కోట్లు కుమ్మరించి కొనుగోలు చేసిన ఆటగాళ్లను ఓ దశలో ఫ్రాంచైజీలు బెంచ్‌కే పరిమితం చేసిన సందర్భాలూ ఉన్నాయి. మన పాలకులకు క్రికెట్ పట్ల ఉన్న ప్రేమ ఇతర క్రీడల పట్ల అస్సలు ఉండడం లేదు. కాసులు కురిపించే ఆటలనే ప్రభుత్వాలూ ప్రోత్సహిస్తున్నాయి.

ఫుట్‌బాల్‌పై ఎందుకీ వివక్ష..

ఫుట్‌బాల్‌ను ప్రపంచవ్యాప్తంగా 200కు పైగా దేశాల్లో ప్రజాదరణ ఉంటే.. ఆసియా ఖండం దాటితే క్రికెట్‌కు ఉన్న ఆదరణ అంతంత మాత్రమే. ఇతర దేశాల్లోగానీ, ఖండాల్లో గానీ ఈ క్రీడను చూసేవాళ్లుగానీ, ఆడేవాళ్లుగానీ అస్సలుండరు. అంతర్జాతీయంగా ఇటీవల కాలంలో హాకీ, కబడ్డీతోపాటు వ్యక్తిగత విభాగాల్లో మన క్రీడాకారులు అద్భుత ప్రదర్శనలతో అదరగొడుతున్నారు. వీరిని ప్రోత్సహించేందుకు ముందుకు రాని ప్రభుత్వాలు, పాలకులు.. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించారంటే చాలు కోట్లకు కోట్లు నజరానాలు ప్రకటించి ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారు. రాబోయే రోజుల్లోనైనా మార్పు రావాలని కోరుకుందాం..!

నార్త్‌జోన్ 198ఆలౌట్

సౌత్‌జోన్‌తో దులీప్ ట్రోఫీ

బెంగళూరు: దులీప్‌ట్రోఫీ సెమీఫైనల్లో సౌత్ జోన్ బౌలర్లు సత్తాచాటాడు. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం నుంచి ప్రారంభమైన దులీప్‌ట్రోఫీ సెమీస్‌లో సౌత్‌జోన్ బౌలర్ల దెబ్బకు నార్త్‌జోన్ జట్టు 198పరుగులకే ఆలౌటైంది. కవిరప్ప(5/28), శశికాంత్(2/52) బౌలింగ్‌లో మెరిసారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు ధృవ్ షోరే(11), ప్రశాంత్ చోప్రా(5), అంకిత్ కల్సి(2) నిరాశపరిచారు. ఆ తర్వాత ప్రభ్‌సిమ్రన్ సింగ్(49), అంకిత్ కుమార్(33), నిషాంత్(27) బ్యాటింగ్‌లో రాణించారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ హర్షిత్ రాణా(31), వైభవ్ అరోరా(23) ఫర్వాలేదనిపించారు. దీంతో నార్త్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 58.3ఓవర్లలో 198పరుగులకు కుప్పకూలింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 63పరుగులు చేసింది. బల్జీత్ సింగ్, హర్షిత్ రాణాకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆలూరు కప్పా క్రికెట్‌గ్రౌండ్‌లో సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో వెస్ట్‌జోన్ జట్టు బ్యాటర్స్ రాణించారు. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 216పరుగులు చేసింది. ఓపెనర్ పృథ్వీ షా(26)కి తోడు పుజారా(28), అతిత్ సేఠ్(74), ధర్మేంద్రసింగ్(39) బ్యాటింగ్‌లో రాణించారు. శివమ్ మావికి నాలుగు, ఆవేశ్‌ఖాన్, యష్ ఠాకూర్, సౌరభ్ కుమార్, సరంశ్ జైన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

నేటినుంచి యాషెస్ సిరీస్ మూడోటెస్ట్

- వోక్స్, వుడ్‌కు చోటు
- బెంచ్‌కే పరిమితం కానున్న అండర్సన్, టంగ్



లీడ్స్: యాషెస్ సిరీస్‌లో మూడో టెస్టు ఆడే జట్టును ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్‌బోర్డు(ఇసిబి) బుధవారం ప్రకటించింది. ఇంగ్లండ్ లెజెండరీ పేసర్ అండర్సన్‌తోపాటు టంగ్‌ను బెంచ్‌కే పరిమితం చేసి వీరి స్థానంలో వోక్స్, వుడ్‌లకు చోటు కల్పించింది. ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో 0-2తో వెనుకబడ్డ ఇంగ్లండ్ జట్టు మూడో టెస్టు ఆడే జట్టులో మార్క్ వుడ్, క్రిస్ వోక్స్‌ను తీసుకుంది. వీరిద్దరి కోసం జేమ్స్ ఆండర్సన్, జోష్ టంగ్‌ను పక్కన పెట్టింది. టంగ్ చివరి టెస్టులో బాగానే రాణించిన సంగతి తెలిసిందే.

మూడు కీలక వికెట్లు తీసుకున్న అతను సత్తా చాటాడు. కానీ క్రిస్ వోక్స్ కనుక జట్టులో చేరితే బ్యాటింగ్‌లో కూడా కొంత బలం పెరిగే అవకాశం ఉంది. అందుకే ఇంగ్లండ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే తొలి టెస్టు ఆడిన తర్వాత చేతి వేళ్ల గాయంతో రెండో టెస్టులో ఆడని మొయిన్ అలీ కూడా రీ ఎంట్రీ ఇస్తున్నాడు. దీంతో ఇంగ్లండ్ స్పిన్ బౌలింగ్ విభాగం మరింత బలోపేతం ఖాయం. మరోవైపు ఆసీస్ స్టార్ స్టీవ్ స్మిత్‌కు ఇది వందో టెస్టు కూడా కావడం గమనార్హం. తన కెరీర్‌లో కీలకమైన ఈ మ్యాచ్‌ను విజయంతో ముగించాలని స్మిత్ భావిస్తున్నాడు. రెండో టెస్టులో గాయపడిన స్పిన్నర్ నాథన్ లియాన్ దూరం కావడంతో అతని స్థానంలో యువ స్పిన్నర్ టాడ్ మర్ఫీ స్పిన్ బాధ్యతలు మోసేందుకు సిద్ధమయ్యాడు.

ఇంగ్లండ్ జట్టు: జాక్ క్రాలీ, బెన్ డకెట్, హ్యారీ బ్రూక్, జో రూట్, జానీ బెయిర్‌స్టో, బెన్ స్టోక్స్(కెప్టెన్), మొయీన్ అలీ, క్రిస్ వోక్స్, ఓలీ రాబిన్సన్, స్టువర్ట్ బ్రాడ్, మార్క్ వుడ్.



కళ్యాణ్ రామ్

నందమూరి కళ్యాణ్ రామ్ టాలెంట్‌ను ప్రోత్సహించడానికి ఎప్పుడూ ముందుంటారు. యువ దర్శకులు, వైవిధ్యమైన కథలతో ఆయన చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలు ఇచ్చాయి. లేటెస్ట్‌గా ఆయన ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో తన 21వ చిత్రానికి సైన్ చేశారు. కళ్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాని అధికారికంగా అనౌన్స్ చేశారు. 'అలా ఎలా' అనే ఫీల్ గుడ్ రొమ్-కామ్‌ని తెరకెక్కించిన అశోక క్రియేషన్స్ ఈ భారీ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తోంది. కళ్యాణ్‌రామ్ నందమూరి తారక రామారావు ఆర్ట్స్ (ఎన్టీఆర్ ఆర్ట్స్) బ్యానర్‌తో ఈ బ్యానర్ కలిసి పని చేస్తోంది. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం:2గా అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్

కళ్యాణ్ రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సినిమా ఇది. ఈ చిత్రం కోసం ప్రముఖ తారాగణం, ప్రతిభావంతులైన సాంకేతిక బృందం పని చేస్తోంది. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ కోసం రిలీజ్ చేసిన పోస్టర్‌లో కళ్యాణ్ రామ్ తన పంచ్ పవర్‌ను చూపించే మాస్-అపీలింగ్ ఇదొక యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని తెలుస్తోంది. అంతేకాకుండా సినిమా గురించి మరింత తెలుసుకోవాలనే ఆసక్తిని కలిగిస్తోంది. కళ్యాణ్ రామ్‌ని మునుపెన్నడూ చూడని యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో చూపించడానికి ప్రదీప్ చిలుకూరి ఆకట్టుకునే కథను రాశారు. 'డెవిల్' తర్వాత కళ్యాణ్ రామ్ చేస్తున్న ప్రాజెక్ట్ ఇదే. హరికృష్ణ భండారి ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే రైటర్.



నయా సినిమా పోస్టర్

శ్రీసింహా కోడూరి హీరోగా నటించిన సినిమా 'భాగ్ సాలే'. నేహా సోలంకి నాయికగా, ప్రణీత్ బ్రాహ్మండపల్లి దర్శకత్వంలో క్రైమ్ కామెడీగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ చిత్రాన్ని వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ నిర్మాతగా బిగ్ బెన్, సినీ వ్యాలీ మూవీస్ అసోసియేషన్‌తో అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మించారు. ఈనెల 7న ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ క్రమంలో హీరో శ్రీసింహా మీడియాతో ముచ్చటించారు.

'మేం ఏదో సందేశాన్ని ఇవ్వాలని ఈ సినిమాను చేయలేదు. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకుడిని నవ్వించాలని చేశాం. ఇప్పటికే కొన్ని చోట్ల షోలు వేశాం. అలాగే కాలేజ్ స్టూడెంట్స్‌కి, మా ఫ్యామిలీ మెంబర్లకు కూడా చూపించాం. వచ్చిన అందరూ హాయిగా నవ్వుకుని బయటకు వచ్చారు. సినిమా బాగుందని చెప్పారు. దాంతో మాకు ఇంకా నమ్మకం పెరిగింది. అందరినీ ఎంటర్టైన్ చేసేలా సినిమా ఉంటుందని, మేం

హాయిగా నవ్వుకుంటారు..

ఊహించే జరిగింది. దర్శకుడు ప్రణీత్ నాకు ఈ కథను ఎప్పుడో చెప్పాడు. కానీ నాకున్న కమిట్‌మెంట్స్ వల్లే ఆలస్యం అయింది. ప్రణీత్ ఎప్పుడూ బెటర్‌మెంట్ కోసం ట్రై చేస్తుంటాడు. సెట్స్‌కు వెళ్లే ముందే పదిహేను వర్షెన్స్ రాసుకున్నారు. ప్రతీ సీన్, ప్రతీ కారెక్టర్‌లో బెటర్‌మెంట్ చూస్తుంటాడు. అదే ఆయన బలం. నా సినిమాల్లో కామెడీ ఉంటుంది. కానీ ఈ చిత్రంలో హీరో పాత్రలోనే కామెడీ ఉంటుంది. కామికల్‌గా క్యారెక్టర్ ఉంటుంది. క్రైమ్ కామెడీ జోనర్‌లో తీసినా కూడా కమర్షియల్ అంశాలతో తెరకెక్కించాం. నేను మా అన్నతో కలిసి పని చేయాలని అనుకోలేదు. నా సినిమా దర్శకులే కాలభైరవను ఎంచుకుంటారు. ఈ మూవీకి ఫస్ట్ సెలెక్ట్ అయింది కాల భైరవ అన్ననే. తరువాతే నేను సెలెక్ట్ అయ్యాను. కాల భైరవ అందించిన ఆర్‌ఆర్ వల్ల సినిమా మరో స్థాయికి వెళ్లింది. ఈ సినిమాకు సంగీతమే మెయిన్ పిల్లర్. టీజర్, ట్రైలర్ నచ్చితే సినిమాల మీద జనాలకు ఆసక్తి కలుగుతుంది. ఇంత వరకు నా ఏ సినిమాకు రాని బజ్ ఈ చిత్రానికి వచ్చింది. తెలంగాణ, కేసీఆర్ డైలాగ్ బాగా క్లిక్ అయింది. ఇప్పుడు వర్డ్ ఆఫ్ మౌత్ వల్ల సినిమాలు బాగా ఆడుతున్నాయి. మా నిర్మాతలకు ఈ సినిమా, కథ పట్ల ఎక్కువ ఆసక్తి ఉండటంతో వాళ్లు మాకు ఎంతో సపోర్ట్‌గా నిలిచారు. ఈ సినిమా గురించి ఒక్కమాటలో చెప్పాలంటే అందర్నీ బాగా ఎంటర్‌టైన్ చేసే సినిమా' అని అన్నారు.



స్క్రిప్ట్ విషయంలో డౌట్ వస్తే రాజమౌళి సలహాలు తీసు కుంటాను. ఆయనతో సినిమా చేయాలని అందరికీ కల ఉంటుంది. అయితే చనువు ఉంది కదా అని ఛాన్స్ అడగలేను. ముందు నేను చాలా నేర్చుకోవాలి. ఆ తరువాత ఆయనకు ఓకే అనుకుంటే తీసుకుంటారు.

- శ్రీ సింహా కొడూరి

నవచిత్రం

డెవిల్ విశ్వరూపం

కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించిన మరో వైవిధ్యమైన చిత్రం 'డెవిల్'. 'బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ట్యాగ్ లైన్. తాజాగా చిత్ర నిర్మాతలు కళ్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు.



కళ్యాణ్ రామ్

'డెవిల్' అనే క్రూరమైన, తెలివైన సీక్రెట్ ఏజెంట్‌ను ఈ గ్లింప్స్ ద్వారా ఆడియెన్స్‌కు పరిచయం చేశారు. 'స్వాతంత్ర్యానికి పూర్వం 'డెవిల్' అనే బ్రిటీష్ ఏజెంట్ ఉండేవాడు' అని గ్లింప్స్‌లో రాగానే కళ్యాణ్ రామ్ కనిపిస్తూ మంచి ఏజెంట్ ఎలా ఉండాలనే డైలాగ్‌ను వినిపించారు. ఈ గ్లింప్స్‌లో బ్యూటీఫుల్ హీరోయిన్ సంయుక్తా మీనన్ కూడా కనిపించింది. డెవిల్ చేసే యాక్షన్, రొమాన్స్, రహస్యాన్ని ఛేదించటానికి తను వెళ్లే మార్గం మన అంచనాలను పెంచుతాయి అని చిత్ర బృందం తెలిపింది. అభిషేక్ పిక్చర్స్ దర్శకత్వ పర్యవేక్షణలో దేవాన్ష్ నామా సమర్పకుడిగా..అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవీన్ మేడారం దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం, కన్నడ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు.

లాంగ్ బ్రేక్

మయోసైటిస్ వ్యాధితో బాధపడుతున్న నాయిక సమంత పూర్తి ఆరోగ్యం కోసం ఏడాది పాటు సినిమాల నుంచి లాంగ్ బ్రేక్ తీసుకుంటున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఆమె ప్రస్తుతం నటిస్తున్న 'సిటాడెల్', 'ఖుషీ'.. దాదాపు పూర్తి కావడంతో సమంత తన ఆరోగ్యంపై పూర్తి దృష్టి పెట్టాలని డిసైడ్ అయ్యారు.



సమంత

100 అంతర్జాతీయ అవార్డులు



ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాల్లోని ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై 'బలగం' చిత్రం వంద అంతర్జాతీయ అవార్డులను సొంతం చేసుకుని అరుదైన ఘనత సాధించింది.

వేణు ఎల్దండి దర్శకత్వంలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా అటు ప్రేక్షకుల అభినంద నలు, ఇటు విమర్శకుల ప్రసంశలూ సొంతం చేసుకుంది.

రంగబలి.. మంచి సినిమా

నాగశౌర్య, నూతన దర్శకుడు పవన్ బాసంశెట్టి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'రంగబలి'. ఎస్ఎల్‌వి సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో యుక్తి తరేజ కథానాయికగా నటించారు. ఈనెల 7న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో హీరో నాగశౌర్య మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

రంగబలి ఎలాంటి సినిమా ?

- మన ఊర్లో మనం తోపు అని అందరికీ తెలుసు. సొంత ఊరు అనే ఫీలింగే వేరు. ఈ సినిమా చూస్తున్నపుడు మళ్ళీ మన రూట్స్‌ని టచ్ చేసి వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది. మాస్ కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా ఇది.

ఫస్టకాపీ తర్వాత సినిమాపై ఎలాంటి నమ్మకం కలిగింది?

- సినిమా చూసిన తర్వాత వచ్చిన నమ్మకంతోనే ప్రమోషన్స్ స్టార్ట్ చేశా. ప్రేక్షకులకు ఈ సినిమా గురించి ఇంత నమ్మకంగా చెప్పగలుగుతున్నా. 'రంగబలి' చాలా మంచి సినిమా.

నూతన దర్శకుడు పవన్‌తో వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?

- నటుడికి దర్శకుడు స్పేస్ ఇవ్వాలి. ఆ స్పేస్ పవన్ ఇచ్చాడు. ఇది చాలా మంచి సినిమా. ఏ విషయంలో కూడా ఒత్తిడి తీసుకొవద్దని, ఏ సాయం కావాలన్నా చేస్తానని పవన్‌కి ముందే చెప్పాను. తను చెప్పింది చెప్పినట్లుగాన తీశాడు. నాకు నా సినిమాల విషయంలో అనుభవం ఉంది. ఎక్కడ కరెక్ట్‌గా జరుగుతుందో చెప్పలేను కానీ ఎక్కడ తప్పు జరుగుతుందో అర్థమైపోతుంది. అనుభవాన్ని, పవన్ విజన్‌ని జోడించి అనుకున్నట్లుగా చేయగలిగాం.

సినిమాలోని ప్రధాన ఆకర్షణలు ఏమిటి?

- పవన్ సి హెచ్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చాడు. పాటలు, ఆర్ఆర్ రెండూ అద్భుతంగా ఉంటాయి. థియేటర్‌లో చాలా ఎంజాయ్ చేస్తారు. అలాగే నాయిక యుక్తి తరేజ చాలా మంచి యాక్టర్ అండ్ డ్యాన్సర్. ఇందులో చాలా చక్కగా నటించింది. తను టాలీవుడ్‌లో లీడింగ్ హీరోయిన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. సినిమాటోగ్రఫీ, ఆర్ట్ డైరెక్షన్ అలాగే మా నిర్మాత రాజీపడని తనం.. ఇవన్ని మా సినిమాకి ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయి.

నయా ప్రాజెక్ట్స్ గురించి?

- 24వ సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యింది. ఇంకా టైటిల్ పెట్టలేదు. నేను వచ్చిందే ప్రేక్షకులని మెప్పించడానికి. అలాగే సినిమా అంటే పిచ్చి ప్యాషన్‌తో సినిమాలు నిర్మిస్తున్నాం తప్పితే డబ్బులు సంపాదించుకోవాలని కాదు. మాకు సినిమా అంటే పిచ్చి ఇష్టం. మాకు ఇది తప్పితే వేరేది తెలీదు.



నాగశౌర్య

మన సమస్యల్లో నుంచి పుట్టిన కథ

జగపతిబాబు ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'రుద్రంగి'. అజయ్ సామ్రాట్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మమత మోహన్ దాస్, విమల రామన్, గానవి లక్ష్మణ్ నటించారు.

ఈనెల 7న ఈ సినిమా థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు అజయ్ సామ్రాట్ మీడియాతో మాట్లాడుతూ, 'నా బాల్యంలో విన్న కథలు, చూసిన పరిస్థితులు, చదివిన చరిత్ర నుంచి ఈ కథ రాసుకున్నాను. తెలంగాణ నేపథ్యంలో ఉంటుంది. ఇందులో చూపించిన సమస్యలు ఎక్కడ ఉంటే, అక్కడి నుంచి ఈ కథను తీసుకున్నట్టే అవుతుంది. అలాగే ఆ సమస్యలు ఎక్కడ వచ్చినా ఇలాంటి పోరాటాలే జరుగుతాయి. దొరల అణిచివేతల మీద ఇది వరకే చాలా సినిమాలు వచ్చాయి. కానీ ఇది పూర్తి భిన్నంగా రాబోతోంది. ఎమోషనల్ ఫ్యామిలీ, సోషల్ డ్రామాగా తీశాను. పెట్టిన ఖర్చుకంటే విజువల్స్ అద్భుతంగా వచ్చాయి. కారెక్టర్ మూడ్, లైటింగ్, డైలాగ్ మూడ్, టోన్ మూడ్ ఇలా ప్రతీ ఒక్క చిన్న విషయంలో జాగ్రత్తలు తీసుకున్నాను. జగపతి బాబుకి కథ చెబితే, బాగుందని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఈ సినిమాకు చాలా కష్టపడ్డారు. ఆయన పాత్రలో ఎక్కువగా లీనమయ్యారు. రోజూ పన్నెండు గంటలకు షూటింగ్ రమ్మంటే.. ఉదయం ఎనిమిది గంటలకే వచ్చి సెట్‌లో ఉండేవారు. ఆయన నన్ను ఎక్కువగా నమ్మారు. నిర్మాత రసమయికి సినిమా తీయాలనే తపన ఎక్కువగా ఉంటుంది. నిర్మాతగా ఆయన ఏం చేయగలడో అన్నీ చేశారు. 'బాహుబలి, రాజన్న'కు డైలాగ్ రైటర్‌గా పని చేశాను. రాజమౌళితో నాకు ప్రొఫెషనల్‌గానే పరిచయం ఉంది. నా దగ్గర ఇంకా కథలున్నాయి. ఈ సినిమా తరువాత వాటి గురించి చెబుతాను. మైత్రీ సంస్థ ద్వారా ఈ సినిమా విడుదల అవుతోంది' అని తెలిపారు.



అజయ్ సామ్రాట్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అవాంఛనీయ ట్రోలింగ్స్ ఆగేదెప్పుడు!



ఐ.వి. రమణారావు

తెలుగునాట ఈనాటి సంక్షుభిత సమయంలో ఇద్దరు ప్రముఖ స్వతంత్ర జర్నలిస్టులు చాలా భిన్నమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. సహజంగానే భిన్న స్పందనలు కూడా వెలువడుతున్నాయి. వీరిలో ఒకరు యువ మహిళా యూ-ట్యూబ్ ప్రజెంటర్ తులసి చందు, మరొకరు కాకలు తీరిన అనుభవశాలి, రచయిత, విశ్లేషకులు, మాజీ కౌన్సిల్ సభ్యులు నాగేశ్వర్. అనతి కాలంలోనే తులసిచందు ఎక్కువ మంది ప్రజలను తన వీడియోలతో చేరుకున్నారు. ఆమె అభిప్రాయాలను సహించలేని వాళ్ళు ఆమెను పెద్ద ఎత్తున "ట్రోల్" చేయసాగారు. ఆమెను కించపరుస్తూ, వ్యక్తిగతంగా అవమానిస్తూ, "నిన్ను, నీ కుటుంబాన్ని చంపేస్తామని" బెదిరిస్తూ, బూతులతో, జుగుప్సాకరంగా సోషల్ మీడియాలో దాడులు చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు నడ్డా తమ పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆయా రంగాల ప్రముఖులను కలుస్తూ, హైదరాబాద్‌లో నాగేశ్వర్ ఇంటికి వెళ్ళి మాట్లాడి వచ్చారు. నాలుగు దశాబ్దాలకు పైబడి మధ్య నుండి ఎడమవైపు (లెఫ్ట్ ఆఫ్ ది సెంటర్) నిలబడి విశ్లేషణలు అందిస్తాడనే పేరున్న వ్యక్తి ఇంటికి ఈ కుడివైపు పార్టీ అధ్యక్షుడు వెళ్ళడంతో పెద్ద దుమారమే లేచింది. కొంత మంద్రస్థాయిలోనైనా సరే నాగేశ్వర్‌ను కూడా ఇంతకుముందు ఆయనను అభిమానించినవారే ట్రోల్ చేయసాగారు.

సోషల్ మీడియాలో ట్రోల్స్ సహజమే కదా అంటున్నారు చాలామంది. నిజానికి ఇది సహజం కాదు. సహజం చేయబడ్డాయి. "నియంత్రణ కష్టమైన ఈ రంగంలో వైరి వర్గాల ఖండన మండనలు ఇలా వెర్రితలలు వేస్తుంటే మనలాంటి సామాన్యులేం చేయగలరు? ప్రభుత్వాలు మాత్రమే చేయగలవు" అని కూడా కొందరు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. కానీ ఈ వాదన కూడా బలహీనమైనదే. సోషల్ మీడియా ట్రోల్స్ విమర్శ - ప్రతివిమర్శ స్థాయి దాటి, విడివిడి వ్యక్తుల ఆగ్రహావేశ ప్రకటనల స్థాయిని మించి, నేడు ఒక వ్యవస్థీకృత నేరమైంది. దీని నుంచి ఎవరినైనా ఎలా రక్షించగలం అనడం అమాయకమైన ప్రశ్న అవుతుంది. భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు సరిగ్గా సంరక్షింపబడితే చాలు ప్రజలకు ఈ నేరాల నుంచి కచ్చితంగా రక్షణ దొరుకుతుంది. ఆ పని చేయాల్సిన సంస్థలు ఆ పని చేయనప్పుడు, ఈ నేరమయమైన మూకల నుంచి తమను తాము తమ చైతన్యంలో కూడదీసుకోడమే ప్రజల ముందున్న ఏకైక మార్గం.

లౌకికవాద భావజాలానికి వయస్సు మీద పడుతోన్న ఈ రోజుల్లో, తులసిచందు ఓ యువగళం. అందునా ఓ మహిళ హిందూత్వ భావజాలం ఉధృతంగా నేటి యువతరాన్ని ఆకర్షిస్తున్న సమయాన, దానిని ప్రశ్నిస్తూ నుంచున్న ధిక్కార స్వరం తులసిచందు, నేరమయ మూకలు రంగంలోకి దూకాయి. తమ శత్రువును అవి బాగానే గుర్తుపడతాయి. ఆమెను "నువ్వు అసలు హిందువే కాదు" పొమ్మన్నారు. నీ పేరులో మాత్రమే "తులసి" ఉందని ఆవేశపడ్డారు. కానీ ఈ నేరమయ మూకలు ఏం సాధించదలుచుకున్నాయో అర్థం చేసుకోవాలి. మొదటగా తులసిచందు పట్ల గౌరవాన్ని పోగొట్టాలి. ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేయాలి. తద్వారా ఆమె ఆమె వృత్తిని కొనసాగించడంలో ఎక్కువ దూరం వెళ్ళకుండా చేయాలి. ఆమెను స్వీయ రక్షణాత్మక వలయంలో పడవేయాలి. ఆమె తనేంటో తాను నిరూపించుకునే పనిలో పడితే అది వారి మెదటి విజయం. ఆమె భావ స్వేచ్ఛను నియంత్రించడమే వారి లక్ష్యం అంతటితో ఆగకుండా ఆమెకు భయాన్ని పరిచయం చేయాలి. ఎందుకొచ్చిన పీడ అని ఆమె వదిలేయాలి, స్వాతి చతుర్వేది " అయామ్ ఎ ట్రోల్ " చదివిన వారికి ఈ విషయం బాగానే అర్థమవుతుంది. సబ్రినా సిద్దీఖీ మోడీని పత్రికా విలేకర్ల సమావేశంలో భారత దేశంలో మానవహక్కుల గురించి, మైనారిటీల రక్షణ గురించి అడిగిన పాపానికి ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కొంటోంది.

రెండు అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు చేష్టలుడిగి చూస్తుండి పోయాయి. తులసిచందు పోలీస్ స్టేషన్‌లో ఇందుగురించి కేసు నమోదు చేశారు.



ఇలా చేయాల్సి రావడం రెండవసారి. మొదటిసారి సాక్షాత్తూ తెలంగాణ మంత్రి కేటీఆర్ చొరవతో నమోదైన కేసు. అది ఎక్కడా ముందుకు పడలేదు. తాడ్వాయి కుట్ర కేసులో పేర్లు దొరికాయని ఊపా కేసు పెట్టిన పోలీసులకు తులసిచందును ఎవరు వేధిస్తున్నారో పట్టుకోవడం అంత కష్టమా? కనీసం విచారణ కూడా చేయకుండా వదిలివేస్తున్నారు. కాబట్టే ఈ మూకలు మరింతగా పేట్రేగిపోతున్నాయి. ఇది ఇలా కొనసాగితే భౌతిక దాడులకు కూడా దిగుతారు. గౌరీలంకేష్, ధబోల్కర్, ఇంతకు ముందే ఇలాగే బలైపోయారు.

ఇక నాగేశ్వర్ విషయానికి వస్తే, రాజకీయ విశ్లేషకుడిగా అనేక మీడియా ఛానళ్ళ ద్వారా పలు విషయాలపై తన అభిప్రాయాలను ప్రజలతో పంచుకున్నారు. పదునైన విశ్లేషణ, గణాంకాల సాక్ష్యం, వాదనలో వేగం, ప్రజా ప్రయోజనాల కోణం ఆయనను ఓ విశిష్ట స్థానంలో ఉంచాయి. ప్రధాన స్రవంతి మీడియాలో ఒక్కోసారి ఒంటరి పోరాటం చేస్తున్నారా అనిపించేంతగా ఆయన విశ్లేషణలు సాగేవి. ఆయన హఠాత్తుగా బీజేపీకి కలవాల్సిన ప్రముఖుడిగా ఎలా కనపడ్డారు? అదే చిత్రమైన విషయం వైరి పక్షాన్ని తగ్గించుకునే పనిలో ఎవరి వ్యూహాలు వారికి ఉంటాయి. దాడి చేసి, భయపెట్టి, నిర్మూలించి తగ్గించుకోవచ్చు. పొగిడి, తటస్థంగా మార్చి, వీలైతే కలిపేసుకొని తగ్గించుకోవచ్చు. నాగేశ్వర్ ఈ వలలో పడ్డారని నేనారోపించడం లేదు. బీజేపీ నాయకునికి నాగేశ్వర్‌తో కలయికలో ఏదో ప్రయోజనం కన్పించి ఉండాలి. సోషల్ మీడియాలో తమవాళ్ళు వేధించిన మనిషి నేడు ప్రముఖునిగా కన్పడటం పాప ప్రాయశ్చిత్తంకోసమని భావించలేం కదా!

తులసిచందు తనకు రాజకీయాలు లేవన్నా, నాగేశ్వర్ తాను ఎడమా కాదు, కుడీ కాదు, తాను ఎప్పుడూ నేరుగానే ఉంటానని చెప్పినా ప్రజలు అంగీకరిస్తారని భావించలేం. తులసిచందు తనకు రాజకీయాలు లేవని చెప్పడం కావచ్చు, తన వృత్తిలో భాగంగానైనా సరే ఆమె ఎంచుకుంటున్న విషయాలు రాజకీయపరమైనవి. వాటిలో విశాల ప్రజా బాహుళ్య ప్రయోజనాల కోణం ఉంటోంది. మోసం చేస్తున్న వారిని నిలదీయడం ఉంటోంది. తనకు రాజకీయాలు లేవనడం కన్నా, ప్రజల వైపున చేసే రాజకీయాలు తనకున్నాయని విస్పష్టంగా ప్రకటించడమే మేలు. నాగేశ్వర్ తాను ఎడమా కాదు, కుడీ కాదు నేరుగా ఉంటానని అనడం కూడా ఇంచుమించు ఇలాంటిదే - "నేరుగా ఉండే విషయాలనే వామపక్షం మాట్లాడుతుంది.. అవి నేరుగా లేకపోతే అవి వామపక్ష విషయాలు కాదు" అని మాట్లాడితే ఇంకా మరింత సబబుగా ఉండేది. పార్టీలు ప్రధానం కాదు - విషయాలు ప్రధానం అని చర్చించి వుండాల్సింది.

బీజేపీ తాజా మాజీ అధ్యక్షుడు నాగేశ్వర్‌ను కలవాలనుకోవడం వెనుక ఏం జరిగి ఉండవచ్చు? నాగేశ్వర్ స్వతంత్ర జర్నలిస్టుగానే కాదు, తటస్థ విశ్లేషకుడుగా కన్పించడం మొదలయి ఉండాలి. అక్కడే చిక్కంతా ఉంది. ఆయన తటస్థంగా ఉన్నారని బీజేపీ భ్రమించిందా? లేక అదే వాస్తవమా? ఎక్కువ మందిని చేరుకునే వ్యూహంలో భాగంగా తనను తాను ఆయన తటస్థంగా ఉంచుకోదలిచారా? మోడీ జనాకర్షణ శక్తి గురించి మాట్లాడినప్పుడో, కృషి ఉంటే మనుషులు కిషన్‌రెడ్డి అవుతారని చెప్పినప్పుడో, మర్యాద పురుషోత్తముడైన రాముడిని కీర్తించినప్పుడో, పాకిస్థాన్ పై బాలాకోట సైన్యంపై దాడులను కీర్తించినప్పుడో వారికి ఆ తటస్థ స్థానం కనపడి ఉండాలి. పార్లమెంటు భవనాన్ని మోడీ ప్రారంభిస్తే తప్పేంటి? అన్న నాగేశ్వర్ వాదన సాక్ష్యంగా కన్పడి ఉండవచ్చు. నిజానికి తటస్థ స్థానంతో పాము విరగదు - కర్ర చావదు. మనందరికీ నేటి రాజకీయ పార్టీలతో అనేక స్థాయిలలో పేచీ ఉండవచ్చు. కానీ కేంద్రం నుంచి ఎడమ వైపునకు ఉన్న రాజకీయాలతో పేచీ అక్కర్లేదు. ఆ విషయం చెప్పడానికి సందేహించ నక్కరలేదు. లౌకికదేశంగా ఈ దేశాన్ని మిగుల్చుకోవడానికి, రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి మనం ప్రజాప్రయోజనం దిశగా అంటే కేంద్రం నుంచి ఎడమవైపుకే నిలబడి కలబడవల్సివుంది. ఇప్పటికిప్పుడు నాగేశ్వర్‌ను ఈ కారణంగా ఎవరు ట్రోల్ చేసినా అది తప్పిదమే అవుతుంది. బీజేపీ సోషల్ మీడియా ఆశించిందే మీరంతా చేసినట్లు అవుతుంది. ఒక శక్తివంతమైన మనిషిని కాసేపు ఈ శక్తులకు ఎదురుగా నిలబెట్టినా అదొక కావల్సిన డైవర్షన్. తులసిచందుపై ట్రోల్స్ అనాగరికం, జుగుప్సాకరం. అలాగే నాగేశ్వర్‌పై ట్రోల్స్ కూడా అవాంఛనీయం, అనవసరం.

సెల్:9848809990

ప్రశ్నించే గొంతులను కాపాడుకుందాం...

అవును రాజ్యం ఇప్పుడు
బానిసత్వాన్ని కోరుకుంటుంది
వర్ణ వ్యవస్థను పునరుద్ధరణ చేస్తుంది
మనుధర్మ శాస్త్రాన్ని మళ్లీ వెలికి తీస్తుంది
మానవత్వాన్ని చంపుతూ
మనిషిని హత్య చేస్తుంది
చివరికి...
దేశ సంపదను కార్పొరేట్
చేతులకి అమ్ముతుంది
నిజానికి దేశాన్ని పరిపాలించేది
రాజకీయ నాయకులు కాదు
ఆదానీలు, అంబానీలు
ఇప్పుడు కార్పొరేట్ సంస్థలు,
దళారీలు పరాన్న జీవులు
మనిషి గొంతు పై నిలబడి
మానవాళి శ్వాసను నలిపేస్తున్నాయి
మిత్రమా..!!
ఇంకా ఎంతకాలమని
అలా అంధకారపు నిద్రలో
అమాయకపు జోలపాటకి
అసమర్థంగా నిద్రపోతుంటావు
లే.....!
ఈ దేశపు మార్పు మనతోనే
మొదలవాల్సి ఉన్నదని ఓ విప్లవ కవి చెప్పినట్టు...





నాదెండ్ల శ్రీనివాస్
9676407140

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విధానాలను సామాజిక మాధ్యమాల ద్వారా ఎండగడుతున్న స్వతంత్ర జర్నలిస్టు తులసిచందుపై వేధింపులు, ట్రోలింగ్, ప్రాణహాని దాడుల బెదిరింపులు అన్నీ నేటి ఫాసిస్టు ధోరణికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. తమ విధానాలను ప్రశ్నించే వ్యక్తులు, శక్తులపై దాడి చేయడం బీజేపీ అధికారంలోకి వచ్చాక పరిపాటి గానే మారింది. గతంలో సల్మాన్ రష్దీ, అరుంధతి రాయ్, తస్లీమా నస్రీన్ తదితరుల పైన ఇదే పద్ధతులలో మతశక్తులు,వారి భావాలను అంగీకరించనటువంటి కొన్ని ముస్లిం ఉగ్రవాద సంస్థలు, ఇతర సంస్థలు ఫత్వా తదితర పద్ధతుల ద్వారా వారి ప్రాణాలు తీయడానికి పిలుపునివ్వడం జరిగింది. అదే విధంగా కల్బుర్గి, గోవింద్ పన్సారే, గౌరీ లంకేష్, దబోల్కర్ తదితర మేధావులు, సామాజిక ఉద్యమకారులను బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ మతోన్మాద మూకలే హత్య చేసినటువంటి ఘటనలు మరచిపోకముందే ఆ దాడుల పరంపర కొనసాగింపే ఈనాటి తులసిచందుపై ప్రాణహాని బెదిరింపులు. ప్రజాస్వామ్యంలో సామూహిక, సామాజిక వ్యవస్థాపరమైన అంశాలపైన బాధ్యతాయుతంగా స్పందించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. రాజ్యాంగంలోని 19వ అధికరణం ప్రకారం వాక్ స్వాతంత్రం అంటే తన అభిప్రాయాలను స్పష్టంగా, నిర్మోహమాటంగా వ్యక్తం చేసే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అయితే వ్యక్తిగత దూషణలు కాకుండా వ్యవస్థాపరమైన లోపాలు, పాలనాపరమైన వైఫల్యాలు, కొన్ని వర్గాల పైన జరుగుతున్న దాడులు, అసమానతలు, అంతరాలు దోపిడీ, పీడన కొనసాగుతున్నటువంటి సమాజంలోని బలహీనతల పైన, బలవంతుల ఆకత్యాలపైన స్పందించడం ప్రతి ఒక్కరి బాధ్యత కూడా. అయితే అందుకు అవగాహన, ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవం, ధైర్యం, సమర్థించుకునే ప్రతిభ, పరిష్కారాలు చూపగలిగిన ప్రజ్ఞ, సమన్వయ పరచగలిగే నేర్పు, అభివృద్ధి సంక్షేమానికి బాటలు వేయగల స్థితప్రజ్ఞత వంటి లక్షణాలు ఉన్నవాళ్లు మాత్రమే మరింత ముందుకు వెళ్లి ప్రజాక్షేత్రంలో విమర్శిస్తూ పాలకులు, ప్రజలలో తమ బాధ్యత మరిచిన ప్రతి వ్యక్తిని తట్టి లేపుతారు. స్వతంత్ర జర్నలిస్టు తులసీచందు యూట్యూబ్ ఛానల్ ద్వారా గత కొంత కాలంగా ప్రజా క్షేత్రంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక, పాలనాపరమైన అంశాలపైన తనదైన శైలిలో హేతుబద్ధంగా ఆలోచిస్తూ, కారణాలను విశ్లేషిస్తూ, పరిష్కారాలు సూచిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకుపోతున్న విషయాన్ని మనం గమనించాలి. ఆమె ప్రసంగాలు ప్రజాస్వామిక వాదులకు, ప్రజాస్వామ్య శక్తులకు, ప్రజాసంఘాలు, అఖిలపక్షాలు, మేధావులు, రచయితలు, మెరుగైన సమాజాన్ని కోరుకునే ప్రతి ఒక్కరికి నిరంతరం కాంతిని ప్రసరిస్తూనే ఉన్నాయి. అయితే రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కు మేరకు తన ప్రతిభ ఆధారంగా సమీకరించిన జ్ఞానాన్ని ప్రజలకు వివరించి చెప్పినప్పుడు ఎవరికీ అభ్యంతరం ఉండవలసిన అవసరం లేదు.

ఆరాటంతో చేసే రచనలు, ప్రసంగాలు, పత్రికా కథనాలు, ప్రచురణలు స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలే గానీ తమ వైఫల్యాలు బయటపడుతున్నాయని భయపడి, తమ మనుగడకు ప్రమాదం ముంచుకొస్తున్నదని గుర్తించి, నైతికంగా గెలవలేక దొడ్డిదారిలో బెదిరించడం అమానుషం.అయితే ప్రశ్నించే గళాలను లొంగదీసుకోవడం, వెంటాడి, వేటాడి భయపెట్టడం వంటి చర్యలకు ఎక్కడ ఎవరు పాల్పడినా చరిత్ర వారిని క్షమించదు. పాలనా లోపాలు, ఎన్నికల వైఫల్యాలు, వాగ్దానాలు, ప్రలోభాలు, హామీల పేరుతో ప్రజలను మోసగిస్తున్న విధానాలు, ప్రజాధనం దుర్వినియోగం, ప్రభుత్వ సంస్థల నిర్వీర్యం వంటి అనేక అంశాల పైన ప్రజలు ఓడిపోతున్న ప్రతి విషయాన్ని కూడా ఎత్తిచూపే ప్రయత్నం చేయడం నేరం ఎలా అవుతుందో నేడు మతతత్వశక్తులు ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. తాత్కాలికంగా అస్త్ర బలం, అంగ బలం,ధన బలం, అధికార బలంతో అణిచివేయాలని కుట్ర పన్నినా శాశ్వతంగా ఓటమే అని గుర్తిస్తే మంచిది. పరువు ప్రతిష్టలు దిగజారినప్పుడు, వ్యక్తిగత విమర్శ చేసినప్పుడు నిలదీసి అడిగినా తప్పులేదు గానీ సామూహిక అంశాలపైన బాధ్యతాయుతంగా మాట్లాడినప్పుడు బెదిరించడం అంటే తమ ఉనికికి ప్రమాదం ఏర్పడిందని గ్రహించడమే కదా! హెచ్చరించడం అంటే తమ లోపాన్ని అంగీకరించడమే. అసహనం వ్యక్తం చేయడమంటే సహించేతత్వాన్ని కోల్పోవడమే అని ఆ వర్గాలు గుర్తిస్తే మంచిది. వర్గ పోరాటం ప్రతి చోట అనివార్యమైన నేపథ్యంలో ప్రశ్నించే వాళ్లను, ప్రజలను చైతన్యపరిచే మేధావులను బెదిరించే వాళ్ళు ఉంటారనే ఆలోచన ప్రజలకు, ప్రజా ఉద్యమకారులకు కూడా ఉండాల్సిన అవసరం ఉంది. దీపాన్ని కాపాడుకుంటేనే వెలుగును పంచినట్లు సమర్థులు, ప్రతిభావంతులు, సామాజిక బాధ్యత గల కొన్ని వర్గాలను కాపాడుకోవడం ద్వారా మాత్రమే భావితరాలకు కూడా భవిష్యత్తును ఇచ్చిన వాళ్ళమవుతాము. తమ విన్నపాలను, వైఫల్యాలను మనసులోనైనా అంగీకరించి తలవంచుకునే పరిస్థితులు వస్తాయి. కాబట్టి ప్రజల కోసం పనిచేసే ఇలాంటి వారిని ప్రజలే కాపాడుకోవాలి. అది వారి కనీస బాధ్యతగా కూడా ఉండాలి. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఎక్కడికక్కడ ఇలాంటి బెదిరింపులు, మందలింపులను ఖండిస్తూ నైతిక మద్దతు ప్రకటించడం తమ వాణిని బలంగా వినిపించడమే నేడు మన ముందున్న తక్షణ కర్తవ్యం. జర్నలిస్టు తులసీచందు కూడా వాస్తవాలను తెలిపినందుకు, ధైర్యంగా మాట్లాడినందుకు తన కుటుంబానికి దూరం చేసే కుట్ర జరుగుతుందని అయినప్పటికీ తన లక్ష్యం నుండి వైదొలిగే ప్రసక్తే లేదని చేసిన ప్రకటన ఇప్పటికైనా మతతత్వ వాదులకు, అసాంఘిక శక్తులకు చెంపపెట్టుగా పరిణమిస్తుందని ఆశిద్దాం. అదే సందర్భంలో ఆమెకు అన్ని విధాల రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. ఆమెకు ఎటువంటి హాని జరిగినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి సామాజిక ఉద్యమకారులు, హేతువాదులు, లౌకికవాదులు, కవులు, కళాకారులు, పాత్రికేయులు తదితర ప్రశ్నించేవారిని, సత్యశోధన చేసేవారిని సమాజ మేలుకోరే ప్రతి ఒక్కరినీ రక్షించుకోవాల్సిన బాధ్యత నేటి ప్రభుత్వాల పైన, ప్రజలపైనా ఉన్నది. త

పీటముడులు విప్పేదెలా?

- చట్టాలలో వైరుధ్యాలు
- ఎవరి సంప్రదాయం వారిదే
- అన్నింటినీ కలగలపడం సాధ్యమా?
- యూసీసీ రూపకల్పన అంత ఈజీ కాదు

న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికలలో రాజకీయ లబ్ధి పొందేందుకు ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తీసుకురావాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. అయితే ఇది అంత సులభమేమీ కాదు. ఎందుకంటే మన దేశం వివిధ మతాలు, జాతుల సమ్మేళనం. ఎవరి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతులు వారివి. మతాచారాల ప్రకారమే చట్టాలను రూపొందించారు. అయితే యూసీసీ వస్తే ఇవేమీ ఉండవు. కులం, మతం, జాతి వేరైనా అందరికీ ఒకే చట్టం. భారత రాజ్యాంగం కుల మతాలకు అతీతంగా ప్రతి పౌరుడికీ సమానత్వపు హక్కుకు, న్యాయం పొందే హక్కుకు, జీవించే హక్కుకు హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో వివిధ మతాల వారికి ప్రస్తుతం అమలులో ఉన్న వేర్వేరు చట్టాలను విశ్లేషించి, ఆ తర్వాతే యూసీసీ ముసాయిదాను రూపొందించాల్సి ఉంటుంది.

వీలునామా రాయకుండా చనిపోతే...

ఇప్పుడు వివిధ మతాల వారికి ఉద్దేశించిన చట్టాలలో వైరుధ్యాలను గమనిద్దాం. ఉదాహరణకు ఒక తండ్రికి కుమారుడు, కుమార్తె ఉన్నారనుకోండి. కుమారుడికి ఓ కొడుకు, కుమార్తెకు ఓ కొడుకు ఉన్నారు. ఓ దుర్ఘటనలో తండ్రి, కుమారుడు, కుమార్తె చనిపోయారు. ఇక మిగిలింది ఇద్దరు మనుమలు. తండ్రి తన ఆస్తుల పంపకానికి సంబంధించి వీలునామా ఏదీ రాయలేదు. తండ్రి హిందువు



అయితే ఆస్తి ఎవరికి చెందుతుంది ? కుమారుడి కొడుకుకే చెందుతుంది. కుమార్తె కొడుకుకి ఏమీ రాదు. అదే తండ్రి పార్సీయో, క్రైస్తవుడో అయితే ఆయన ఆస్తి ఇద్దరు మనుమలకూ సమానంగా లభిస్తుంది. ముస్లింలకు సంబంధించిన చట్టంలో రెండు రకాల వారసులు ఉంటారు. వీలునామా రాయకుండా చనిపోయిన వ్యక్తి ఆస్తిని చట్టబద్ధమైన వారసులందరికీ సమానంగా పంచడం ఒక పద్ధతి. రెండో పద్ధతిలో వారసులందరూ ఆస్తిని పంచుకున్న తర్వాత మిగిలిన ఆస్తిని సంబంధీకులెవరైనా ఉంటే వారికి ఇస్తారు. దీని ప్రకారం కుమారుడి కొడుకుకు, కుమార్తె కొడుకుకు ఆస్తిలో వాటా వచ్చినా కుమారుడి కొడుకుకే ఎక్కువ ఆస్తి లభిస్తుంది. ఎందుకంటే కుమార్తె కొడుకు సంబంధీకుల జాబితాలో ఉంటాడు.

వివాహిత మహిళ చనిపోతే...

ఇప్పుడు మరో ఉదాహరణ తీసుకుందాం. ఒక మహిళ ఉందనుకుందాం. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఒక బాబు. ఒక పాప. వృద్ధులైన తల్లిదండ్రులకు ఆ మహిళ ఒక్కరే కుమార్తె. ప్రమాదంలో ఆ మహిళ చనిపోయిందనుకుందాం. ఆమె వారసుడెవరనేది మత విశ్వాసాలపై ఆధారపడి ఉంటుంది. ఆ మహిళ పార్సీ అనుకుందాం. ఆస్తిని నాలుగు భాగాలు చేసి భర్తకు ఒక భాగం, ఇద్దరు పిల్లలకూ చెరో భాగం ఇస్తారు. మిగిలిన భాగాన్ని రెండుగా విభజించి తల్లిదండ్రులకు పంచుతారు. ఒకవేళ ఆ మహిళ క్రైస్తవ మతస్థురాలు అనుకుందాం. ఆస్తిని మూడు భాగాలు చేసి భర్త, ఇద్దరు పిల్లలకు పంచుతారు. ఆమె తల్లిదండ్రులకు ఏమీ లభించదు. ఒకవేళ ఆ మహిళకు పిల్లలు లేకపోతే భర్తకు, తండ్రికి చెరి సగం పంచుతారు. తల్లికి ఏమీ రాదు. మహిళ హిందూ స్త్రీ అయితే భర్త, పిల్లల మధ్య ఆస్తిని పంచుతారు. తల్లిదండ్రులకు వాటా రాదు. అయితే ఆ మహిళ పిల్లలు లేని వితంతు

వు అయినా, భర్తకు వారసులు ఎవరూ లేకపోయినా అప్పుడు ఆమె తల్లిదండ్రులకు ఆ ఆస్తి చెందుతుంది. ఒకవేళ ఆ మహిళ ముస్లిం అయితే ఆమె భర్తకు నాలుగో వంతు ఆస్తి వస్తుంది. కుమార్తెకు వచ్చే ఆస్తికి రెట్టింపు ఆస్తి కుమారుడికి వస్తుంది. తల్లిదండ్రులు కూడా ఒక వాటా పొందవచ్చు. ఆ మహిళకు పిల్లలు లేరనుకుందాం. భర్తకు సగం ఆస్తి దక్కుతుంది. మిగిలినది తల్లిదండ్రులకు పంచుతారు.

జటిలం...సంక్లిష్టం

దీనిని బట్టి మనకు అర్థమయ్యేది ఏమంటే ఒక్కో సందర్భంలో ఒక్కో మతానికి చెందిన చట్టం మేలైనదిగా అనిపిస్తుంది. మత ప్రాతిపదికన రూపొందించిన చట్టాలు జటిలమైనవి, సంక్లిష్టమైనవి. వారసత్వానికి సంబంధించి వీటి మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. ఆస్తి పంపకాల విషయంలోనే కాదు... దత్తత, వివాహం, విడాకుల విషయంలో కూడా ఈ చట్టాలు పరస్పర విరుద్ధంగా, జటిలంగానే ఉన్నాయి. దీనికి కారణమేమిటి ? మన దేశంలో అన్ని రకాల సంప్రదాయాలనూ పాటిస్తారు. వీటిని క్రోడీకరిస్తే నిబంధనలన్నీ పీటముడులతో కూడి ఉంటాయి. మినహాయింపులూ ఉంటాయి. ఈ చిక్కుముడులను విడదీసి, ఒకేలా ముడివేస్తే అదే యూసీసీ అవుతుంది. అయితే అందరికీ ఆమోదయోగ్యమైన చట్టం సాధ్యమేనా? ఒక మతానికి సంబంధించిన నిబంధనలు మరో మతానికి వర్తించవు. మహిళకు సంబంధించిన ఉదాహరణనే తీసుకుందాం. వివాహిత మహిళ ఆస్తిలో వాటా విషయంలో క్రైస్తవులు, హిందువులు తల్లిదండ్రులను పరిగణనలోకి తీసుకోరు. పార్సీ, ముస్లిం మహిళలు అయితే తల్లిదండ్రులు కూడా ఆమె ఆస్తిలో వారసులు అవుతారు. మరి ఎవరి సంప్రదాయాన్ని అనుసరించాలి? ఏది ఉత్తమం? ఎవరి సంప్రదాయాన్ని పాటించినా మరొకరి హక్కుకు భంగం కలుగుతుంది. సమానత్వం, న్యాయం, జీవనం వంటి విషయాలలో రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విఘాతం ఏర్పడుతుంది. ఓ పెద్ద మనిషి చెప్పినట్టు 'యుసీసీ అంటే అందరికీ ఒకే చట్టం. అయితే అది లింగ సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన ఏకరీతి సూత్రాలపై ఆధారపడిన వ్యక్తిగత చట్టాల సమాహారం'.

తెలంగాణకు ప్రవాసులు చేయూతనివ్వాలి

- తొమ్మిదేండ్లలో తెలంగాణ స్వరూపం మారిపోయింది
- కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న అవార్డులే దీనికి నిదర్శనం

: ఫ్లోరిడాలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణకు ప్రవాసులు చేయూతనివ్వాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు. బీఆర్ఎస్ యూఎస్ఏ కన్వీనర్ చందు తాళ్ల అధ్యక్షతన అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం టంపాలో నిర్వహించిన ప్రవాస తెలంగాణవాసుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొమ్మిదేండ్లలో తెలంగాణ స్వరూపం మారిపోయిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో రాష్ట్రానికి ఇస్తున్న అవార్డులే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఈ సందర్భంగా హిందూ టెంపుల్ ఆఫ్ ఫ్లోరిడాలో వేదపండితులు మంత్రిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫ్లోరిడా అధ్యక్షులు అనిల్ బందారం, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి కానుగంటి, టోని జాను, మోహిత్ కర్పూరం పాల్గొన్నారు.

నాంపల్లి నియోజకవర్గంలో బోగస్ ఓట్లను తొలగించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి కాంగ్రెస్ నేత ఫిరోజ్‌ఖాన్ ఫిర్యాదు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ నాంపల్లి నియోజకవర్గంలోని బోగస్ ఓట్లను తొలగించాలని టీపీసీసీ డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్‌కు కాంగ్రెస్ నేతలు ఫిరోజ్‌ఖాన్, జి. నిరంజన్, మెట్టుసాయికుమార్ ఫిర్యాదు చేశారు. అనంతరం ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ నాంపల్లి నియోజకవర్గంలో దాదాపు లక్ష ఓట్లు బోగస్‌గా ఉన్నాయన్నారు.

ఇండ్లు లేకపోయినా ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఇండ్లు ఉన్న చోట దొంగ ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దాదాపు 10 వేల ఓట్లు మరణించిన వారివి ఉన్నా ఇప్పటి వరకు ఆ ఓట్లను తొలగించలేదని విమర్శించారు. నాంపల్లి నియోజక వర్గంలో బోగస్ ఓట్లపై 20 రోజుల్లోగా విచారణ జరిపిస్తామని వికాస్ రాజ్ హామీ ఇచ్చారని తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్‌లో దాదాపు 6 నుంచి 7 లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయనీ, అవి లేకపోతే ఎంఐఎం నాయకులు అసదుద్దీన్, అక్బరుద్దీన్ గెలిచే అవకాశం లేదని చెప్పారు.

వివేకా హత్య కేసులో పీఏ కృష్ణారెడ్డి పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో తనను బాధితుడిగా పరిగణించాలంటూ ఆయన వ్యక్తిగత సహాయకుడు (పీఏ), హత్య కేసులో ఏ9గా ఉన్న ఎం.వి. కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. కేసును పూర్తిగా విని మెరిట్స్ ఆధారంగా నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను హైకోర్టుకే వదిలేసింది. ఈ కేసులో దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని సవాల్ చేసే అధికారం తనకు ఉన్నట్టు ఆదేశాలు ఇవ్వాలన్న కృష్ణారెడ్డి అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో జోక్యం చేసుకోడానికి తాము సిద్ధంగా లేమని జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. వాద ప్రతివాదులకు ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయో హైకోర్టు ముందే చెప్పుకోవచ్చని ధర్మాసనం స్వతంత్రత కల్పించింది.

దూదేకుల ముస్లింలపై వైసీపీ సర్కారు వివక్ష

బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దూదేకుల ముస్లింలపై వైసీపీ ప్రభుత్వం వివక్షను చూపుతున్నదని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఏపీ అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ విమర్శించారు. ఆదుకుంటామంటూ సీఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు నీటి మూటలేనని చెప్పారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ముస్లిం మైనార్టీ పెద్దలతో ఆయన భేటీ అయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షలకుపైగా ఉన్న దూదేకుల జనాభా కూడా ముస్లింలలో అంతర్భాగమని సీఎం జగన్ గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేద ముస్లింలకు అందుతున్న అన్ని ప్రభుత్వ పథకాలనూ దూదేకుల వారికీ వర్తింపజేయాలనే కనీస అవగాహన లేని వైసీపీ ప్రభుత్వానికి వారి నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

ఎన్నికల మ్యానిఫెస్టోలో ముస్లిం మైనార్టీ అమ్మాయిల వివాహానికి దుల్హన్ పథకం కింద వైఎస్సార్ కానుకగా రూ.లక్ష ఆర్థిక సహాయం చేస్తానంటూ నాలుగేండ్ల క్రితం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నిబంధనల పేరుతో ఆ పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయకపోవడం దారుణమన్నారు. దీని కారణంగా పేద ముస్లిం కుటుంబాల్లో కుమార్తెలకు ఆర్థిక భారంతో పెండ్లి చేయలేక తల్లి దండ్రులు ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ షాదీతోఫా అందిస్తూ, దూదేకులకు వైఎస్సార్ కల్యాణమస్తు అందిస్తున్నారని విమర్శించారు. దూదేకుల సమాజం పట్ల వైసీపీ ప్రభుత్వం పట్ల అవలంభిస్తున్న వివక్ష ఇది కాదా?అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం ఇకనైనా మొద్దునిద్ర వీడాలనీ, లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో దూదేకులకు బీఆర్ఎస్ పార్టీ పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆలమూరు రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీకి నల్ల జెండాలతో స్వాగతం : రాములు నాయక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రానికి రానున్న ప్రధాని మోడీకి నల్ల జెండాలతో స్వాగతం పలుకుతామని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ నేత, ఎమ్మెల్యే శుక్లా అనుచరుడు ఓ గిరిజనుడిపై మూత్ర విసర్జన చేసినా పట్టించుకోలేదని విమర్శించారు.

గవర్నర్‌ను కలిసి వినతిపత్రాలు ఇస్తామన్నారు. బీజేపీ అధ్యక్షులు జి. కిషన్‌రెడ్డి ఈ అంశంపై కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. బీజేపీ నాయకులను మా తాండల్లోకి రానివ్వబోమని ఆయన హెచ్చరించారు.

అమరవీరుల గుర్తింపు కోసం కమిటీ వేయండి

రేవంత్‌రెడ్డికి రాముల్‌నాయక్ వినతి

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలు ఆర్పించిన అమరవీరులను గుర్తించేందుకు టీపీసీసీ కమిటీ వేయాలని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఆ కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందంటూ వివిధ సందర్భాల్లో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమరవీరుల కుటుంబాలకు రూ 25వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిందనీ, అందుకు అర్హులను గుర్తించాలని కోరారు.

తెలంగాణలో బీజేపీ ఖతం: వీహెచ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఖతమైందని మాజీ ఎంపీ వి హనుమంతరావు చెప్పారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని మోడీ ఇప్పటి వరకు బీసీలకు ఏం చేయలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇస్తామంటూ రాహుల్ గాంధీ హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి పార్లమెంట్‌లో బీసీలకు మూడు సీట్లు కేటాయించాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ

15 ఏళ్లలో అల్ఫా సిటీల జాబితాలోకి హైదరాబాద్



- చేతిలో 15 ప్రాజెక్టులు
- ఈ ఏడాది రూ.2,000 కోట్ల బుకింగ్స్ లక్ష్యం
- రామ్కీ ఎస్టేట్స్ ఎండి నంద కిశోర్ వెల్లడి

నవ తెలంగాణ - బిజినెస్ బ్యూరో

నిర్మాణ రంగంలో హైదరాబాద్ దూసుకువెళ్తుందని రామ్కీ ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ నంద కిశోర్ అన్నారు. వచ్చే 15 ఏళ్లలో ప్రపంచ దిగ్గజ నగరాల జాబితాలో హైదరాబాద్ చేరనుందన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, దుబాయి, లండన్ లాంటి అల్ఫా సిటీస్ ఫ్లస్‌లో చోటు సంపాదించుకోనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి విస్తృతావకాశాలు ఉన్నాయన్నారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామ్కీ ప్రాజెక్టులను వర్చ్యువల్‌గా సందర్శించడానికి వీలుగా 'రామ్కీ వర్స్'ను ఆయన ఆవిష్కరించారు. ఇది జులై 14 నుంచి పూర్తిగా అందుబాటులోకి రానుందన్నారు. గృహాలు కొనుగోలు చేసేటప్పుడు ఇది వాస్తవిక అనుభవానికి దగ్గరగా చూపిస్తుందన్నారు. నగరానికి చెందిన డెవలపర్ వర్చువల్ రియాలిటీ కోణంలోకి ప్రవేశించడం ఇదే తొలిసారి అన్నారు. రామ్కీ గ్రూప్‌లో భాగమైన తమ సంస్థ ఆర్థిక సంవత్సరం 2023-24లో రూ.2,000 కోట్ల బుకింగ్ విలువను చేరాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందుకోసం రూ.45 లక్షల నుంచి రూ.5 కోట్ల విలువ చేస్తే నివాసాల నిర్మాణం, విక్రయాలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నయ్, బెంగళూరు తదితర నగరాల్లో 15 ప్రాజెక్టులను చేపడుతుందన్నారు. 15 మిలియన్ల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఈ ప్రాజెక్టుల విలువ రూ.10వేల కోట్లుగా ఉంటుందన్నారు. వచ్చే మూడున్నరేళ్లలో ఈ ప్రాజెక్టులు పూర్తి కానున్నాయని వెల్లడించారు. రామ్కీ ఎస్టేట్ వద్ద రూ.6500 కోట్ల విలువ చేసే స్థలాలు ఉన్నాయని తెలిపారు. విశాఖపట్నంలో వైజాగ్ క్రిస్టల్ పేరుతో ప్రాజెక్టును చేపడుతున్నామన్నారు. వచ్చే మూడేళ్లలో తమ సంస్థ గిడ్డంగుల వ్యాపారంలోకి ప్రవేశించనుందన్నారు. ఈ సమావేశంలో రామ్కీ ఎస్టేట్స్ సిఎఫ్ఒ జితేంద్ర లబడియా, డైరెక్టర్ తారక రాజేష్, మార్కెటింగ్ అండ్ సేల్స్ వైస్ ప్రెసిడెంట్ శరత్ బాబు పాల్గొన్నారు.

లాలాజలంతోనే జన్యుపర వ్యాధుల గుర్తింపు



- భారత్‌లో లార్డ్స్ మార్క్ జీనోమ్ టెస్టింగ్

హైదరాబాద్ : లాలాజలంతోనే జన్యుపరమైన వ్యాధుల గుర్తింపునకు వీలుగా లార్డ్స్ మార్క్ ఇండస్ట్రీస్ సబ్సిడరీ సంస్థ భారత్‌లో లార్డ్స్ మార్క్ మైక్రో బయోటెక్ సంస్థ జీనోమ్ టెస్టింగ్‌ను ప్రారంభించింది. బుధవారం హైదరాబాద్‌లో లార్డ్స్ మార్క్ ఇండస్ట్రీస్ ఫౌండర్ సచిదనాంద్ ఉపద్యాయ్, లార్డ్స్ మార్క్ మైక్రోబయోటెక్ సిఇఒ సుబోద్ గుప్తా మీడియాతో మాట్లాడారు. లాలాజలంతోనే జన్యుపరంగా సంక్రమించే వ్యాధులను జీనోమ్ టెస్టింగ్‌లో గుర్తించవచ్చన్నారు. దీనిలో 99 శాతం ఖచ్చితత్వంతో ఫలితాలు ఉంటాయన్నారు. ఈ టెస్టింగ్ కిట్ విలువ రూ.8,000 నుంచి రూ.16,000 మధ్య ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎనిమిది రకాల టెస్ట్‌లను చేస్తున్నామన్నారు. తొలి దశలో రూ.20 కోట్ల పెట్టుబడులు పెడుతున్నామన్నారు. వచ్చే ఐదేళ్లలో రూ.100 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. లాలాజల ఆధారిత పరీక్షకు రక్తం లేదా ఫ్లెబోటోమిస్ట్ వెలికితీత అవసరం లేదన్నారు. దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లోనూ ఈ సేవలు లభ్యమవుతాయన్నారు. ఏడాదికి 50 వేల నుంచి ఒక లక్ష పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీనోమ్ టెస్టింగ్ కిట్‌లను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయవచ్చన్నారు. ఈ పరీక్షల్లో ఒక వ్యక్తి యొక్క జన్యుపరమైన ప్రమాదాన్ని (ప్రిడిస్పోజిషన్) ఒక లక్షణం లేదా పరిస్థితి పరంగా అంచనా వేయవచ్చన్నారు. క్యాన్సర్, హృదయ సంబంధ రుగ్మతలు, మధుమేహం లేదా వంశపారంపర్య స్థితి వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించవచ్చన్నారు. దేశవ్యాప్తంగా 48 నగరాల్లో జీనోమ్ టెస్టింగ్‌ను సరసమైన ధరలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తొలుత మెట్రో, టైర్ 1 నగరాల్లో తదుపరి 3-4 సంవత్సరాలలో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలపై దృష్టి సారించనున్నామన్నారు. ఈ సమావేశంలో ఆ సంస్థ సీనియర్ జెనిటిక్ కన్సల్టెంట్ జైనాబ్ అబ్బాస్ పాల్గొన్నారు.

హైటెక్స్‌లో అంతర్జాతీయ ఫార్మా ఎగ్జిబిషన్ ప్రారంభం



హైదరాబాద్ : ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మాక్సిల్) నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫార్మా ఎగ్జిబిషన్ (ఐపెక్స్) బుధవారం ప్రారంభమైంది. నగరంలోని హైటెక్స్‌లో 5,6,7 తేదిల్లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను తొలిరోజు ఫార్మెక్సిల్ ఛైర్మన్ ఎస్‌వి వీరమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని 200 దేశాలను చేరుకోవడంలో మన భారతీయ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ ప్రత్యేకతను చాటుకుందన్నారు. గతేడాది 25.39 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఎగుమతులు నమోదు చేశామన్నారు. ఈ ఏడాది 28 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని పెట్టుకున్నామన్నారు. భారత ఎగుమతుల్లో ఔషదాల రంగం ఐదవ స్థానంలో ఉందన్నారు. ఈ సదస్సులో దాదాపు 400 మంది ఎగ్జిబిటర్లు, 660 మంది విదేశీ సందర్శకులు పాల్గొంటున్నారని.. మొత్తంగా 10000 మందికి పైగా సందర్శకులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు.

లాయిడ్స్ టెక్నలాజీ సీఈఓగా శిరీష్ ఓరుగంటి



హైదరాబాద్ : బ్రిటన్‌కు చెందిన చెందిన ప్రముఖ ఫైనాన్సియల్ సర్వీసెస్ గ్రూపుల్లో ఒకటైన లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ హైదరాబాద్ కేంద్రంగా ఉన్న తన కొత్త లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్‌గా శిరీష ఓరుగంటిని నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఐటి రంగంలో ఆమెకు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. ఇంతక్రితం జెసి పెన్నీలో ఎండి, బోర్డు మెంబర్‌గా ఉన్న శిరీష లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్‌లో చేరారు. భారతదేశంలో జెపి మోర్గాన్ చేజ్ ఇన్ టెక్నాలజీకి మొదటి మహిళా మేనేజింగ్ డైరెక్టర్, మాస్టర్ కార్డ్ కోసం ఆర్కిటెక్చర్ డేటా, షేర్డ్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఈ ఏడాది చివర్లో టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో లీడర్ షిప్ టీమ్‌కు ప్రస్తుతం నియామకాలు జరుగుతున్నాయి.

తీస్తా సెతల్వాద్‌కు ఊరట

- మధ్యంతర బెయిల్‌ను పొడిగించిన సుప్రీం కోర్టు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



ప్రముఖ సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు సుప్రీంకోర్టులో మరోసారి ఊరట లభించింది. అత్యున్నత న్యాయస్థానం ఆమె మధ్యంతర బెయిల్‌ను పొడిగించింది. అలాగే ఆమెకు సాధారణ బెయిల్‌ను తిరస్కరించిన గుజరాత్ హైకోర్టు ఉత్తర్వులపై మధ్యంతర స్టేను కూడా పొడించింది. జులై 19 వరకు అరెస్టు నుంచి వెసులుబాటు కల్పించింది. సాధారణ బెయిల్ కోసం గుజరాత్ హైకోర్టును ఆశ్రయించిన తీస్తా సెతల్వాద్ అభ్యర్థనను గుజరాత్ హైకోర్టు తిరస్కరించడంతో పాటు తక్షణమే లొంగిపోవాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ తీస్తా సెతల్వాద్ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ దీపాంకర్ దత్తలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం విచారించింది. అఫిడవిట్ దాఖలు చేయాలని గుజరాత్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 19 మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది. గుజరాత్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాతో పాటు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వాదనలు వినిపించారు. కొన్ని పత్రాలను అనువదించడానికి తమకు సమయం కావాలని ధర్మాసనాన్ని కోరారు. తీస్తా సెతల్వాద్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కాగా గుజరాత్‌లో 2002లో జరిగిన అల్లర్ల విషయంలో ప్రత్యేక దర్యాప్తు బృందానికి, పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చారన్న ఆరోపణలపై తీస్తా సెతల్వాద్‌పై గతంలో కేసు నమోదైంది. అమాయకులను కేసులో ఇరికించేందుకు కుట్రపన్నారంటూ ఆమెపై పోలీసులు అభియోగాలు మోపారు. ఆ కేసులో భాగంగా గతంలో గుజరాత్ యాంటీ టెర్రర్ స్క్వాడ్ (ఏటీఎస్) ముంబయిలో తీస్తాను అదుపులోకి తీసుకున్నది. ఆ తరువాత ఆమె రెండు నెలల పాటు జైల్లో ఉన్నారు. తనకు బెయిల్ నిరాకరిస్తూ సెషన్ కోర్టు, హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సెతల్వాద్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై గత సెప్టెంబర్ ఆమెకు ఊరట లభించింది. అప్పటి నుంచి మధ్యంతర బెయిల్‌పై ఆమె బయట ఉన్నారు. అయితే ఆమె సాధారణ బెయిల్ కోసం కొద్దిరోజుల క్రితం గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె అభ్యర్థనను గుజరాత్ హైకోర్టు తిరస్కరించడంతో పాటు తక్షణమే లొంగిపోవాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. సుప్రీంకోర్టులో ఊరట దక్కింది. గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఏడు రోజుల పాటు సుప్రీంకోర్టు ధర్మాసనం స్టే విధించింది. తాజాగా మధ్యంతర బెయిల్‌ను జులై 19 వరకు పొడిగించింది.

ఇజ్రాయిల్ యుద్ధ నేరాలు

మిలిటరీ దాడుల్లో నల్గురు పిల్లలతో సహా 13 మంది పాలస్తీనీయుల మృతి

- పలు దేశాల ఖండన

జెరూసలేం : జెనిన్‌లో ఇజ్రాయిల్ యుద్ధ నేరాలతో మానవతా విపత్తును సృష్టించింది. వెస్ట్‌బాంక్ ఉత్తర ప్రాంతంలోని జెనిన్ పట్టణంపై ఇజ్రాయిల్ ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నడూ లేని రీతిలో అతి పెద్ద దాడికి సోమవారం పాల్పడింది. వైమానిక దాడులు, కాల్పులతో గత రెండు రోజులుగా జెనిన్ పట్టణం నెత్తురోడింది. పాటు ఇజ్రాయిల్‌లోని పచ్చి మితవాద నెతన్యాహు ప్రభుత్వం సాగించిన ఈ భయానక దాడిలో నలుగురు పిల్లలతో సహా 13 మంది చనిపోయారు. కనీసం 120 మంది గాయపడ్డారు. వీరిలో 20 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సొంత గడ్డపై శరణార్థులుగా మారిన పాలస్తీనీయులను శిబిరాల్లో నుంచి తరిమేసేందుకు ఇజ్రాయిల్ సైన్యం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. దీంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పాలస్తీనా భూ భాగాలను అక్రమంగా ఆక్రమించుకోవడమే గాక, వారి ఆయుధాలను, వారి జీవనోపాధిని కూడా లాగేసుకోవడం, పాలస్తీనా పౌరులపై మిలిటరీ దుర్మార్గంగా దాడులకు దిగడం అంతర్జాతీయ న్యాయ నియమాలను, మానవ హక్కులను తుంగలో తొక్కడమేనని పలు దేశాలు ఇజ్రాయిల్ చర్యను ఇరాన్, లెబనాన్, సిరియా, మొరాకోతో సహా పలు దేశాలు ఖండించాయి. ఇజ్రాయిల్‌లో మితవాద ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు నెరపుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం పాలస్తీనీయులపై ఇంత ఘోరం జరుగుతున్నా కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటు అని పలువురు విశ్లేషకులు పేర్కొన్నారు.



ఇదిలా ఉండగా జెనిన్ పట్టణం నుండి ఇజ్రాయిల్ బలగాలు వైదొలగాయని నెతన్యాహు ప్రభుత్వం బుధవారం తెలిపింది. ప్రస్తుతానికి ఈ ఆపరేషన్‌ను ముగిస్తున్నామని, జెనిన్‌లో విస్తృత సైనిక చర్య అనేది ఒకసారికి సంబంధించినదిగా చెప్పలేమని నెతన్యాహు అన్నారు.. జెనిన్ శివార్లలో మిలటరీ శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. 2022 ప్రారంభం నుండి వెస్ట్ బ్యాంక్‌లో దాదాపుగా ప్రతి రోజూ ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతూనే వుంది. 56ఏళ్ళ ఆక్రమణ ఫలితమే ఈ హింస అని పాలస్తీనియన్లు విమర్శిస్తున్నారు.

అప్పుల ఊబిలో కేంద్రం

- గతేడాదికన్నా రూ.3 లక్షల కోట్లు ఎక్కువ

న్యూఢిల్లీ : కేంద్రం భారీ స్థాయిలో బహిరంగ మార్కెట్ రుణాలకు ఎగబడుతోంది. 2021-22తో పోలిస్తే 2022-23 తీసుకున్న రుణాలు మరింత పెరిగినట్లు తేలింది. తాజాగా రాష్ట్రాల ఆర్థిక కార్యదర్శుల సమావేశానికి తయారుచేసిన ఒక నివేదికలో ఈ విషయం సుస్పష్టమైంది. రాష్ట్రాలు చేసిన రుణాల వృద్ధి కన్నా కేంద్రం చేసిన రుణ వృద్ధి అత్యంత అధికంగా ఉండడం గమనార్హం. గురువారం అన్ని రాష్ట్రాల ఆర్థికశాఖల కార్యదర్శులతో రిజర్వ్‌బ్యాంకు ఒక కీలక సమావేశాన్ని నిర్వహించనుంది. ఇందులో రిజర్వ్‌బ్యాంకు నిర్వహించే బహిరంగ మార్కెట్ రుణాల పరిస్థితిపైనా ప్రత్యేక అజెండాతో చర్చ జరగనుంది. ఈ నేపథ్యంలో కొన్ని గణాంకాలను కూడా వెల్లడించింది. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో మార్కెట్ బారోయింగ్స్‌లను ప్రస్తావించింది. ఇందులో 2021-22 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం గ్రాస్ మార్కెట్ బారోయింగ్స్ ద్వారా తీసుకున్న రుణాలు ఏకంగా రూ.11,27,382 కోట్లుగా తేలింది. అదే 2022-23లో రూ.14,21,000 కోట్లు బహిరంగ మార్కెట్ రుణాలుగా తీసుకోవడం గమనార్హం.

అంటే ఏడాదిలో రూ.2,93,618 కోట్లు పెరిగింది. అదే రాష్ట్రాలు తీసుకున్న రుణాలను పరిశీలిస్తే.. 2021-22లో రూ.7,01,626 కోట్లుగా రుణాలు రికార్డయితే, 2022-23లో రూ.7,58,392 కోట్లుగా ఉన్నాయి. అంటే గతేడాది కన్నా సుమారు రూ.56 వేల కోట్లు మాత్రమే పెరిగింది.ఇక నెట్ రుణాల జాబితాలో కేంద్రం 2021-22లో రూ.8,63,103 రుణంగా తీసుకుంటే, 2022-23లో రూ.11,08,261 కోట్లు తీసుకుంది. ఒక్క ఏడాదికే రూ.2,45,158 కోట్లు అదనంగా రుణం తీసుకున్నట్లయింది. అదే విభాగంలో రాష్ట్రాలు రూ.4,92,483 కోట్లు రుణాలుగా ఉంటే, 2022-23లో రూ.5,18,829 కోట్లుగా తేలింది. కేవలం రూ.26,346 కోట్లు మాత్రమే గతేడాదికన్నా పెరిగాయి.

చైనా వరదల్లో 15మంది మృతి

బీజింగ్ : చైనాలోని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీస్తుండగా, మరికొన్ని చోట్ల వరదలు ముంచెత్తుతున్నాయి. తాజాగా వంఝూ జిల్లాలో కుండపోతగా కురిసిన వర్షాలకు 15మంది మరణించగా, మరో నలుగురు గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో చైనా వరదల నిరోధక సంస్థకి చెందిన వర్కింగ్ గ్రూపు బుధవారం ఉదయం దక్షిణ చైనాలో వరదలతో సతమతమవుతున్న చాంగ్‌కింగ్ ప్రాంతానికి చేరుకుంది. అక్కడ పరిస్థితులను సమీక్షిస్తోంది. మంగళవారం మధ్యాహ్నమే అత్యవసర ప్రతిస్పందనా చర్యలు తీసుకున్న తర్వాత చాంగ్‌కింగ్ అధికారులతో ప్రభుత్వం అత్యవసర సమావేశం జరిపింది. అనంతరం వర్కింగ్ గ్రూపును అక్కడకు పంపించారు. భారీ వర్షాలకు వాంఝూ జిల్లాలో 24 పట్టణాలు, ఉప జిల్లాలు దెబ్బతిన్నాయి. దాదాపు 2వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 570హెక్టార్ల మేరా పొలాలు పూర్తిగా నాశనమయ్యాయి. 3కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లింది.

జమ్ముకాశ్మీర్‌లో రోడ్డు ప్రమాదం

- నలుగురు మృతి

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తానామండి ఏరియాలో ఓ కారును బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను కారులోంచి బయటకు తీసి రాజౌరిలోని గవర్నమెంటు మెడికల్ కాలేజ్ అండ్ అసోసియేటెడ్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టు మార్టానికి పంపారు.

ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. కారును ఢీకొట్టిన వాహనాన్ని గుర్తించేందుకు సిసి ఫుటేజ్‌ను పరిశీలించనున్నట్లు తెలిపారు.

పోలవరం పునరావాస ప్యాకేజీ ఇవ్వండి

- రాష్ట్రానికి 77 వేల టన్నుల బియ్యం ఇవ్వాలి
- ప్రధాని మోడీకి ఏపీ ముఖ్యమంత్రి జగన్ వినతి



న్యూఢిల్లీ : పోలవరం నిర్వాసితులకు సహాయ పునరావాస ప్యాకేజీ కేంద్రం ఇవ్వాలని, పోలవరం అంచనా వ్యయం రూ. 55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి 'పోలవరం తొలిదశలో భాగంగా మరో 36 గ్రామాల్లోని నిర్వాసితులకు సహాయ, పునరావాస ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. ఇది ఇస్తేనే తొలిదశ పూర్తి అవుతుంది. కనుక మొత్తం పోలవరం తొలిదశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు ఇవ్వాలి' అని ప్రధానిని కోరారు. ప్రధానితో దాదాపు ఒక గంట 20 నిమిషాల పాటు ముఖ్యమంత్రి భేటీ సాగింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రధానితో సమావేశానికి ముందు కేంద్రం హోంమంత్రి అమిత్ షాతో దాదాపు 45 నిమిషాలు పాటు వైఎస్ జగన్ భేటీ అయ్యారు. ప్రధానితో సమావేశం తరువాత కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆయన కలిశారు. అయితే ఈ భేటీల అనంతరం పాత డిమాండ్లతో కూడిన ప్రకటననే ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది.

రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని, సుదీర్ఘకాలంగా ఇది పెండింగ్‌లో ఉందని ప్రధానమంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు తొలిదశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు అవసరం అవుతుందని, ఇది కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉందని తెలిపారు. పోలవరం తొలిదశ నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ ఇప్పటికే రూ.12,911.15 కోట్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అన్నారు. అయితే తొలిదశలో మరో 36 గ్రామాల్లోని నిర్వాసితులకు సహాయ పునరావాసం ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని, ఇది ఇస్తేనే తొలిదశ పూర్తైనట్లని ప్రధాని మోడీకి జగన్ వివరించారు. ఈమేరకు జలశక్తి శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసిన రూ.1,310.15 కోట్లను వెంటనే రీయింబర్స్ చేయాలని కోరారు.

రాష్ట్రానికి బియ్యం ఇవ్వాలి

జాతీయ ఆహార భద్రతా చట్టం అమల్లో హేతుబద్ధత లోపించిన విషయాన్ని మరోసారి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో 56 లక్షల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రేషన్ దక్కకుండా పోతోందని, దీనివల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.5,527 కోట్ల భారం పడుతోందని, సత్వరమే జోక్యంచేసుకోవాలని కోరారు.

టీఎస్ఎంసీలో వివరాలను అప్‌డేట్ చేసుకోండి

- డాక్టర్ ఎం.రాజీవ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంబీబీఎస్ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో తమ పేరును నమోదు చేసుకోవాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సలహాదారు, తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎం.రాజీవ్ నాయక్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది వరకే నమోదు చేసుకుని ఐదేండ్లు పూర్తయిన వారు పునరుద్ధరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. జులై 15లోపు తాజా నమోదు, పునరుద్ధరణ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లేకపోతే ప్రాక్టీస్ చేసేందుకు గానీ, తెలంగాణలో తొలిసారిగా నిర్వహిస్తున్న టీఎస్ఎంసీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హత కోల్పోతారని చెప్పారు.

వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో నోటీసులు

- సెప్టెంబర్ 5లోగా సమాధానం చెప్పాలి
- విజయసాయి రెడ్డి, జగతి పబ్లికేషన్స్, భారతి సిమెంట్స్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయి రెడ్డి, జగతి పబ్లికేషన్స్, భారతి సిమెంట్స్‌కు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. అక్రమాస్తుల కేసులో సీబీఐ నమోదు చేసిన కేసులు విచారణ తేలే వరకు ఈడీ కేసుల విచారణ ఆపాలంటూ గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బుధవారం ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన ధర్మాసనం సెప్టెంబర్ 5వ తేదీలోపు సమాధానం చెప్పాలని ప్రతివాదులుగా ఉన్న విజయసాయిరెడ్డి, భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్‌లకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు పూర్తి స్థాయి విచారణ సుప్రీంకోర్టులో ద్విసభ్య ధర్మాసనం చేపట్టాలా.. లేక త్రిసభ్య ధర్మాసనం చేపట్టాలన్నది ఆరోజు నిర్ణయిస్తామని ధర్మాసనం పేర్కొంది. సెప్టెంబర్ 5కి తదుపరి విచారణ వాయిదా వేసింది.

మంత్రి పదవికి రాజీనామా చేయలేదు

- హైదరాబాద్‌లో 9న దక్షిణ భారత రాష్ట్రాల బీజేపీ నేతల సమావేశం : జి.కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ: అనారోగ్య కారణంవల్ల కేంద్ర మంత్రి వర్గ సమావేశానికి దూరంగా ఉన్నాననీ, కేంద్రమంత్రి పదవికి తాను రాజీనామా చేయలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డి చెప్పారు. అధిష్టానం ఏ ఆదేశాలిచ్చినా పాటిస్తానని, తనకు అధ్యక్ష పదవి ఇస్తారని అనుకోలేదని అన్నారు. ఈ మేర కు బుధవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. నిన్న (మంగళ వారం) తాను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు జెపి నడ్డా ఫోన్ చేసి విషయం చెప్పారన్నారు. గతంలో ఉమ్మడి ఏపీకి 2 సార్లు, తెలంగాణ తొలి బీజేపీ అధ్యక్షుడిగా కూడా పనిచేశానన్నారు. నాలుగోసారి పార్టీ అధ్యక్షుడిగా తనపై అధిష్టానం బాధ్యతలు అప్పగించిందని అన్నారు. ఎంపీగా గెలిచాక హోం శాఖ సహాయ మంత్రిగా, ఆ తరువాత రెండేండ్లు క్యాబినెట్ మంత్రిగా పని చేశానని కిషన్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను ఏనాడూ పార్టీని ఏదీ కోర లేదని, పార్టీ ఆదేశాలు పాటిస్తూ వస్తున్నానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో కృషి చేస్తా ననీ, సమిష్టి ప్రణాళిక తయారుచేసుకుని ముందుకు వెళ్తానని చెప్పారు. ప్రధాని మోడీ వరంగల్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. వరం గల్‌ను రైల్వే తయారీ హబ్‌గా తయారు చేయబోతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఇంత పెద్ద వర్క్ షాప్, తయారీ యూనిట్ రావడం ఇదే మొదటి సారని అన్నారు. అలాగే మోడీ నూతన జాతీయ రహదారులకు భూమి పూజ చేస్తారని, వరంగల్ ఎయిర్ స్ట్రిప్ ద్వారా నేరుగా హెలి కాప్టర్‌లో అక్క డికి వచ్చి, భద్రకాళి దర్శనం చేసుకుంటారన్నారు. రైల్వే యూ నిట్‌ను వర్చు వల్‌గా ప్రారంభిస్తారన్నారు. 9న దక్షిణ భారత రాష్ట్రాల బీజేపీ ముఖ్య నేతల సమావేశం హైదరాబాద్‌లో జరుగుతుందని కిషన్ రెడ్డి తెలిపారు.

అత్యంత వేడిమి రోజుగా జులై 3

న్యూయార్క్ : జులై 3వ తేదీ సోమవారం ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేడిమి రోజుగా నమోదయినట్టు అమెరికా జాతీయ పర్యావరణ కేంద్రాల డేటా పేర్కొంది. ఆ రోజున సగటు ప్రపంచ ఉష్ణోగ్రత 17.01 డిగ్రీల సెల్సియస్‌గా (62.62 ఫారెన్‌హీట్) నమోదైంది. ఇప్పటివరకు 2016 ఆగస్టులో నమోదైన 16.92 డిగ్రీల సెల్సియస్ రికార్డుగా వుంది. దాన్ని అధిగమించి జులై 3వ తేదీ నాటి ఉష్ణోగ్రతలు సరి కొత్త రికార్డు సృష్టించాయని ఆ డేటా తెలిపింది. ప్రపంచ దేశాల్లో దాదాపుగా అన్ని చోట్లా వడగాడ్పులు వీస్తూనే వున్నాయి. ఈ రికార్డులేవీ కూడా మనం సంతోషించే మైలురాళ్ళు కావని లండన్‌కి చెందిన వాతావరణ శాస్త్రవేత్త ఫ్రెడరిక్ ఓట్టో వ్యాఖ్యానించారు. ప్రజలకు, పర్యావరణ వ్యవస్థలకు ఇదొక మృత్యు శాసనమని అన్నారు.

అమెరికాలో మళ్లీ తుపాకీ ఘోష

- 8మంది మృతి, 28మందికి పైగా గాయాలు

వాషింగ్టన్ : అమెరికాలో తుపాకీ సంస్కృతి మళ్లీ బుసలు కొట్టింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. రెండు రోజుల్లోనే 8మంది దాకా ఈ తుపాకీ సంస్కృతికి బలయ్యారు. మరో 28మంది దాకా గాయపడ్డారు. వాషింగ్టన్ డిసిలో బుధవారం తెల్లవారు జామున జరిగిన కాల్పుల్లో ఇద్దరు పిల్లలతో సహా 9మంది తీవ్రంగా గాయపడ్డారు. తెల్లవారు జామున ఒంటిగంట ప్రాంతంలో రాజధానిలోని మీడ్ స్ట్రీట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నవారిపై కారులో వచ్చిన దుండగులు కాల్పులు జరిపి పారిపోయారని అసిస్టెంట్ చీఫ్ పార్సన్స్ తెలిపారు. బాల్టిమోర్‌లో ఆదివారం తెల్లవారు జామున జరిగిన దాడిలో అయిదుగురు చనిపోయారు... టెక్సాస్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మునిగివున్న ప్రజలపై సోమవారం అర్ధరాత్రి సమయంలో పలువురు వ్యక్తులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా, 8మంది గాయపడ్డారని అధికారులు చెప్పారు.

ఎయిర్‌పోర్టులో రూ.2 కోట్ల బంగారం పట్టివేత

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ఒక వ్యక్తి నుంచి రూ.2 కోట్ల విలువైన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనపర్చుకున్నారు. అలాగే, మరో వ్యక్తి నుంచి భారీ ఎత్తున విదేశీ సిగరెట్లను కూడా స్వాధీనపర్చుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయి, కంబోడియా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఇద్దరు అనుమానిత వ్యక్తులను కస్టమ్స్ అధికారులు సోదా చేశారు. ఇందులో ఒక వ్యక్తి లో దుస్తుల్లో దాచుకున్న బంగారం ముద్దలు బయట పడ్డాయి. వాటిని లోదుస్తుల్లో రహస్యంగా కుట్టించుకున్న జేబుల నుంచి ఈ బంగారం ముద్దలు బయట పడ్డాయి. వాటి విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అలాగే, మరో వ్యక్తి బ్యాగును సోదా చేయగా అందులో పెద్ద మొత్తంలో విదేశీ సిగరెట్లు బయట పడ్డాయి. వాటిని గణించగా లక్షకు పైగా సిగరెట్లు ఉన్నాయని తేలింది. ఈ సిగరెట్ల విలువ కూడా భారీ మొత్తంలోనే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పోర్చుగల్‌కు 300మంది క్యూబన్ డాక్టర్లు

లిస్బన్ : క్యూబన్ డాక్టర్లను తమ దేశంలో నియమించుకోవడం పోర్చుగల్‌కు ఇదే మొదటిసారి కాదు. 2009లో పోర్చుగీస్ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలోకి 44మంది డాక్టర్లను స్వాగతించింది. తాజాగా 300మంది క్యూబన్ డాక్టర్లను జాతీయ ఆరోగ్య సర్వీస్ (ఎన్‌హెచ్ఎస్) లోకి తీసుకోవడం ద్వారా ఆరోగ్య వ్యవసథను బలోపేతం చేయాలని ప్రధాని ఆంటానియో కోస్టా భావిస్తున్నారు. వీరు పోర్చుగల్‌లో మూడేళ్ళపాటు పనిచేస్తారు. సాధ్యమైనంత త్వరలో వీరిని చేర్చుకునేందుకు ఇప్పటికే అధికారులు చర్యలు చేపట్టారు. యురోపియన్ భూభాగానికి వెలుపల వుండే విదేశీయులు ఇటువంటి వాటికి అర్హత సాధించాలంటే పలు చర్యలు తీసుకోవాల్సి వుంది. ముందుగా ఈ డాక్టర్లందరూ పోర్చుగల్‌లో పలు పరీక్షలను ఎదుర్కొనాల్సి వుంటుంది. ఈ పరీక్షలు కేవలం మెడిసిన్‌లోనే కాదు, ఇతరత్రా కూడా వుంటాయి. వీరికి పోర్చుగీస్ భాష కూడా వచ్చి వుండాలి.